ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 16.05.2026 | సంపుటి :12 సంచిక : 296 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## చేప ప్రసాదం.. జూన్ 8 నుంచి



- పంపిణీ తేదీలు ప్రకటించిన బత్తిని కుటుంబం
- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు

**హైదరాబాద్(జనంసాక్షి):** మృగశిర కార్తె సందర్భంగా ఆస్తమా బాధితులకు బత్తిని కుటుంబీకులు తరతరాలుగా చేప ప్రసాదం అందిస్తున్న విషయం విదితమే. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా చేప ప్రసాద పంపిణీని చేపట్టేందుకు బత్తిని కుటుంబం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జూన్ 8వ తేదీ రాత్రి నుంచి నాంపల్లి మిగతా 2లో..


## అధ:పాతాళానికి రూపాయి



మరింత పతనం • తొలిసారి రూ.96 దాటిన విలువ

**ముంబయి(జనంసాక్షి):** అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ భారీగా పతనం అయ్యింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా డాలర్ విలువ తొలిసారి రూ.96 మార్కును దాటింది. గురువారం ట్రేడింగ్ సెషన్‌లో 95.96 వద్ద కనిష్ఠాన్ని తాకిన రూపాయి విలువ.. శుక్రవారం మధ్యాహ్నం 96.07 కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల పెరుగుదల నేపథ్యంలో మన రూపాయిపై మిగతా 2లో..

## ఈసారి ముందుగానే నైరుతి



మే 26న కేరళ తీరాన్ని తాకనున్న రుతుపవనాలు

**న్యూఢిల్లీ (జనంసాక్షి):** ఈయేడు రుతుపవనాలు కాస్తా ముందుగానే రానున్నాయి. ఈ మేరకు దేశ ప్రజలకు వాతావరణ విభాగంచల్లని కబురు వినిపించింది. దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థకు జీవనాడి అయిన నైరుతి రుతుపవనాలు మే 26న కేరళను తాకనున్నాయి. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు పలకరిస్తుంటాయి. కానీ ఈసారి ఐదు రోజుల ముందే కేరళను తాకే మిగతా 2లో..

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు
కేకే నేతృత్వంలో

# కమిటీ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్ణయం

సభ్యులుగా పొన్నం, కోదండరాం, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలు త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యే క కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం జీఓ ఆర్టీ నం.679 జారీ చేసింది. ఉద్యమంలో కొందరు ప్రాణత్యాగం చేయగా, మరికొందరు శారీరక వైకల్యానికి గురయ్యారు. పలువురిపై కేసులు నమోదై జైలు జీవితం గడిపిన నేపథ్యంలో, వారి సేవలను అధికారికంగా గుర్తించాలనే చాలాకాలంగా ఉన్న డిమాండ్‌పై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కమిటీ చైర్మన్‌గా కే. కేశవరావుఈ కమిటీకి ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ మిగతా 2లో..

బండి సంజయ్..నీ కొడుకును పోలీస్‌స్టేషన్‌లో

# అప్పగించు



మేం బాధితురాలి పక్షాన ఉన్నాం.. అందుకే పోక్సో కేసు పెట్టాం

- నిందితుడు భగీరథ్ పారిపోవడం తప్పు
- ఎలాంటి కేసులనైనా ధైర్యంగా ఎదుర్కోవాలి
- పారిపోతే సమస్యలకు పరిష్కారం దొరకదు
- ఈ కేంద్రమంత్రి నైతిక బాధ్యత వహించాలి
- ఎవరిది తప్పనే విషయాన్ని విచారణ అధికారులు తెలుస్తారు: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ పారిపోవడం తప్పు అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ నైతిక బాధ్యత తీసుకుని కుమారుడిని అప్పగించాలని.. అలా మిగతా 2లో..

### 2034 వరకు నేనే సీఎం

ఆ తరవాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా

- రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం
- ఆయన తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

2లో..

### సిటీసివిల్ కోర్టుకు బండి సంజయ్

పరువు నష్టం కలిగించేలా వార్తల ప్రసారంపై పిటీషన్

పత్రిక క్లిప్పింగ్‌లు, డిజిటల్ కంటెంట్ తొలగించాలని కోర్టు ఆదేశాలు

2లో..

ఐదు రాష్ట్రాల ఎన్నికల తరువాత

# పెట్రో మంట



లీటర్ పెట్రో, డీజిల్ రూ.3 చొప్పున పెంపు

ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమరు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన మిగతా 2లో..

### మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం

ఎన్నికలు కాగానే ధరలు పెంచారు

భగ్గుమన్న ప్రతిపక్షాలు

### పెట్రో ధరల పెంపు అనివార్యం

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల విమర్శలు అసంబద్ధం

మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

# నీట్ పరీక్ష జూన్ 21న..

- కొత్త షెడ్యూల్ విడుదల చేసిన ఎన్‌టీఏ
- వచ్చే ఏడాది నీట్ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తాం
- లీకేజీని అరికట్టేందుకు చర్యలు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. జూన్ 21న, ఆదివారం ఈ పరీక్ష జరగనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష–యూజీని (నీట్–యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. మిగతా 2లో..



అవి ఆత్మహత్యలు కావు..

### వ్యవస్థలు చేసిన హత్యలు

నీట్ విద్యార్థుల ఆత్మహత్యపై రాహుల్ ఆందోళన

ప్రభుత్వం ఎప్పుడు కళ్లు తెరుస్తుందని ప్రశ్న

2లో..

### కీలక సూత్రధారి అరెస్టు

పి.వి.కులకర్ణిని పుణెలో అదుపులోకి తీసుకున్న సీబీఐ

గతేడాది లీక్ ఆనవాళ్లపై దృష్టి సారింపు

లీక్ పేపర్లతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు

పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచంపై

# పెను ప్రభావం

- హర్మూజ్ విషయంలో అంతా అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలి
- యూఏఈ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ
- ఇరు దేశాల మధ్య పలు కీలక ఒప్పందాలు
- మోదీ విమానానికి ఎస్కార్ట్.. ఫైటర్ జెట్‌తో యూఏఈ ప్రత్యేక స్వాగతం



**దుబాయ్(జనంసాక్షి):** ప్రధాని నరేంద్రమోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని యూఏఈ ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం శుక్రవారం మధ్యాహ్నం యూఏఈ గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ ఫైటర్ జెట్ ఎస్కార్ట్‌గా వచ్చింది. తమ వాయుసేన కోసం ఒగా రూపొందించిన యుద్ధ విమానం ఎఫ్–16 బ్లాక్ 60 'డెజర్ట్ ఫాల్కన్'ను పంపింది. అబుదాబిలో ప్రధాని విమానం ల్యాండ్ అయ్యే వరకు వెంటే వచ్చింది. ఐరోపా దేశాల పర్యటనకు బయల్దేరిన మోదీ మధ్యలో యూఏఈకి వెళ్లారు. కేవలం కొన్ని గంటలే అక్కడ ఉండనున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

**యూఏఈపై ఇరాన్ దాడి సరికాదు: మోదీ**
యూఏఈపై ఇరాన్ దాడిని ప్రధాని మోదీ ఖండించారు. పశ్చిమాసియా యుద్ధ మిగతా 9లో..




## ప్రతీ పేదకుటుంబానికి సొంతిల్లు

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

జూన్ 2న ఆదిలాబాద్ నుంచి రెండో విడత ప్రారంభం

జాయింట్ సర్వే తో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్(జనంసాక్షి):** పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మ గౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంతరెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే ప్రక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో (వంద శాతం సబ్సిడీతో) పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి తెలంగాణా ప్రభుత్వం దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా శుక్రవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులతో మంత్రి మిగతా 2లో..



పినరయ్ విజయన్‌తో కేరళ కాబోయే సీఎం

## సతీశన్ భేటి

**తిరువనంతపురం(జనంసాక్షి):** కేరళ తదుపరి సీఎం అభ్యర్థి వి.డి.సతీశన్– తాత్కాలిక ముఖ్యమంత్రి పినరయి విజయన్ తో భేటీ అయ్యారు. శుక్రవారం పలువురు కాంగ్రెస్ నేతలతో పాటు సతీశన్ తిరువనంతపురంలోని పినరయి విజయన్ నివాసానికి వెళ్లి.. మర్యాద పూర్వకంగా కలిశారు. వారిద్దరూ రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. గత ఐదేళ్లుగా సతీశన్ ప్రతిపక్ష నేతగా కొనసాగుతుండగా.. పినరయి విజయన్ ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. మే 4న వెలువడిన కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఘన విజయం సాధించింది. ఈ క్రమంలోనే రాష్ట్ర తదుపరి సీఎంగా సతీశన్‌ను ఎంపిక చేసినట్లు ఏఐసీసీ ప్రకటించింది. గురువారం అధిష్ఠానం నిర్ణయం మిగతా 9లో..

# తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ

రూ.650 కోట్లతో భారీ ఫుడ్ ఇండస్ట్రీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను దామోదరతో కలసి ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**సంగారెడ్డి(జనంసాక్షి):** తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమి కోసం తాము పని చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. జహీరాబాద్ లాంటి ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహలు పర్యటించారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి మంత్రులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మిగతా 2లో..




# అమెరికన్లను నమ్మలేం..

శాంతి స్థాపనలో ఇండియా కీలక పాత్ర పోషించాలి: ఇరాన్ విదేశాంగ మంత్రి


**టెహ్రాన్(జనంసాక్షి):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు, శాంతి స్థాపనకు భారత్ కీలక పాత్ర పోషించగలదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అన్నారు. ఈ ప్రాంతంలో శాంతి నెలకొనేందుకు ద్వైపాక్షిక, దౌత్యపరమైన చర్చలు మాత్రమే మార్గం అని అబ్బాస్ అభిప్రాయపడ్డారు. బ్రిక్స్ సదస్సులో భాగంగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రస్తుతం ఇండియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత యుద్ధాన్ని ముగించేందుకు ఇండియా ఎలాంటి నిర్మాణాత్మక ప్రతిపాదనతో వచ్చినా స్వాగతిస్తామని ప్రకటించారు. ప్రాంతీయ శాంతి భద్రతల్ని ప్రభావితం చేసే శక్తి ఇండియాకు ఉందని ఆయన అన్నారు. ఈ విషయంలో భారత్ మిగతా 9లో..

# తెలంగాణలో హడావిడి సర్ వద్దు

ఇప్పట్లో ఎన్నికలు లేనందున ప్రక్రియను నిదానంగా చేపట్టాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌కు పీసీసీ వినతి

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని మహేశ్‌కు మార్‌గౌడ్ అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృందం ఎస్ఈసీ సుదర్శన్‌రెడ్డిని కలిసి విన తిపత్రం సమర్పించింది. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లా డుతూ.. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐ ఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నర పాటు జాగ్ర త్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడిం చారు. జనగణన పక్రియ ఇప్పటికే జరుగు తోంది. జనగణనతో పాటే ఎస్ఐఆర్



నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలన్నారు. ప్రత్యక్షంగా 3–4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం,ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## బండి సంజయ్.. నీ కొడుకును పోలీస్‌స్టేషన్‌లో అప్పగించు

చేస్తే ఆయన గౌరవం పెరుగు తుందని తెలిపారు. ఎలాంటి కేసులనైనా ధైర్యంగా ఎదుర్కో వాలని.. పారిపోతే సమస్యలకు పరిష్కారం దొరకదని చెప్పారు. బండి సంజయ్ కింది నుంచి కష్ట పడి పైస్థాయికి వచ్చారని.. కు మారుడి కారణంగా ఆయనకు తలవంపులు వచ్చాయని సీఎం అన్నారు. తప్పయినా.. ఒప్పయినా ఆయన నిలబడి సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే కుమారుడిని పీఎస్‌లో అప్పగించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ కేసులో ఎవరిది తప్పనే విషయాన్ని విచారణ అధికారులు తేలుస్తారన్నారు.

## సిటీసివిల్ కోర్టుకు బండి సంజయ్

హైదరాబాద్(జనంసాక్షి): కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. తనపై మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్‌లో పరువు నష్టం కలిగించేలా వార్తలు ప్రసారం చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కుమారుడు భగీరథ్ పోక్సో కేసుతో పాటు తనపైన దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో తన పేరు, ఫొటోలు, వీడియోలు వాడొద్దంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన పేరుతో ఇప్పటివరకు సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానళ్లలో ఉన్న వీడియోలను తొలగించాలని కోర్టును బండి సంజయ్ కోరారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగేలా ప్రచారం జరుగుతోందని న్యాయస్థానానికి బండి సంజయ్ వివరించారు. ఈ క్రమంలో సోషల్ మీడియా, యూట్యూబ్, మీడియాలో బండి సంజయ్‌పై వచ్చిన కథనాలను వెంటనే తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది. తదుపరి ఆదేశాల వరకు ఎలాంటి కథనాలు ప్రసారం చేయొద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. యూట్యూబ్, సోషల్ మీడియాలో బండి సంజయ్‌కి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను వెంటనే తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది.

పత్రిక క్లిప్పింగ్‌లు, డిజిటల్ కంటెంట్ తొలగించాలని కోర్టు ఆదేశాలు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో ఊరట లభించింది. బండి భగీరథ్‌కు సంబంధించిన ఒక కేసు వ్యవహారంలో తనపై జరుగుతున్న రాజకీయ దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. ఈ వివాదంలో కేంద్ర మంత్రిని లక్ష్యంగా చేసుకుని ప్రసారం చేసిన అభ్యంతరకర కంటెంట్‌ను తక్షణమే తొలగించాలంటూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రతీ పేదకుటుంబానికి సొంతిల్లు

సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం ఇన్ ఛార్జి మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, మంత్రులు శ్రీమతి దాసరి అనసూయ సీతక్క, శ్రీమతి కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పి.బలరాం నాయక్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరును విజయవంతంగా పూర్తి చేసి లక్షలాది పేద కుటుంబాల సొంత ఇంటి కలలను నెరవేర్చామని తెలిపారు. 3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేయగా, దాదాపు 2.90 లక్షల వరకు గ్రౌండింగ్ కాగా, ఇందులో ఇప్పటికే సుమారు 50 వేల గృహ ప్రవేశాలు కూడా జరిగాయని, అలాగే మరో రెండు లక్షలకు పైగా ఇండ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో రెండు నెలల్లో పూర్తి అవుతాయని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయగా , ఐటిడిఎ ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు అదనంగా ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వచ్చే నెల రెండో తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఇది ఇంతటితో ఆగిపోదని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వరకు మూడవ, నాలుగవ విడతలుగా ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇరవై వేల వరకు ప్రభుత్వం నుంచి సహాయం పొందిన వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ పైలట్ గ్రామాల్లో ఆరువందలకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇండ్లను నిర్మించిన వారి బిల్లులను క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పేదవాడు తాను నివశిస్తున్న పూరి గుడిసె స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే , తమ ల్యాండ్ అంటూ ఫారెస్ట్ అధికారులు గానీ, సింగరేణి యాజమాన్యం కానీ అడ్డుపడొద్దని చెప్పారు. ఇండ్ల బేస్ మెంట్ కోసం చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తే రెవెన్యూ, పోలీసు అడ్డు చెప్పకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసే) శాఖ
కలెక్టరేట్ : మహబూబ్‌నగర్
ప్రాథమిక ప్రకటన
ఫారం-VI
(చట్టం-30/2013 సెక్షన్ 11(1) మరియు రూల్-19 యొక్క ఉప రూల్(1) చూడుము)
నెం. Rev/G1/LAG/0024/2026-G-Section తేది: 06-05-2026

తెలంగాణ ప్రభుత్వము / జిల్లా కలెక్టరు వారు మద్దిగట్ల గ్రామం, భూత్పూర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లాలో ఎ.3.15 గుంటల మొత్తం విస్తీర్ణం గల భూమిని ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం క్రింద ఘన్‌పూర్ బ్రాంచ్ కాలువపై కమలుద్దీన్ మేజర్ కాలువ యొక్క త్రవ్వకం కొరకు అవసరమై ఉన్నదని భావిస్తున్నారు. భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపన చట్టం 2013లో సక్రమ పరిహారం మరియు పారదర్శకత హక్కు యొక్క ఛాప్టర్-II & III యొక్క నిబంధనల యొక్క వర్తింపు నుండి మహాత్మాగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంనకు జి.ఒ.ఎం.ఎస్. నెం.51, ఇరిగేషన్ & సిఎడి (ఎల్ఎ ఆర్&ఆర్/ఎ2) శాఖ, తేది 25.07.2017 ప్రకారం ప్రభుత్వం మినహాయింపు ఇచ్చినది. అందువలన సదరు చట్టం యొక్క సెక్షన్ 4(1) క్రింద అవసరమైన విధంగా సామాజిక ప్రభావ మదింపు అధ్యయనం చేపట్టలేదు. భూసేకరణ కారణంగా నిర్వాసితులు కానున్న కుటుంబాల సంఖ్య లేవు. బాధిత కుటుంబాల యొక్క పునరావాస మరియు పునఃస్థాపన నిమిత్తం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నియమించినారు.

మద్దిగట్ల గ్రామం, భూత్పూర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లాలో ఎ.3.15 గుంటల మొత్తం కొద్దిగా ఎక్కువ లేదా తక్కువ భూమి కొలతల యొక్క భాగం సదరు పైన తెల్పిన ప్రాజెక్టు కొరకు ప్రకటించబడినది మరియు స్వాధీనత క్రింద దాని యొక్క వివరణాత్మక వివరణ దిగువ ఇవ్వబడినది.

గ్రామం:మద్దిగట్ల మండలం:భూత్పూర్ జిల్లా: మహబూబ్‌నగర్

| క్ర.సంఖ్య | సర్వే నెం. | మెట్ట/ త.మ/మాగాణి | భూమి రకం | సేకరించవలసిన విస్తీర్ణం (ఎకరాల్లో) ఎ.గుం. | ఆసక్తి గల వ్యక్తి పేరు & చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 401 | మెట్ట | పట్టా | 0.23 | బండ శ్రీశైలం తండ్రి బండ చంద్రయ్య | 399 | విబి | విబి | 402 | - | - |
| 2 | 402 | మెట్ట | పట్టా | 0.01 | పి.తిరుపతయ్య తండ్రి గోపాల్ | 397 | 402 | 399 | 404 | - | - |
| 3 | 403 | మెట్ట | పట్టా | 1.08 | భానుమతి భర్త జనార్దన్ | 397 | 402 | 399 | 404 | - | - |
| 4 | 404 | మెట్ట | పట్టా | 0.15 | ఎర్రగొల్ల వెంకటయ్య తండ్రి బుచ్చన్న | 412 | విబి | 403 | 405 | - | - |
| 5 | 443 | మెట్ట | పట్టా | 0.10 | ప్రభుత్వ భూమి | 433 | 439 | 429 | 435 | - | - |
| 6 | 444 | మెట్ట | పట్టా | 0.36 | సొస్సతి విజయలక్ష్మి భర్త మురళీధర్ | 445 | విబి | 437 | 450 | - | - |
| 7 | 534 | మెట్ట | పట్టా | 0.02 | సొస్సతి విజయలక్ష్మి భర్త మురళీధర్ | 530 | 444 | 445 | 549 | - | - |
| | మొత్తం: | | | 3.15 | | | | | | | |

ఇందుకు సంబంధించిన వారందరికి భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపన చట్టం 2013 (చట్టం నెం.30 ఆఫ్ 2013)లో సక్రమ పరిహారం మరియు పారదర్శకత హక్కు యొక్క సెక్షన్ 11(1) యొక్క నిబంధనల క్రింద ఇందుకు వారందరికీ ఈ ప్రకటన చేయబడినది.

భూమి యొక్క ప్లాన్ జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్ & ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ భూ.సే., ఆర్&ఆర్, యూనిట్-II, ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్ వారి కార్యాలయంలో ఏ పని రోజునైనా పనివేళల్లో పరిశీలించుకోవచ్చును. సదరు చట్టం యొక్క సెక్షన్ (12) క్రింద నిర్దేశించబడిన మరియు ఏర్పాటు చేయబడిన విధంగా వారి పనిని సక్రమంగా చేపట్టుట కొరకు భూమిలోకి ప్రవేశించుటకు మరియు సర్వే చేయుటకు ఏదేని భూమి యొక్క ఎత్తు పల్లాలను తీసుకొనుటకు, సబ్ సాయిల్ త్రవ్వుటకు లేదా బోర్ వేయుటకు & అవసరమైన అన్ని ఇతర చర్యలను చేపట్టుటకు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, ఎల్ఎ ఆర్ & ఆర్, యూనిట్-II, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, మహబూబ్‌నగర్ వారిని మరియు అతని సిబ్బందిని అధికారం ఇచ్చుటకు జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్ / కలెక్టర్-కం-సరియైన ప్రభుత్వం వారు సంతసించుచున్నారు.

చట్టంలోని సెక్షన్ 11(4) క్రింద కలెక్టర్ ముందస్తు ఆమోదం లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుంచి ఏ వ్యక్తి కూడా అట్టి భూమి యొక్క ఏదేని లావాదేవీలు లేదా లావాదేవీలకు కారణమయ్యే దేనిని అంటే అమ్మకం/ కొనుగోలు వగైరా లు చేయరాదు లేదా అట్టి భూములపై ఎటువంటి తాకట్టు రుణభారాలు కల్పించరాదు.

స్వాధీనతకు అభ్యంతరాలు ఏమైనా ఉంటే జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్ సమక్షంలో చట్టం యొక్క సెక్షన్ (15) క్రింద ఏర్పాటు చేయబడిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుంచి 60 (అరవై రోజులు) లోగా ఆసక్తి గల వ్యక్తులు వారి అభ్యంతరాలను సమర్పించవచ్చును.

సం/- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎల్ఎ ఆర్&ఆర్ యూనిట్-II, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, మహబూబ్‌నగర్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహబూబ్‌నగర్
సం/- జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్
DIPR RO.No.194/LA/PP/Advt/Pub/2026-27


# 2034 వరకు నేనే సీఎం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యుమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని పేర్కొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు కేకే నేతృత్వంలో కమిటీ

కోదండరాం, ఎమ్మెల్సీ విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు.తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ముందుగా స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేస్తుంది. అనంతరం వారికి ఎలాంటి గుర్తింపు, గౌరవం, సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది.త్వరగా నివేదిక ఇవ్వాలని ఆదేశంకమిటీ అవసరమైతే అధికారులను పిలిపించుకోవచ్చు. సమాచారం సేకరించవచ్చు. సమావేశాలు నిర్వహించవచ్చు. అవసరమైన ఇతర వ్యక్తులు, అధికారులను కూడా సంప్రదించవచ్చు. కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి వీలైనంత త్వరగా సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ఆదేశించింది.

### ఐదు రాష్ట్రాల ఎన్నికల తరువాత
## పెట్రో మంట

ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: దిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68 , చెన్నైలో 103.67 (?2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: దిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే.ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

### మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచుతూ ఆయిల్ కంపెనీలు కీలక నిర్ణయం తీసుకోవడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఘాటు విమర్శలు చేసింది. 'ద్రవ్యోల్బణ వ్యక్తి మోదీ. ఈరోజు మరోసారి ప్రజలపై కొరడా ఝుళిపించారు' అంటూ కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు చేసింది. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపును ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలకు ముడిపెట్టింది. ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ తన వసూళ్లు ప్రారంభించారంటూ ఆరోపించింది. ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయన్నది ఊహించినదే అంటూ తృణమూల్ కాంగ్రెస్ దుయ్యబట్టింది. ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్‌పై విలువ ఆధారిత పన్ను తగ్గిస్తుందా అంటూ పశ్చిమబెంగాల్‌లో కొత్తగా కొలువుదీరిన భాజపా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్రం ఇంధన ధరలు పెంచడంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ వ్యంగ్యంగా స్పందించారు. 'మీరు ముందుకుసాగాలంటే.. సైకిల్ ఒక్కటే ఆప్షన్' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి సైకిల్ తొక్కుతూ ఉన్న క్యారికేచర్‌ను పంచుకున్నారు. 'సైకిల్ పైనే ప్రయాణం కొనసాగిస్తామని ఇదివరకే చెప్పాం' అని దానికి ఆయన క్యాప్షన్ పెట్టారు. కాగా.. సమాజ్‌వాదీ పార్టీ గుర్తు సైకిల్ కావడం గమనార్హం. ఇక, పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. దీంతో ప్రభుత్వరంగ చమురు కంపెనీలపై ఆర్థిక ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఈక్రమంలోనే లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి.

ఎన్నికలు కాగానే పెటరో ధరలు పెంచారు

మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం: మంత్రి పొన్నం

న్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని గుర్తు చేశారు.గతంలో యూపీఏ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని చెప్పారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్, డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే నడ్డివిరుస్తారని అనుమానం వచ్చిందన్నారు. ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు. యుద్ధం కారణం చూపుతున్నారని.. యుద్ధం ఈరోజు రాలేదు.. ఇప్పటి నుండో ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నామని.. పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### పెట్రో ధరల పెంపు అనివార్యం

హైదరాబాద్(జనంసాక్షి): పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనిపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్య మైందన్నారు. అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు.

## అధఃపాతాళానికి రూపాయి

ఒత్తిడి పెరుగుతోంది.రూపాయి విలువ పతనమైతే.. దిగుమతి చేసుకునే వంట నూనెలు, చమురు, సహజవాయువు, ఎలక్ట్రానిక్స్, బంగారం, లగ్జరీ కార్లు, గడియారాలు మరింత ఖరీదవుతాయి. నిత్యావసరాల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. విదేశీ ఉన్నతవిద్య కోసం తమ పిల్లల్ని పంపిన తల్లిదండ్రులపై భారం పెరుగుతుంది. అదే సమయంలో మన దేశం నుంచి వస్తువులు, సేవలు ఎగుమతి చేసేవారికి మాత్రం లాభం కలుగుతుంది.

## తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ

పాల్గొన్నారు. 1500 మంది స్థానిక మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్‌కి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. తొగర్‌పల్లిలో ఇంత పెద్ద పరిశ్రమ రావడానికి నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారణమని చెప్పుకొచ్చారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో ఓ ఇండస్ట్రీ నెలకొల్పుతామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశ్రమల కోసం పెట్టుబడులను ఆకర్శిస్తున్నామని చెప్పుకొచ్చారు. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో 2047 నాటికి దేశ జాతీయ ఉత్పత్తిలో 10 శాతం ఉత్పత్తి పెంచేలా తాము పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. .

## ఈసారి ముందుగానే నైరుతి

అవకాశం ఉన్నట్లు ఐఎండీ శుక్రవారం వెల్లడించింది. భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ఈసారి ఎల్‌నినో భయాలు ఉన్నాయి. తూర్పు, మధ్య పసిఫిక్ మహా సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పుల నేపథ్యంలో ఎల్‌నినో ప్రారంభమైందని ఇప్పటికే ఇన్‌కాయిస్ ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు తటస్థ పరిస్థితులు ఉండగా తాజాగా ఎల్‌నినోగా మారిందని వెల్లడించింది. ప్రస్తుత మే నుంచి 2027 జనవరి వరకు ఈ పరిస్థితులు కొనసాగుతాయని తెలిపింది. రుతుపవనాలు మొదటి దశలో అంటే జూన్ నుంచి జులై ప్రారంభంలో స్థిరమైన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ సంస్థలు అంచనా వేశాయి. అయితే ఆగస్టు, సెప్టెంబర్‌లలో ఎల్‌నినో బలపడి, దేశవ్యాప్తంగా వర్షపాతంపై ప్రభావం చూపొచ్చని పేర్కొన్నాయి.

## చేప ప్రసాదం జూన్ 8 నుంచి

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు అబిడ్స్‌లో తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బత్తిన గౌరీ శంకర్ గౌడ్, బత్తిని అమర్‌నాథ్ గౌడ్‌లు పాల్గొని వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మృగశిర కార్తె సందర్భంగా జూన్8వ తేదీ రాత్రి 9 గంటలకు చేప ప్రసాదం పంపిణీ అవుతుందని తెలిపారు. గత 180 ఏళ్లుగా తమ బత్తిని కుటుంబం ఆస్తమా రోగుల కోసం చేప ప్రసాదాన్ని ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బత్తిన కుటుంబ సభ్యులను అగర్వాల్ సమాజ ప్రతినిధులు సన్మానించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్?లో జరిగే చేప ప్రసాద పంపిణీ కార్యక్రమానికి దేశంలోని పలు రాష్ట్రాల నుండి ప్రజలు వస్తుంటారని వారు తెలిపారు. వారి కోసం ప్రతియేటా తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆహారం, మంచినీరు, మజ్జిగ అందిస్తోందని పేర్కొన్నారు.

## నీట్ పరీక్ష జూన్ 21న..

రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్రం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

**వచ్చే ఏడాది నీట్ ఆన్‌లైన్ పరీక్ష**

నీట్ పేపర్ లీక్ వ్యవహారం సంచలనం సృష్టించింది. దాంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని వెల్లడించారు. జూన్ 21న నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఇప్పటికే ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వారు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నాం అని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మా మొదటి లక్ష్యం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం. ఏటా కోటి మందికి ఎన్టీఏ పరీక్షలు నిర్వహిస్తోంది. పేపర్ ఎలా లీక్ అయింది.. ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందన్న పూర్తి వివరాలు పూర్తి బహిర్గతమవుతాయి. ఈసారి ఎలాంటి పరిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసుకుంటాం. రీటెస్ట్ కోసం విద్యార్థులు నచ్చిన నగరాన్ని ఎంచుకోవడానికి వారం రోజులు గడువు ఇస్తున్నాం. జూన్ 14న అడ్మిట్ కార్డులు విడుదల చేస్తాం. నీట్ కోసం మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న వార్తలు చూసి విద్యార్థులు ఆందోళన చెందొద్దని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.

## కీలక సూత్రధారి అరెస్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్-యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న పి.వి.కులకర్ణిని పుణెలో అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో ఇతడే సూత్రధారిగా కేంద్ర దర్యాప్తు సంస్థ భావిస్తోంది. నీట్ పరీక్ష నిర్వహణలో ఎన్‌టీఏలో భాగస్వామిగా ఉన్న ఆయనను సుదీర్ఘ సమయం విచారించిన సీబీఐ.. అనంతరం అరెస్టు చేసినట్లు ప్రకటించింది.లాతూర్‌కు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ కులకర్ణి సుదీర్ఘ కాలంగా నీట్ ప్రశ్నాపత్రాన్ని రూపొందించే నిపుణుల కమిటీలో ఉంటున్నాడు. అయితే, తనకు ఉన్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించిన ఆయన.. మరో నిందితుడితో కలిసి ఏప్రిల్ చివరి వారంలో పుణెలోని తన నివాసంలో ప్రత్యేక తరగతులు నిర్వహించాడు. నీట్ పరీక్షలో వచ్చే ప్రశ్నలను, సమాధానాలను ముందుగానే విద్యార్థులకు ప్రాక్టీస్ చేయించాడు. నోట్‌బుక్‌లో రాసుకున్న ప్రశ్నలే మే 3న జరిగిన నీట్ పరీక్షలో వచ్చినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. ఈ సెషన్‌లో పాల్గొన్న విద్యార్థుల నుంచి నిందితులు లక్షలాది రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కెమిస్ట్రీ ప్రశ్నాపత్రం ఎక్కడ నుంచి లీకైందనే విషయంతోపాటు నగదు లావాదేవీల్లో ఉన్న మధ్యవర్తులను కనుగొన్నట్లు సీబీఐ అధికార ప్రతినిధి వెల్లడించారు. గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సోదాలు నిర్వహించామని, కీలక దస్త్రాలు, పలు ఎలక్ట్రానిక్ పరికరాలు సీజ్ చేశామన్నారు. వాటికి ఫోరెన్సిక్, సాంకేతిక విశ్లేషణ జరుగుతోందని చెప్పారు.

గతేడాది లీక్ ఆనవాళ్లపై దృష్టి సారించిన సిబిఐ

నీట్ 2026 పరీక్ష పత్రం లీకేజీపై దృష్టిపెట్టిన అధికారులకు గతేడాది లీక్ ఆనవాళ్లు బయట పడుతున్నాయి. కీలక నిందితుడైన వికాస్ బివాల్ గతేడాది యశ్ యాదవ్ నుంచి నీట్ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు సీబీఐ అనుమానిస్తుంది. దీంతో ఈ యేడాది కూడా యశ్ నుంచే వికాస్ ఈ పేపర్‌ను కొన్నాడు. ఈ వ్యవహారంలో యశ్ తండ్రి మంగిలాల్ బివాల్, అంకుల్ దినేశ్ బివాల్ హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వికాస్ అతడి సోదరిలు ప్రగతి, కజిన్స్ సానియా, గుంజన్, పలాక్‌లు కూడా గతేడాది వైద్యవిద్య సీట్లు పొందారు. వీరంతా కూడా లీకైన పేపర్ సాయంతోనే సీట్లు సాధించినట్లు తెలుస్తోంది. వికాస్‌కు పదో తరగతిలో 63శాతం, 12వ తరగతిలో 55శాతం మార్కులు వచ్చాయి. ఇక 2024లో నీట్ పరీక్ష రాస్తే కేవలం 720కి గాను 240తో సరిపెట్టుకొన్నాడు. సికార్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో 46 పరీక్షలు రాస్తే సగటున 384 మార్కులు వచ్చాయి. కానీ, 2025లో మాత్రం 85.11 పర్సెంటైల్‌తో గవర్నమెంట్ కాలేజీలో సీటు సాధించడం విశేషం. ఇక ఆయన సోదరి ప్రగతి 10వ తరగతిలో 69శాతం , 12వ తరగతిలో 91శాతం మార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 720కి 355 మార్కులే వచ్చాయి. కానీ, సికార్‌లోని కోచింగ్ సెంటర్‌లో 50 నమూనా పరీక్షలు రాస్తే మార్కులు ఏనాడు 320- 342 దాటలేదు. కానీ, 2025లో హఠాత్తుగా 92.53 పర్సంటైల్‌తో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. ఇక మరో కజిన్ సోనియాకు 10వ తరగతిలో 63?, 12వ తరగతిలో 89? మార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 320 మార్కులతో సరిపెట్టుకొంది. సికార్‌లోని కోచింగ్ సెంటర్‌లో 49 మాక్‌టెస్ట్‌లు రాస్తే 341-361 మధ్యే మార్కులు వచ్చాయి. అదే నీట్ పరీక్ష రాస్తే మాత్రం అలవోకగా 94.07 పర్సంటైల్‌తో ప్రభుత్వ కాలేజీలో సీటు పొందింది. ఇక పలాక్‌కు 10వ తరగతిలో 93శాతం, 12వ తరగతిలో 89 శాతంమార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 512 మార్కులు మాత్రమే సాధించింది. సికార్‌లోని కోచింగ్ సెంటర్లలో నిర్వహించిన 50 నమూనా పరీక్షల్లో ఆమెకు ఏనాడు 515-550 మార్కులు దాటలేదు. కానీ, 2025 నీట్‌లో 98.61 పర్సంటైల్‌తో జైపుర్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. ఇప్పుడు అదే కుటుంబం లోని రిషి కోసం పేపర్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతడు 10వ తరగతిలో 43శాతం, 12వ తరగతిలో గ్రేస్ మార్కులు 50శాతం సాధించాడు.



## అవి ఆత్మహత్యలు కావు.. వ్యవస్థలు చేసిన హత్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): నీట్ పరీక్షల రద్దుతో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులవి వ్యవస్థలు చేసిన హత్యలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పరీక్షలకు సంబంధించిన ఆత్మహత్య ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కుంభకోణాలు, అవినీతి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు. లఖింపూర్ ఖేరీకి చెందిన 22 ఏళ్ల హృతిక్ మిశ్రా చివరిసారిగా 'నేను ఇకపై పోటీ పరీక్షలు రాయను' అని చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. మూడోసారి నీట్ పరీక్ష రాస్తున్న హృతిక్, పరీక్ష రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. అలాగే ఉనీజీలో కూడా నీట్ పరీక్ష రాసిన మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. ఈ ఘటనలు కేవలం ఆత్మహత్యలు కావని, అవినీతి వ్యవస్థ చేసిన హత్యలని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పరీక్ష చేతిలో విద్యార్థులు ఓడిపోలేదు.. అవినీతి వ్యవస్థ చేతిలో బలయ్యారని అన్నారు. 2015 నుంచి 2026 వరకు దేశవ్యాప్తంగా 148 పరీక్షల కుంభకోణాలు వెలుగుచూశాయని ఆయన ఆరోపించారు. వాటిలో 87 పరీక్షలు రద్దయ్యాయని, దాదాపు 9 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమైందని పేర్కొన్నారు. ఈ 148 కుంభకోణాల్లో కేవలం ఒక్కరికే శిక్ష పడిందని, సీబీఐ 17 కేసులు, ఈడీ 11 కేసులు నమోదు చేసినప్పటికీ ఎవరూ బాధ్యత వహించలేదని విమర్శించారు. ప్రత్యేకంగా నీట్, ఏఐపీఎంటీ మరియు ఇతర వైద్య ప్రవేశ పరీక్షల్లోనే 15 కుంభకోణాలు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన అధికారులు, మంత్రులు రాజీనామా చేయకపోవడం అత్యంత సిగ్గుచేటని అన్నారు. కొందరిని తొలగించినట్లు చూపించి, తిరిగి ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారని ఆరోపించారు. మోసానికి సహకరించే వారికి బహుమతులు లభిస్తుండగా, పరీక్షలు రాసే పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు అంటూ కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీని ఉద్దేశించి, మీలో జవాబుదారీతనం మేల్కొనడానికి ఇంకా ఎంతమంది హృతిక్‌లు కావాలని ప్రశ్నించారు. విద్యార్థుల బాధ తన బాధ అని, వారి భవిష్యత్తును దోచుకున్న వారు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎంత కాలం పట్టినా సరే, ఎవరినీ వదిలిపెట్టం. ఈ యుద్ధాన్ని మనం కలిసి పోరాడదాం.. మనం గెలుస్తాం అంటూ ధైర్యాన్ని ఇచ్చారు.



## కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ అంత్య పుష్కర పుష్కరాలు

**డిప్యూటీ సీఎంకు అహ్వానపత్రిక అందించిన మంత్రి కొండా సురేఖ**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం వేదికగా సరస్వతీ నది అంత్య పుష్కరాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ పుష్కరాలలో పాల్గొనాల్సిందిగా ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కను ప్రజా భవన్ కు ప్రత్యేకంగా వచ్చి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం. హనుమంతరావు, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వేదోఛ్చారణలతో ఆశీర్వదించారు. సరస్వతీ అంత్య పుష్కరాలను మే 21 నుంచి జూన్ 1 వరకు 12 రోజుల పాటు కాళేశ్వరంలో నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎంకు మంత్రి కొండా సురేఖ వివరించారు. మే 21న ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో వేడుకలు ప్రారంభమవుతాయి. కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజేంద్ర సరస్వతి స్వామి తొలి పుష్కర స్నానాన్ని ఆచరిస్తారని డిప్యూటీ సీఎంకు వివరించారు. త్రివేణి సంగమం వద్ద ప్రతిరోజూ గంగా హారతి నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందని వివరించారు.

## జూన్ 8 వరకు ఉచిత అథ్లెటిక్స్ సమ్మర్ కోచింగ్ క్యాంపు

- కోచ్ తిరుమల రావు





**హైదరాబాద్ (జనంసాక్షి) :** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, మేడ్చల్ మల్కాజ్గిరి డిస్టిక్ యూత్ స్పోర్ట్స్ ఆఫీస్ డివైఎస్ఓ దామోదర్ రెడ్డి ఆదేశాల మేరకు అథ్లెటిక్స్ సమ్మర్ కోచింగ్ క్యాంపు కొనసాగుతోందని కోచ్ తిరుమల రావు తెలిపారు. నాగారం అండ్ చర్లపల్లి లేక్ వ్యూలో కోచింగ్ క్యాంపు కొనసాగుతోందని, ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. అథ్లెటిక్స్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ 1 మే నుండి 7 జూన్ 2026 వరకు జరుగుతుందని, ఆసక్తిగల క్రీడాకారులు తల్లిదండ్రులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా సూచించారు. https://satgasc. telangana.gov.in/ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, పాస్ ఫోటో అవరమని తెలిపారు. లాంగ్ జంప్, ట్రిబుల్ జంప్, త్రోజ్ : షాట్ పుట్, డిస్క్ త్రో, జావలిన్ త్రో నేర్పిస్తామని, పిల్లల్ని ఈ మొబైల్ ఫోన్స్ కి దూరంగా క్రీడలు వైపు మళ్లించడమే శారీరకంగా మానసికంగా దృఢంగా మరింత ఉత్సాహంగా లక్ష్యంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు అథ్లెటిక్స్ కోచ్ తిరుమల రావు 9963786343 సంప్రదించాలని సూచించారు.


## విద్యాదాన్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇంటర్, పాలిటెక్నిక్‌లలో మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందే విద్యార్థుల కొరకు సరోజిని దామోదర్ ఫౌండేషన్ వారు అందిస్తున్న "విద్యాదాన్" స్కాలర్‌షిప్‌లకు అర్హులైన విధ్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మరియు గుర్తింపు పొందిన పాఠశాలలో పదవ తరగతిలో 90% సాధించి, సంవత్సర ఆదాయం 2 లక్షలు కలిగిన వారు ఈయొక్క స్కాలర్షిప్ లు పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు తమ పదవ తరగతి మార్కుల మెమో , ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో ఝఝఝ.జఱఎఝఝఝఅ.శీతీస్త్ర అనే వెబ్‌సైట్ నందు జూన్ 20 వ తేదీలోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలని అన్నారు. అర్హులైనవారికి జులై 5, వ తేదీన ఆన్‌లైన్‌లోపరీక్ష మరియు ఇంటర్వ్యూ నిర్వహించ బడుతుందని దీంట్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రతి ఏటా 10 వేల నుండి 75 వేలు డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి ఉన్నత చదువు పూర్తి అయ్యేంత వరకు ఈ స్కాలర్షిప్ లు అందుతాయని, అన్నీ కులాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8520860785, 9663517131అనే నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

## సీఎం ప్రజావాణిలో 334 దరఖాస్తులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 222వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 334 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 107, రెవెన్యూ శాఖకు సంబంధించి 60, ఇందిరమ్మ ఇండ్ల కోసం 89, ప్రవాసి ప్రజావాణికి 03 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 75 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సమన్వయ మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారి అపహరణకు యత్నం

**కడెం: మే 15 (జనం సాక్షి) :** చిన్నారిని ఎత్తుక పోవడానికి ప్రయత్నించిన ఘటన కడెం మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కడెం మండలంలోని మాసాయిపేట్ గ్రామానికి చెందిన ఒక చిన్నారిని శుక్రవారం రోజున సాయంత్రం దాదాపు 6 గంటల సమయం లో ఒక గుర్తు తెలియని వ్యక్తి చిన్నారిని ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించాడు. చిన్నారి రోడ్డుపై ఆడుకుంటున్న సమయంలో బైక్ పై వచ్చి ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా తమ తల్లి చూసి వెంటనే బైక్ వెంట ఎవరూ అని పరిగెత్తి చిన్నారిని లాక్కుంది. వెంటనే చిన్నారిని అక్కడే విడిచిపెట్టి వచ్చిన దొంగ బండి స్టార్ట్ చేసుకుని వెళ్లిపోయాడు. చిన్నారి వద్ద ఎవరు లేని సమయంలో ఎత్తుక పోవడానికి ప్రయత్నించినట్లు పలువురు తెలిపారు. దొంగ వచ్చి చిన్నారిని ఎత్తుక పోవడానికి ప్రయత్నించిన ఘటన గ్రామంలో కలకలం రేపుతుంది. గ్రామంలోని హనుమాన్ మందిరంలో పెట్టినటువంటి సిసి కెమెరాలు పరిశీలించినప్పటికీ దొంగ ఆచూకీ దొరకడం పోవడంతో ప్రతి ఒక్కరి పిల్లలు జాగ్రత్త అంటూ వాట్సప్ లలో వైరల్‌గా మారింది.

# ఉద్యోగులకు జూన్ 2లోపే ఆరోగ్య కార్డులు ఇవ్వండి!

- పెండింగ్ బిల్లులను వెంటనే ఇప్పించండి
- సీఎం గారు ఇచ్చిన హామీలను అమలు చేయండి
- జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సీఎస్‌ను కోరిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ జూన్ 2లోపే ఆరోగ్య కార్డులను అందించేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులతో పాటు సమస్యలను సైతం పరిష్కరించాలన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి గారు ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. జూన్ 2కు ముందే 2వ పీఆర్‌సీని అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన 15 ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ సీఎస్ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా నగదు రహిత వైద్యం తక్షణమే అందించాలని కోరారు. రెవెన్యూ శాఖలో 61 సంవత్సరాలకు పైబడిన వీఆర్ఏల చట్టబద్ధ వారసులైన కుమారులు, కుమార్తెలను నియమించాలన్నారు. రెవెన్యూ శాఖలో తొలగించిన 632 కంప్యూటర్ ఆపరేటర్లు మరియు ఎఫ్‌టీఎస్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి హామీ కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. రెవెన్యూ శాఖలో ధరణి ఆపరేటర్ల సేవలను కొనసాగించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ ప్రాంత ఉద్యాయ సంఘం(టీపీయూఎస్) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు హన్మంతరావు, డి.భాస్కర్, టీజీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, జీపీఓ అసోసియేషన్ అధ్యక్షుడు గరిక ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

## నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీతో దిగజారిన దేశ విద్యా వ్యవస్థ పరువు

- టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి ధ్వజం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ, దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు వ్యవహారంతో విద్యా వ్యవస్థ పరువును కేంద్ర ప్రభుత్వం దిగజార్చిందని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి ధ్వజమెత్తారు. హైదరాబాద్ లోని గాంధీభవన్ లో శుక్రవారంనాడు విలేకరులతో శేర్ నర్సారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం అత్యంత ఆందోళనకరమని, ఈ సంక్షోభానికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనే సుమారు 71 వేల మంది విద్యార్థులు ఎంతో కష్టపడి, భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని నీట్ పరీక్ష రాశారని, అలాంటి కీలక పరీక్షలో అవకతవకలు చోటు చేసుకోవడం విద్యా ర్థులు, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బతీసిందని శేర్ నర్సారెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్షలను సక్రమంగా, పారదర్శకమైన పరీక్ష వ్యవస్థను నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి మండిపడ్డారు. ఎంతో మంది తల్లిదండ్రులు అప్పులు చేసి, ఆభరణాలు అమ్మి తమ పిల్లలను ఈ నీట్ పరీక్షకు సిద్ధం చేశారనీ, నీట్ పరీక్ష ప్రశ్నపత్రాలు లీకేజీ ఆరోపణలు, పరీక్ష రద్దు వ్యవహారం పరిణామంతో కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును, వారి ఆశలను గల్లంతు చేస్తూ అంధకారంలోకి నెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా అధైర్యపడకుండా ఉండాలనీ, విద్యార్థుల భవిష్యత్తు కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి తెలిపారు.

## పాదయాత్రతో ప్రభుత్వ మెడలు వంచుతాం

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయాలి
- జూన్ మాసంలో పాదయాత్ర



**మహబూబ్ నగర్ ప్రతినిధి మే 15(జనం సాక్షి) :** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై ప్రభుత్వ మొద్దునిద్ర వీడాలని ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు పాదయాత్ర చేస్తున్నామని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు . శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక సాగునీరు కోసం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ద్వారానే సస్యశ్యామలమైతుందని 90 శాతం పూర్తి చేశాం.. పది పదకుండు శాతం పనులకు టెండర్ కూడా పూర్తీ చేశాం.. కానీ లేని పోనీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. ఎక్కడి గొంగడి అక్కడే ఉంది.. అన్నీ రెడీ గా ఉన్నా.. కనీసం మోటార్లు ఆన్ చేయలేదు.. దీనికి సంబంధించి.. మేము నార్లపూర్ నుంచి ఉద్దండాపూర్ వరకు పాదయాత్ర చేయాలని నిర్ణయించాం.. కేసీఆర్ తో చర్చించి తేదీలు ప్రకటించడం జరుగుతుంది.. పంటలకు గిట్టుబాటు ధర లేదు.. కొనుగోలు కేంద్రాల లేవు..నాయకులు వారికి అనుగుణంగా కేంద్రాలు ఓపెన్ చేశారు.. అప్పట్లో దొరల్లా బతికిన రైతుల... ఇపుడు బిచ్చగాలూ గా మారారు.

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలన్న ఉద్దేశంతో మేము కార్యాచరణ తీసుకున్నామని, రెండున్నర్ ఏళ్లు అయ్యిందని, ఇప్పటి వరకూ కనీసం ఓ రివ్యూ కూడా పెట్టలేదు.. ప్రాధాన్యత క్రమంలో.. ఇది పూర్తి చేస్తారని ఆశించామని తెలిపారు. జిల్లాపై మక్కువతో కేసీఆర్ సర్కారు ఈ ప్రాజెక్టును తీసుకుని.. 90 శాతం పనులు పూర్తి చేసి.. నార్లపూర్ లో మోటార్లు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. చేతగాని ప్రభుత్వం.. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా పడుకో పెట్టింది.. కొనుగోలు కేంద్రాల ను మెల్లమెల్లగా ఎత్తేయాలని ఈ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, అన్ని జిల్లా కేంద్రాల్లో కూడా కొనుగోలు కేంద్రాల దుస్థితిపై ధర్నా కూడా ప్లాన్ చేస్తున్నామని, త్వరలో పాదయాత్ర చేయాలని నిర్ణయించాం. వీలైతే కేసీఆర్ ను కూడా ఆహ్వానిస్తామని తెలిపారు.

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు వ్యక్తి సీఎం అవుతున్నాడని కాస్త ఎక్కువ మంది కాంగ్రెస్ కు ఓటు వేశారు.. కానీ.. ఇప్పటి దాకా 70 సార్లు జవీ రేవంత్ రెడ్డి డిల్లీకి పోయిండు.. మరి ఈ సీఎం రేవంత్ కు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ గురించి గుర్తుకు రాలేదు. ఇప్పటి వరకూ తట్టెడు మట్టి తీయలేదు.. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే జవీ.. 30 నెలలుగా ఏం చేసిండు.. నీళ్లు సముద్రం పాలు అయ్యాయి.. మరి ఒక్కసారి కూడా రివ్యూ చేయలేదు.. కేసీఆర్ చేసిండు కనుక నేను ముట్టుకుని అని అనుకున్నాడు.. నీవు పాలమూరుకు చేసింది శూన్యం.. ఇక నీవు పాలమూరు బిడ్డ అని చెప్పుకునే అర్హత కోల్పోయావు' అని తెలిపారు.

## ఆర్ఎస్ ప్రవీణ్.. జబర్దస్త్ స్కిట్స్ చేయడం బంద్ చెయ్

- బాధితురాలి ప్రైవసీకి భంగం కలిగించవద్దంటే మా పార్టీ అధినేతను టార్గెట్ చేస్తావా?
- పొలిటికల్ డ్రామాలు ఆపి నిందితుడిని అరెస్ట్ చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచు
- టీఆర్ఎస్ నేతలు చిలుక ప్రవీణ్, సూరరపు కృష్ణవేణి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫామ్ హౌస్ నుంచి వచ్చే స్క్రిప్టులు చదావుతూ రోజుకో జబర్దస్త్ స్కిట్ చేస్తున్నాడని టీఆర్ఎస్ నేతలు చిలుక ప్రవీణ్, సూరారపు కృష్ణ వేణి మండిపడ్డారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడి పోక్సో కేసులో నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసిన తమ పార్టీ అధినేత కవిత ను టార్గెట్ చేస్తారా? అని ప్రశ్నించారు. ఈ సంఘటనలో బాధితురాలికి న్యాయం జరగాలన్న ఆకాంక్ష బీఆర్ఎస్ లో ఏమాత్రం కనిపిచటం లేదన్నారు. నిందితున్ని అరెస్ట్ చేసి.. బాధితురాలి ప్రైవసీని కాపాడాలని కవిత గారు మాట్లాడితే ఆమెపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు చేయటం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో బాధితురాలిని బద్నాం చేసైనా తమ రాజకీయ పబ్బం గడపాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ నేతలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని చెప్పారు. నిజంగా బాధితురాలికి న్యాయం జరగాలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటి ముందు ధర్నా చేయాలన్నారు. బండి సంజయ్ కుమారుడి కేసులో బాధితురాలికి న్యాయం జరగాలని, ఆమె ప్రైవసీని కాపాడాలని ఒక అమ్మ మాదిరిగా తమ నాయకురాలు కల్వకుంట్ల కవిత ఆలోచించారని చిలుక ప్రవీణ్ అన్నారు. ఈ క్రమంలోనే నిందితుడు పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. బాధితురాలిని బజారుకీడ్చవద్దని కవిత గారు మంచి సూచన చేస్తే బీఆర్ఎస్ నేతలు ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. బాధితురాలికి న్యాయం చేయాలన్న ఉద్దేశం కన్నా కూడా రాజకీయ ప్రయోజనాలు పొందాలన్న ఉద్దేశమే బీఆర్ఎస్ లో ఎక్కువగా కనిపిస్తుందని చెప్పారు. ఈ క్రమంలోనే సందర్భం లేకుండా తమ నాయకురాలు కవితపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణలు చేశారని ప్రవీణ్ అన్నారు. మంచి ఉద్దేశంతో బాధితురాలి తరఫున మాట్లాడిన కవిత గారిపై ఎందుకు ఆర్ఎస్ ప్రవీణ్ విమర్శలు చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నిజంగా బాధితురాలికి న్యాయం చేయాలనుకుంటే నిందితుడిని దాచిందెవరో మీకు తెలియదా అని ప్రశ్నించారు. నిందితుడిని దాచిన వారిపై, అదే విధంగా నామమాత్రం సెక్షన్స్ పెట్టిన పోలీసులపై ఒత్తిడి పెంచాల్సింది పోయి కవితని ఎందుకు టార్గెట్ చేశారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ కు చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి ఇంటి ముందు, బండి సంజయ్ ఇంటి ముందు ధర్నా చేయాలని సూచించారు.

## చిరుజల్లులతో నగరవాసులకు ఉపశమనం

**హైదరాబాద్, మే15 (జనంసాక్షి) :** గత కొద్దిరోజులుగా మండుతున్న ఎండలతో ఉక్కపోతకు గురైన ప్రజలకు శుక్రవారం సాయంత్రం కురిసిన చిరుజల్లులు కొంత ఉపశమనం కలిగించాయి. పెరిగిన ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు వర్షంతో చల్లని వాతావరణం ఏర్పడింది. సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకోవడంతో అంబర్‌పేట పరిసర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోజంతా ఉన్న వేడి తీవ్రత తగ్గి వాతావరణం చల్లబడింది. ఎండలతో అలసిపోయిన ప్రజలు ఈ వర్షంతో ఊపిరిపీల్చుకున్నారు. అయితే సాయంత్రం సమయంలో కురిసిన వర్షం కారణంగా రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రధాన రహదారులపై స్వల్పంగా వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఇళ్లకు బయలుదేరిన ఆఫీసు సిబ్బంది ట్రాఫిక్ సమస్యలతో అవస్థలు పడ్డారు. పిల్లలు, యువత వర్షాన్ని ఆస్వాదిస్తుండగా, వ్యాపారులు మాత్రం ఆకస్మిక వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఉష్ణోగ్రతలు కొంత మేర తగ్గే అవకాశముందని అధికారులు చెప్పారు.

## ఆగివున్న రైలు బోగీలో మంటలు



**హైదరాబాద్, మే15 (జనంసాక్షి) :** నాంపల్లి రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. జైపుర్ వెళ్లాల్సిన రైలు ఏసీ బోగీలో మంటలు వచ్చాయి. నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై నిలిపి ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరిరజన్లతో ఘటనాస్థలికి చేరుకుని బీ1 బోగీలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

## తమిళనాడులో విదేశీయుల ఓటు

- ఇమ్మిగ్రేషన్ అధికారుల దర్యాప్తుతో బయటపడ్డ వ్యవహారం
- పదిమందిని అరెస్ట్ చేసిన పోలీసులు

**చెన్నై, మే15 (జనంసాక్షి) :** తమిళనాడు ఎన్నికల్లో విదేశీయులు ఓటేసిన వైనం బయటపడింది. ఎన్నికల అధికారుల కళ్లు గప్పి ఓట్లేయడం సంచలనంగా మారింది. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత.. విదేశీయులు ఓటింగ్ పాల్గొన్నట్లు వచ్చిన సమాచారంతో దర్యాప్తు జరిపిన ఇమ్మిగ్రేషన్ అధికారులు.. పది మందిని అరెస్టు చేశారు. గత ఎన్నికల్లో ఓట్లేసిన వారిని చెన్నై, మధురై విమానాశ్రయాలలో అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఎక్కువగా శ్రీలంకకు చెందినవారే ఉన్నారు. విదేశీ వీసా ఉండి కూడా తమిళనాడులో ఎలా ఓట్లు వేశారనేది ప్రశ్నార్థంకంగా మారింది. అరెస్టైన 10 మందిలో.. రంజిని (59), సర్ఫుదీన్ (68), నీలాంతి (44), జయంతన్ (40), చార్లీ బాలచంద్రన్ (48), చక్రవర్తి లోగప్రియ (50), సునీత చక్రవర్తి (48) మొదలైన వారు శ్రీలంక పౌరులు. వీరితో పాటు బ్రిటన్‌కు చెందిన అయ్యదురై (53), ఇండోనేషియాకు చెందిన టిటిన్ మరియాట్టి (47), కెనడాకు చెందిన జితేంద్రనాథ్ (38) అరెస్టైన వారి లిస్టులో ఉన్నారు. చెన్నై, మధురై ఎయిర్ పోర్టులలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# సామాన్యుడి నడ్డి విరిచిన నిజాలు

సంపాదకీయం

**అందరూ ఊహించారు. విపక్షాలు హెచ్చరించాయి. ప్రజలు భయపడ్డారు. కానీ పాలకులు మాత్రం గట్టిగా చెప్పారు "పెంచబోము" అని..! ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసి ఫలితాలు వచ్చిన వెంటనే మోదీ సర్కార్ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచింది. ఇది కేవలం ధర పెరుగుదల కాదు ఇది ప్రజాస్వామ్యంలో పాలకులు ఓటర్లను మోసం చేసిన చేదు అధ్యాయం.**

'ఎన్నికలు పూర్తయిన వెంటనే ధరలు పెరుగుతాయి' అని సోషల్ మీడియాలో విపక్షాల హెచ్చరికలకు అధికార యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. 'ఆరు నెలలకు సరిపోయే నిల్వలున్నాయి, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల తర్వాత కూడా ధరలు పెంచబోము" అని స్పష్టం చేసింది. సోషల్ మీడియా ప్రచారాన్ని నమ్మొద్దని హితవు చెప్పారు. కానీ సరిగ్గా ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజే పెట్రోల్ పంప్‌లపై కొత్త ధరలు ప్రకటించారు. ఇంతకన్నా పెద్ద రాజకీయ అబద్ధం ఏముంటుంది? ఇది ప్రజలను ఓట్ల కోసం మభ్యపెట్టడం కాదా?

మన్మోహన్ సింగ్ హయాంలో ప్రపంచ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధర అత్యధికంగా బ్యారెల్‌కు 147 (2008లో) డాలర్లు వరకు పెరిగింది. సగటున 80--100 డాలర్లు మధ్య ఉండేది. అంటే అంతర్జాతీయంగా చమురు చాలా ఖరీదైన కాలం అది. అయినా అప్పుడు పెట్రోల్ ధర సుమారు రూ.60-75 మధ్య ఉంది. ప్రభుత్వం భారీ సబ్సిడీ భరించి సామాన్యుడిని కాపాడింది. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లు కాగా.. అప్పటినుండి అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ధర నాటకీయంగా తగ్గింది. 2016లో 28 - 30 డాలర్లకి పడిపోయింది. ఇది చరిత్రలో చమురు అత్యంత చౌకగా దొరికిన కాలం. కానీ అప్పుడు పెట్రోల్ ధర తగ్గిందా? లేదు. 2022 నాటికి పెట్రోల్ ధర రూ.110--120కు చేరింది. క్రూడ్ చౌకయినా.. ప్రజలకు ఉపశమనం కలగలేదు. తగ్గిన ప్రతిసారి ఆదా అయిన సొమ్మును ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం పెంచి మింగేసింది. యూపీఏ హయాంలో పెట్రోల్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకం లీటర్‌కు రూ.9.48 ఉండగా.. ఎన్డీయే హయాంలో అది రూ.32.98 వరకు పెరిగింది. అంటే దాదాపు మూడున్నర రెట్లు అదనం. క్రూడ్ ధర తగ్గిన ప్రతిసారి ప్రజలకు ఉపశమనం లేదు సరికదా ఎక్సైజ్ సుంకం పెంచారు.

ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ధరలు తగ్గినప్పుడు పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి చిన్న దేశాలు కూడా పెట్రోల్ ధరలు తగ్గించాయి. భారత్ మాత్రం తగ్గించలేదు. ఇది అసమర్థత కాదు, ఉద్దేశపూర్వకమైన విధానం. నిజానికి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడు సామాన్యులు, నిరుపేదలు విలవిల్లాడిపోతుంటారు. అన్నిధరలూ పెరగడంతో కడుపు కట్టుకుని బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పాలు మొదలు తినే ప్రతివస్తువుకూ రెక్కలొస్తాయి. ఆటోరిక్షాలు, వ్యవసాయం, వ్యాపారులు, చిరువ్యాపారులు, పరిశ్రమలు తదితర రంగాలపై మోయలేని భారం పడి గడ్డుకాలాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒక్క చమురు ధర పెరుగుదల దేశ మొత్తం ఆర్థిక వ్యవస్థను డొమినోల్లా కూలుస్తుందంటే అతిశయోక్తి కాదు. వీటికి పరిష్కారం లేదా అంటే.. ఉంది. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొస్తే ధరలు హేతుబద్ధంగా ఉంటాయి. రాష్ట్రాలు-కేంద్రం మధ్య పారదర్శకత వస్తుంది. అంతర్జాతీయ ధరలు తగ్గినప్పుడు ఎక్సైజ్ సుంకం తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలి. ఎన్నికలప్పుడు వాగ్దానాలు చేసి, ఓట్లు పడగానే విస్మరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి ద్రోహం. సామాన్యుడు రోజువారీ జీవనం కోసం పోరాడుతుంటే పాలకులు ఎన్నికల లెక్కలు వేసుకుంటున్నారు. పెట్రోల్ మంట కేవలం పంపుదగ్గర ఆగదు. అది వంటిల్లు వరకు వస్తుంది, పిల్లల చదువుల వరకు వస్తుంది, రైతు పొలం వరకు వస్తుంది. మరి వీటన్నింటినీ ఎండగట్టాలంటే సామాన్యుడికి ఓటే ఆయుధం. అది వేసే ముందు ప్రశ్నించాలి. హామీలు గుర్తుపెట్టుకోవాలి. ఎందుకంటే నేటి పెట్రోల్ ధర రేటు కాదు, రాజకీయ నిజాయితీకి పరీక్ష..!

# ప్రాజెక్టుల వారీగా వినాశనం - కీలక గణాంకాలు



భారత దేశంలో అభివృద్ధి పేరిట జరిగిన విధ్వంసం కొన్న వర్గాలను, ప్రాంతాలను అభివృద్ధి చేయడం జరిగింది. కాని ఆ అభివృద్ధి కోసం తమ భూముల నుండి వృత్తుల నుండి తరతరాలుగా నివసిస్తున్న తమ ఊరి నుండి నిర్వాసితులయ్యారు. తరిమి వేయబడ్డారు. స్వదేశంలో ఎవరూ పట్టించుకోని కాందిశీకులయ్యారు. దేశంలో సుమారు ఆరుకోట్ల కుటుంబాలు ఇలా శిథిలమయ్యాయి. గిరిజన ప్రల్లో 40 మంది అభివృద్ధి తాకిడికి సర్వం కోల్పోయి వలసలకూలీలుగా మారి పోయారు. దేశంలోని అనేక ఉద్యమాలకు ఎరువయ్యారు. వీటి మూలాల ను చాలా ఆలస్యంగా గమనించి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం తెచ్చింది. ఇదొక గొప్ప మలుపు . ఉద్యమాలు సాధించిన విజయం ఇది. మన ఆంధ్ర ప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో 'జలయజ్ఞం' వంటి పథకాలు మరియు అంతకుముందు నిర్మించిన భారీ డ్యామ్‌ల వల్ల జరిగిన నష్టం అపారం. ఆనాడు 1894 చట్టం ప్రకారం సేకరించిన భూములు మరియు ప్రభావితమైన ప్రజల వివరాలు ఇలా ఉన్నాయి:

**శ్రీశైలం ప్రాజెక్టు (మహబూబ్‌నగర్ - కర్నూలు):**
ఇది ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో అతిపెద్ద సామాజిక విషాదం.
ముంపు గ్రామాలు: 100కు పైగా (67 గ్రామాలు పూర్తిగా, 33 గ్రామాలు పాక్షికంగా జలసమాధి అయ్యాయి).
ముంపు భూమి: 1,06,925 ఎకరాల సారవంతమైన భూమి.
**నిర్వాసితులు:** సుమారు 31,000 కుటుంబాలు (లక్షకు పైగా జనాభా).
**పరిహారం:** ఆనాడు ఎకరాకు కేవలం రూ.600 నుండి రూ.2,500 వరకు మాత్రమే ఇచ్చారు. ఈ స్వల్ప పరిహారం అందడానికి కూడా కోర్టుల చుట్టూ 20 నుండి 30 ఏళ్ల పాటు తిరగాల్సి వచ్చింది.
నాగార్జున సాగర్ ప్రాజెక్టు:
నల్గొండ మరియు గుంటూరు జిల్లాల సరిహద్దుల్లో నిర్మించిన ఈ ప్రాజెక్టు కోసం సుమారు 75,000 నుండి 80,000 ఎకరాల భూమిని సేకరించారు.
**ప్రభావం:** 52 గ్రామాలకు చెందిన 5,000 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ఆనాడు ఎకరాకు రూ.100 నుండి రూ.300 మాత్రమే చెల్లించడంతో, రైతులు తమ జీవనాధారాన్ని కోల్పోయి కూలీలుగా మారారు.

**శ్రీరామ్ సాగర్ (పోచంపాడు - నిజామాబాద్, కరీంనగర్):**
తెలంగాణ ప్రాంతంలో కీలకమైన ఈ ప్రాజెక్టు వల్ల:
ముంపు గ్రామాలు: సుమారు 100 గ్రామాలు.
ముంపు భూమి: 1,18,000 ఎకరాలు.
**నిర్వాసితులు:** సుమారు 40,000 కుటుంబాలు ప్రభావితమయ్యాయి. ఇక్కడ సేకరించిన భూమిలో 70% కంటే ఎక్కువ పంటలు పండే మాగాణి భూములు కావడం గమనార్హం.
**సింగూరు ప్రాజెక్టు (మెదక్):**
హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం నిర్మించిన ఈ ప్రాజెక్టు వల్ల: నష్టం: 19 గ్రామాలు పూర్తిగా, 50 గ్రామాలు పాక్షికంగా మునిగిపోయాయి. 35,000 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. దీనిపై 90వ దశకంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు జరిగాయి.

2. పట్టా భూమి లేని వారు మరియు చేతివృత్తుల వారి ఆవేదన
1894 చట్టంలోని అత్యంత భయంకరమైన లోపం ఏమిటంటే, అది కేవలం 'రికార్డులలో ఉన్న భూమి'కే పరిహారం ఇచ్చేది. దీనివల్ల గ్రామీణ వ్యవస్థలోని ఇతర వర్గాలు తీవ్రంగా నష్టపోయాయి:
**అసైన్డ్ భూముల రైతులు:** నిరుపేదలకు, దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను తిరిగి సేకరించినప్పుడు, వారికి పరిహారం ఇవ్వాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భావించేది. దీనివల్ల సామాజికంగా వెనుకబడిన వర్గాల రైతులు తమకున్న కొద్దిపాటి ఆధారాన్ని కోల్పోయారు.

**వృత్తి పనివారు (జజమాని వ్యవస్థ):**
ఒక గ్రామం మునిగిపోయినప్పుడు మంగలి, చాకలి, కుమ్మరి, కమ్మరి వంటి వారు తమ వృత్తిని కోల్పోయేవారు. వీరికి భూమి ఉండదు కాబట్టి, పాత చట్టం వీరిని అసలు 'నిర్వాసితులు'గానే గుర్తించలేదు.
**వ్యవసాయ కూలీలు:** గ్రామంలో భూమిని సేకరిస్తే, ఆ భూమిపైనే శ్రమించి బతికే కూలీలకు పని పోయేది. వీరికి కనీసం తలదాచుకోవడానికి నీడ కూడా కరవయ్యేది. మొత్తం నిర్వాసితులలో ప్రతి 100 మందిలో 25 మంది ఇలాంటి భూమి లేని పేదలే ఉండేవారు.
3. స్వదేశంలో కాందిశీకులుగా వలస జీవితాలు
పరిహారం పొందిన వారు కూడా ద్రవ్యోల్బణం మరియు తక్కువ ధరల వల్ల ఆ నగదుతో మరో చోట సమానమైన భూమిని కొనుక్కోలేకపోయారు. ఫలితంగా:
**నగరాలకు వలస:** శ్రీశైలం, సాగర్, పోచంపాడు నిర్వాసితులు అత్యధికులు హైదరాబాద్, విజయవాడ, ముంబై వంటి నగరాలకు వలస వెళ్లి భవన నిర్మాణ కార్మికులుగా, రిక్షా కార్మికులుగా మారిపోయారు. రైతుగా గౌరవంగా బతికిన వారు, నగరాల్లో అణచివేతకు గురయ్యారు.
**కాందిశీకుల శిబిరాల వంటి కాలనీలు:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో కనీసం తాగునీరు, విద్యుత్, పాఠశాలలు లేకపోవడంతో ప్రజలు అక్కడ ఉండలేక మళ్లీ వలస బాట పట్టారు. 'వరల్డ్ బ్యాంక్' నివేదికల ప్రకారం, నిర్వాసితులలో 60% మంది తమ సొంత మూలాలను కోల్పోయి దారిద్ర్యరేఖకు దిగువన బతుకుతున్నారు.

**గిరిజన ప్రాంతాల్లో చట్టాల ఉల్లంఘన, పోలవరం అంచనాలు**
ఉమ్మడి రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో (ఖమ్మం, వరంగల్, విశాఖపట్నం) భూసేకరణ మరింత దారుణంగా ఉండేది.
**పోలవరం ప్రాజెక్టు (ఉమ్మడి రాష్ట్రం నాటి అంచనాలు):**
సుమారు 276 గ్రామాలు ముంపునకు గురవుతాయని, దీనివల్ల 3.7 లక్షల మంది జనాభా ప్రభావితమవుతారని అంచనా.
వీరిలో 50% మంది కోయ, కొండరెడ్లు వంటి గిరిజనులు. అడవిపై ఆధారపడి జీవించే వీరి సంస్కృతిని, జీవన విధానాన్ని 1894 చట్టం ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు.

**పాత చట్టం చేసిన గాయం - సామాజిక విచ్ఛిన్నం**
1894 చట్టంలో "పునరావాసం" (Rehabilitation) అనే పదమే లేదు. ప్రభుత్వం కేవలం నగదు ఇచ్చి చేతులు దులుపుకునేది. కానీ గ్రామం అంటే కేవలం ఇళ్లు కాదు, అది ఒక సామాజిక సంబంధం. మానసిక వేదన: తరతరాలుగా సాగు చేసిన పొలాన్ని, పూర్వీకుల సమాధులను, తమ దేవాలయాలను వదిలి వెళ్లడం రైతులకు తీరని వేదన మిగిల్చింది.
**గణాంకాల సారాంశం:** 1947 నుండి 2000 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 30-40 లక్షల మంది భూసేకరణ వల్ల ప్రభావితమయ్యారు. వీరిలో కేవలం 25% మందికి మాత్రమే ఏదో ఒక రకమైన నామమాత్రపు పునరావాసం లభించింది.
1894 చట్టం కాలంలో భూసేకరణ అనేది ఒక "బలవంతపు లాక్కోవడం"లా ఉండేది తప్ప, అది ఒక సామాజిక బాధ్యతగా ఉండేది కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ప్రాజెక్టుల వల్ల లబ్ధి పొందిన వారికంటే, ప్రాజెక్టుల కోసం సర్వస్వాన్ని కోల్పోయిన వారి త్యాగమే ఎక్కువ. ఈ చేదు అనుభవాలు, పదుల సంఖ్యలో జరిగిన రైతు ఉద్యమాలు, సుదీర్ఘ కోర్టు పోరాటాలే చివరికి 2013 చట్టం రావడానికి బలమైన పునాది వేశాయి. ఈ చట్టం రావడం లో మావోయిస్టుల ఉద్యమాలు తక్షణ ప్రేరణ గా నిలిచాయి. ఫశ్చిమ బెంగాల్ లో వామ పక్ష దశాబ్దాల పాలన స్థానంలో మమతా బెనర్జీ చతృణ మూల్ కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కూడా కారణమయ్యాయి.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## నగరం చిత్తడి



నాలాలు డీల
వీధుల్లో మురికిగోల
మానవ లీల
వర్షపు వేళ

కంకరు తేలిన బాటలు
నోళ్ళు తెరచిన
మ్యాన్హోల్సు
అలకరణ కోల్పోయిన
సినినటిలా నగరం
వర్షపువేళ

అస్తవ్యస్తమైన
జీవన వ్యవస్త
లీకేజులు
కూలిన
పాతభవంతులు

ఎగిరి పోన గుడిసె
కప్పులు
నిద్రపట్టని రాత్రి
ఎటుపాలుపోక
ఉదయం గదుల్లో
బందీ
వర్షపు వేళ

ఎండకు

వానకు
చలికి
భయమెందుకు
వాటితోనే
మనజీవన ప్రయాణం
వర్షపు వేళైన...

రేడియమ్
9291527757

# ప్రపంచ నగరాలతో పోటీగా స్కూల్ ఫీజుల వసూళ్లు..!

- **ప్రైవేట్, కార్పొరేట్ విద్యా దందా "3 పువ్వులు-36 కాయలు" అన్నట్టుగా మారింది..!**
- **సింగపూర్‌లో 30 శాతం ఖర్చు.. ఢిల్లీలో 130 శాతం భారం..!**
- **ప్రభుత్వాల ఉదాసీనతతో తల్లిదండ్రులపై ఫీజుల పెను భారం..చదువులు అంతంత మాత్రమే..!**




***భారతదేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ మాత్రమే కాదు.. పలు ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజులు తల్లిదండ్రులకు షాక్‌కు గురిచేస్తున్నాయి. అగ్రశ్రేణి స్కూళ్లమని చెప్పుకునే కొన్ని విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి ఏడాదికి రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నాయి. ఈ భారీ ఫీజులను చూసి తల్లిదండ్రులు, మేధావులు, విద్యావేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలోని ఐవీ లీగ్ అండర్ గ్రాడ్యు యేట్ ట్యూషన్ ఫీజులు లేదా యూరప్‌లోని ఇంటర్నేషనల్ బోర్డింగ్ స్కూళ్ల ఫీజులకు సమానంగా ఇక్కడ ఫీజులు ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.***

భారతదేశంలో విద్య క్రమంగా వ్యాపార వస్తువుగా మారిపోతోంది. కార్పొరేట్ శక్తుల ప్రవేశంతో విద్యారంగంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. పలు బడా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల భారం తల్లిదండ్రుల నడ్డి విరుస్తోంది. చాలామంది తల్లిదండ్రులు తమ వార్షిక ఆదాయానికి మించి పిల్లల చదువుల కోసం ఖర్చు చేస్తున్నారు. ప్రపంచంలోని సింగపూర్, దుబాయ్, న్యూయార్క్ వంటి నగరాల్లో ఉన్న స్కూల్ ఫీజులతో సమానంగా మన దేశంలో ఫీజులు వసూలు చేస్తున్నా.. అందుకు తగ్గట్టుగా భారతీయ తల్లిదండ్రుల ఆదాయాలు మాత్రం లేవు.
అంతేగాక, లక్షల్లో ఫీజులు చెల్లిస్తున్న పిల్లలకు అందుకు తగిన విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు కూడా అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలలపై కఠిన నియంత్రణ ఉండాలని విద్యావేత్తలు, నిపుణులు సూచిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయి ఫీజులు భరించే ఆర్థిక స్థోమత భారతీయ కుటుంబాలకు లేకపోయినా.. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వారిని ఆ దిశగా నెట్టేస్తోంది. విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ శక్తులు, వాటిని నియంత్రించడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారతదేశంలో చాలామంది తల్లిదండ్రులు తమ వార్షిక ఆదాయంలో 50 శాతం నుంచి 130 శాతం వరకు పిల్లల స్కూల్ విద్య కోసం ఖర్చు చేస్తున్నారనే అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అంటే కొన్ని సందర్భాల్లో వార్షిక ఆదాయానికంటే ఎక్కువ మొత్తాన్ని విద్య కోసం వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**చదువులు అంతంత మాత్రమే..!**
మన దేశంలో అంతర్జాతీయ ప్రమాణాల పేరుతో భారీ ఫీజులు వసూలు చేస్తున్న అనేక స్కూళ్లలో మౌలిక వసతులు మాత్రం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ఒక తరగతి గదిలో సగటున 35 నుంచి 40 మంది విద్యార్థులు కూర్చోవాల్సి వస్తోంది. స్విమ్మింగ్ పూల్స్, ల్యాబ్‌లు, ఆడిటోరియంలు ఉన్నప్పటికీ.. వాటిని పరిమితికి మించి విద్యార్థులు వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది.
అంతర్జాతీయ ప్రమాణాల విద్య అని ప్రచారం చేస్తున్నా.. ఉపాధ్యాయుల శిక్షణ, బోధనా విధానాలు అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విదేశాల్లోని అనేక ఇంటర్నేషనల్ స్కూళ్లలో ఒక తరగతి గదిలో 15 నుంచి 20 మంది విద్యార్థులు మాత్రమే ఉంటారు. ఫీజులకు తగినట్టుగా సదుపాయాలు, వ్యక్తిగత శ్రద్ధ, నాణ్యమైన విద్య అక్కడ విద్యార్థులకు అందుతుంది.

**ఫీజుల దోపిడికి కళ్లెం ఇంకెప్పుడు..?**
మన రాష్ట్రంలోనూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచకుండా నియంత్రిస్తామనే మాటలు సంవత్సరాలుగా వినిపిస్తున్నా.. అవి ఆచరణలోకి రావడం లేదు. మరో విద్యాసంవత్సరం ప్రారంభానికి సమయం దగ్గర పడుతున్నప్పటికీ, ఫీజుల నియంత్రణపై స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంతో తల్లిదండ్రుల గుండెల్లో ఆందోళన పెరుగుతోంది. గత కొన్నేళ్లుగా ఫీజుల నియంత్రణ కోసం కమిటీలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా.. చట్టపరమైన చర్యల విషయంలో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదు. దేశంలోని అనేక నగరాలతో పోలిస్తే హైదరా బాద్‌లోనే స్కూల్ ఫీజులు అధికంగా ఉన్నాయని కొన్ని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలోని కొన్ని కార్పొరేట్ పాఠశాలలు ఇంజనీరింగ్ విద్యకు సమానంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. నియంత్రణ లేకపోవడంతో కొన్నిచోట్ల ప్రతి ఏడాది 20 నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచుతున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.
విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పిస్తామని హైకోర్టులో అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం.. వాటి అమలులో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. విద్యా హక్కు చట్టం--2009లోని సెక్షన్ 12(1)(సి) ప్రకారం అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు 25 శాతం సీట్లను బలహీన వర్గాలు, అనాథలు, ఎయిడ్స్ బాధిత కుటుంబాల పిల్లలకు కేటాయించాలి. ఇందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం తిరిగి చెల్లించవచ్చు. దేశంలోని పలు రాష్ట్రాలు ఇప్పటికే ఈ నిబంధనను అమలు చేస్తున్నప్పటికీ.. మన రాష్ట్రంలో మాత్రం సవరణల పేరుతో అమలు నిర్లక్ష్యానికి గురవుతోంది. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టి బాధ్యతగా రాజ్యాంగంలో పొందుపరిచాయి. ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కానీ విద్యారంగంపై నియంత్రణ కోల్పోయిన పాలకులు.. దానిని కార్పొరేట్ శక్తుల చేతుల్లో వ్యాపార వస్తువుగా మారనిచ్చారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఉచిత పథకాలపై చూపుతున్న శ్రద్ధ.. విద్య, వైద్యం వంటి ప్రాథమిక రంగాలపై కనిపించడం లేదు.
ఉచిత, నాణ్యమైన విద్య కోసం ప్రజల్లో మరో చైతన్య పోరాటం రావాల్సిన అవసరం ఉంది. విద్యారంగంలోని ఈ వ్యాపారీకరణ, కార్పొరేటీకరణకు అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వాలే పూర్తి బాధ్యత తీసుకోవాలి. విద్యను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చి.. అందరికీ సమాన అవకాశాలు కల్పించినప్పుడే ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధ్యమవుతుంది. అదే నిజమైన ప్రజాస్వామ్యానికి బలమైన పునాది.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# 'సంక్షోభమా లేక అవకాశమా?'

## అనిశ్చితి నడుమ భారత ఆర్థిక భవిష్యత్తు




2026వ సంవత్సరం ప్రారంభంలో భారత ఆర్థిక వృద్ధిపై అంచనా లు 6.8 శాతం నుంచి 7.2 శాతం మధ్యలో ఉన్నాయి. అయితే ఇరాన్ పై జరిగిన దాడి తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయా యి. ముడి చమురు ధరలు ఆకాశమంటాయి, రూపాయి విలువ తీవ్రంగా పడిపోయింది. ఫలితంగా మూడీస్ సంస్థ 2026లో భారత వృద్ధి రేటు 6 శాతానికి పడిపోతుందని హెచ్చరిస్తోంది. ఇటీవలి తాజా గణాంకాల ప్రకారం భారత వాస్తవ జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి ) వృద్ధి 2025-26లో 7.6 శాతంగా ఉంది. అయితే 2026-27లో ఈ వృద్ధి రేటు మందగిస్తుందని, ఇంధన ధరల పెరుగుదల, ప్రపంచ వాణిజ్య అనిశ్చితుల కారణంగా సవాళ్లు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
ఈ సందర్భంగా ప్రభుత్వం ముందున్న దారి ఏమిటి? రుపాయి బలహీనతను ప్రయోజనంగా మార్చుకోవడం సమంజసమైన మార్గం. ఒక సంవత్సరం క్రితం ఒక డాలర్ విలువ సుమారు 85 రూపాయలు ఉండేది. నేడు అది 96 రూపాయలకు చేరింది. ఫలితంగా భారత ఎగుమతులు చౌకగా, పోటీతత్వంతో మారాయి. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఎగుమతి రంగాన్ని ప్రోత్సహించాలి. అంతేకాకుండా విదేశీ కంపెనీలకు భారత్ లో తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి అనువైన వాతావరణాన్ని కల్పించాలి.
దిగుమతి చమురు, గ్యాస్ పై భారత ఆధారపడటం తగ్గించడం తక్షణ అవసరం. ప్రధాని మంత్రి రైతులను సౌర పంపుల వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రిక్ వాహనాలు, జీవ ఇంధనాలను మరింతగా ప్రోత్సహించాలి. రష్యా రూపాయలకు చమురును విక్రయించడానికి సిద్ధపడితే దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకోవాలి. ఈ చర్యలు దిగుమతి బిల్లును గణనీయంగా తగ్గించగలవు. ప్రస్తుతం చమురు, బంగారం, ఎరువులు, వంటనూనె, ఎలక్ట్రానిక్స్ -- ఈ ఐదు వస్తువుల దిగుమతులే భారత మొత్తం దిగుమతుల్లో సగానికి పైగా ఉన్నాయి.
దేశీయ వినియోగ డిమాండ్ భారత ఆర్థిక వృద్ధికి ప్రధాన చోదక శక్తి. ద్రవ్యోల్బణం పెరిగితే వినియోగం దెబ్బతింటుంది, ముఖ్యంగా దిగువ ఆర్థికవర్గాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ప్రభుత్వాలు చేస్తున్న నగదు బదిలీలు అంతా ఈ వర్గాలను రక్షించడంలో సహాయపడతాయి. మరోవైపు కరోనా సమయంలో చూసినట్లు ప్రీమియం వినియోగ డిమాండ్ స్థితిస్థాపకంగా ఉంటుంది. బలమైన స్టాక్ మార్కెట్లు సంపన్న వర్గాలకు పెట్టుబడుల్లో లాభాలు అందిస్తున్నాయి, తద్వారా వారి వినియోగ సామర్థ్యం పెరుగుతోంది. ఇలాంటి చిన్న విధాన మార్పులు కూడా కావాల్సిన ప్రభావాన్ని చూపగలవు.
భారత ఆర్థిక దృశ్యంలో మరో ముఖ్యమైన సవాల్ నిరుద్యోగ సమస్య. 2026లో యువత నిరుద్యోగిత రేటు 15 శాతానికి చేరింది. 22-29 సంవత్సరాల వయస్సు గల గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగిత రేటు 33 శాతంగా ఉంది. గ్రాడ్యుయేట్లలో సుమారు 40 శాతం మంది ఉపాధి లేకుండా ఉన్నారు. భారత్ లో 15-29 సంవత్సరాల మధ్య 367 మిలియన్ల యువకులు ఉన్నారు. ఇది అద్భుతమైన జనాభా సామర్థ్యం. అయితే విద్యా నైపుణ్యాలకు, సృష్టించబడుతున్న ఉద్యోగాలకు ఎంతో అంతరం ఉంది. ప్రతి సంవత్సరం 50 లక్షల గ్రాడ్యుయేట్లు ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. కానీ తగినంత ఉద్యోగాలు లేకపోవడంతో ఈ విద్యాసామర్థ్యం సరైన ప్రయోజనాలను అందించడంలేదు. జనాభా డివిడెంట్ ప్రయోజనాన్ని పొందడానికి 2030 నాటికి సమయం చాలా కఠినంగా మారుతోంది. ఆ తర్వాత కార్మిక వయస్సు జనాభా వాటా తగ్గడం ప్రారంభమవుతుంది.
వాతావరణ మార్పు ప్రభావం కూడా ఆర్థిక వ్యవస్థపై దృష్టి పెట్టాల్సిన అంశం. ప్రపంచంలోనే అత్యంత వేడిగా ఉండే 100 నగరాల్లో 98 భారత్ లోనే ఉన్నాయి. ఏప్రిల్ 24 నాలుగేళ్లలోనే అత్యంత వేడి రోజుగా నమోదైంది. వేడి తీవ్రత విపరీతంగా పెరుగుతుండడంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగింది. గత ఏప్రిల్ 25న గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 256 జీడబ్ల్యూ (గిగావాట్) కు చేరింది, గత ఏడాది ఇదే నెలలో 235 జీడబ్ల్యూగా ఉండేది. గ్రిడ్లపై భారం పెరిగి, లోడ్ షెడ్డింగ్ ప్రమాదం పెరుగుతుంది. ఇది ఉత్పాదన మీద తీవ్ర ప్రభావం చూపిస్తుంది. రైతులు అప్పటికే ఇన్పుట్ ఖర్చులతో పోరాడుతున్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతంలో కొరత ఏర్పడి, వ్యవసాయ ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతింటుంది. 2025లో తీవ్ర వాతావరణ ఘటనలు 4,419 మంది ప్రాణాలను బలితీసుకున్నాయి, 2025లోనే 99 శాతం రోజుల్లో తీవ్ర వాతావరణం నెలకొంది. ఈ మహమ్మారి స్థాయి సంక్షోభం కొనసాగితే ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది.

తెలుగు రాష్ట్రాలను ప్రత్యేకంగా పరిశీలిస్తే, తెలంగాణ నగరీకరణ రంగంలో దేశాన్నే దాటిపోయింది. 2026 నాటికి తెలంగాణలో 50.08 శాతం నగరీకరణ ఉంటుందని అంచనా. ఇది దేశ సగటు 36.01 శాతం కంటే చాలా ఎక్కువ. కృత్రిమ మేధ - ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీతో బిల్డింగ్ నిర్మాణ అనుమతుల ప్రక్రియను సామాన్యంగా మారుస్తుంది. బిల్డ్‌నౌ వేదిక 24 లక్షల చదరపు అడుగుల, 66 అంతస్తుల భవన నిర్మాణ ప్రణాళికను కేవలం 1 నిమిషం 31 సెకన్లలో పరిశీలించి రికార్డు సృష్టించింది. వ్యవస్థకు మంచి సామర్థ్యం ఉంది కానీ ఇలాంటి సాంకేతిక సామర్థ్యం ఉద్యోగాల కల్పనకు అనువదించబడుతుందా లేదా అనేది ప్రశ్న.
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో అమెజాన్ మార్కెట్ వృద్ధి నాలుగు రెట్లు పెరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి అమెజాన్ దగ్గర 75 వేలకు పైగా విక్రేతలు ఉన్నారు. ఇది డిజిటల్ ఆర్థిక వ్యవస్థ సామర్థ్యానికి సంకేతం. అయితే నిరుద్యోగ సమస్య మాత్రం ఇక్కడా పెద్ద సవాలుగా మిగిలింది. తెలుగురాష్ట్రాల్లోని యువతకు స్థానిక ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉండటంతో విదేశాల వలసలు పెరుగుతున్నాయి.
చివరిగా, ప్రపంచీకరణ అనిశ్చితులు, యుద్ధ ఉద్రిక్తతలు, దేశీయ సమస్యల మధ్య భారత ఆర్థిక వ్యవస్థ కీలకమైన మలుపులో ఉంది. దేశం రెండు మార్గాలను ఎంచుకోవచ్చు. ఒకటి సురక్షితంగా 6 శాతం వృద్ధితో సరిపెట్టుకోవడం, రెండవది బోల్డ్ నిర్ణయాలు తీసుకుని 7 శాతం వృద్ధి లక్ష్యంగా పయనించడం. ప్రస్తుత ఇంధన ధరల సంక్షోభం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారీ సవాళ్లు సృష్టిస్తున్నాయి. కానీ ప్రతి సంక్షోభంలోనూ ఓ అవకాశం ఉంటుంది. భారత ప్రభుత్వం సరైన దృక్పథంతో, సరైన విధానాలతో ముందుకు వెళితే, ఈ సంక్షోభాన్ని ఒక బంగారు అవకాశంగా మార్చుకోవడం సాధ్యమవుతుంది. దేశ భవిష్యత్తు నేడు తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# చెంచుల జీవనోపాధి అభివృద్ధికి టీజీఐఎల్పీ కీలకం

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**అచ్చంపేట, మే 15 (జనం సాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఆదివాసి గిరిజన అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ ఇన్‌క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రాం (టీజీఐఎల్పీ)ను సమర్థవంతంగా అమలు చేసి చెంచు గిరిజన కుటుంబాలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ పెంట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, అత్యంత పేదరిక పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు గుర్తించిన 34 చెంచు కుటుంబాలతో సమావేశమై వారి సమస్యలను నేరుగా కలెక్టర్ తెలుసుకున్నారు. కుటుంబాల జీవన విధానం, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య పరిస్థితులు, పిల్లల విద్య, తాగునీటి సౌకర్యాలు వంటి అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., చెంచు గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తరతరాలుగా అడవులపై ఆధారపడి జీవిస్తున్న చెంచు కుటుంబాలను ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధిలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. టీజీఐఎల్పీ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించి, వారిని స్వయం ఆదాయం పొందే స్థాయికి చేర్చాలని అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా, ఆర్థికంగా నిలదొక్కుకునే కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కుటుంబానికి వారి సామర్థ్యాలు, ఆసక్తులను ఆధారంగా చేసుకుని ప్రత్యేక జీవనోపాధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పశుపోషణ, కోళ్ల పెంపకం, చిన్నచిన్న వ్యాపారాలు, అటవీ ఉత్పత్తుల ఆధారిత ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో శిక్షణలు ఇచ్చి ఆదాయ వనరులు పెంచాలని అధికారులకు ఆదేశించారు. చెంచు మహిళల ఆర్థిక సాధికారతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మళ్లీ 20వ తేదీన సందర్శిస్తానని అప్పటివరకు వారికి అనువైన స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించాలని కోరారు. మహిళా సంఘాల ద్వారా పొదుపు అలవాట్లు పెంపొందించి, బ్యాంకు లింకేజీలు కల్పించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించాలని, గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మల్లాపూర్ పెంటలో మౌలిక వసతుల కొరతపై గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, తాగునీరు, విద్యుత్, రహదారులు, ఆరోగ్య సేవలు, విద్యా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పిల్లలు చదువుకు దూరం కాకుండా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన చెంచు కుటుంబాలకు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, పింఛన్లు, రేషన్, ఆరోగ్య భద్రత పథకాలు, గృహ నిర్మాణ పథకాలు వంటి ప్రయోజనాలు అందకుండా ఎవరూ మిగలకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. చెంచు కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని, గ్రామ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం సాయం అందించడం మాత్రమే కాకుండా, ప్రతి కుటుంబం గౌరవప్రదమైన జీవితం గడపగలిగే స్థాయికి తీసుకెళ్లడమేనని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి చిన్న ఓబులేష్, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుల పాలిట శాపంగా మోడీ సర్కార్ నిర్ణయాలు



**ఇబ్రహీంపట్నం, మే 15 (జనం సాక్షి) :** పేదల సంక్షేమం మరిచి, అడుగడుగునా ఆర్థికంగా అణిచివేసే విధంగానే పదేళ్ల మోదీ పాలన ఉందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి విమర్శించారు. మత విద్వేషాలు, జాతీయవాదంతో ఎన్నికల్లో నెగ్గి తర్వాత పేదలపాలిటశాపంగా మారారని ఆరోపించారు. బంగారం కొనుగోలు ఆపేయాలని, ఖర్చులు తగ్గించాలని, వాహనాలు వాడవద్దంటూ జాతిని కోరుతున్న ప్రధాని దీనికి కారణం ఎవరో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 3దశాబ్దాల క్రితం ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో పీవీ, మన్మోహన్ సింగ్ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలే నేడు దేశాన్ని నడిపిస్తున్నాయని సరైన నిర్ణయాలు తీసుకోవటంలో మోదీ సర్కార్ వైఫల్యమే నేటి ఆర్థిక విపత్తులకు కారణమన్నారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల వేళ మౌనంగా ఉండి, పూర్తైన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరల్ని పెంచటం ప్రజలను వంచించటమేనని విమర్శించారు. దేశంలో నేడు నెలకొన్న పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ అవసరాన్ని గుర్తుచేస్తుందని చెప్పారు. యూపీఏ హయాంలో తెచ్చిన ఉపాధిహామీ పథకంలాంటి వాటిని నిర్వీర్యం చేసి, రాష్ట్రాలపై ఇప్పటికే పెనుభారం మోపటమే కాకుండా, పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, కార్పొరేట్లకు వంతపాడుతున్నారని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ఉంటేనే ప్రజలకు సరైన పాలన అందుతుందని మల్ రెడ్డి తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్టులు




**హయత్ నగర్, మే 15 (జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల "టియుఎఫ్ రాష్ట్ర కమిటీ" పిలుపు మేరకు ప్రగతి భవన్ లో ఉద్యమకారుల హామీల మెమోరాండం సమర్పించే క్రమంలో గృహ అరెస్ట్ చేసి హయత్ నగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. టియుఎఫ్ రాష్ట్ర వర్కింగ్ కన్వీనర్ జెనిగే విష్ణువర్ధన్ నిర్వహించిన నిరసన కార్యక్రమం లో వారు మాట్లాడుతూ ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఉద్యమకారులది ఒకటి అని అన్నారు. మా డిమాండ్లు 250 గజాల స్థలం, పింఛన్, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూన్ రెండవ తారీకు వరకు మా కోరికలు నెరవేర్చాల్సిందిగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నాం. లేని పక్షంలో ప్రజా ప్రతినిధులైన శాసనసభ్యుల ఇండ్లను ముట్టడించడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంత యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జోరుక రామ్ ముదిరాజ్, ముసర గారి రాజు గౌడ్, రంగారెడ్డి జిల్లా, మహిళా అధ్యక్షురాలు తండ ఉపేంద్ర యాదవ్, బాబూలాల్, రామ్, లక్ష్మణ్, ఇంద్ర, వరలక్ష్మి, బలరాం, కొత్త శివలింగం గౌడ్, చిత్రం కృష్ణ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

- జిల్లా కలెక్టర్‌ను కోరిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన



**ఇబ్రహీంపట్నం, మే 15 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోల్లు ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా ఏమాత్రం ముందుకు సాగడం లేదని జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని పలువురు రైతులు మంచిరెడ్డికి ఫిర్యాదు చేశారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నా రోజుకో మాట చెబుతూ కాలం గడుపుతున్నారని రైతులు ఆయనకు వివరించారు. వెంటనే ఆయన జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి కి ఫోన్ చేసి సమస్యను వివరించారు. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో 12 కొనుగోలు కేంద్రాల్లో సుమారుగా 70వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయవలసి ఉండగా నేటికి కేవలం నాలుగు వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారని ఆయన కలెక్టర్ కు వివరించారు. గన్నీ బ్యాగులు రైతులకు అందుబాటులో లేవని కావాలనే వాటిని పంపిణీ చేయడం లేదని ఆయన ఆరోపించారు. రోజుల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఆయన తెలిపారు. గన్నీ బ్యాగుల కొరత , తేమ శాతం తదితర కారణాలతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీల కొరత సాకుతో కొద్దిపాటి ధాన్యాన్ని కూడా కొనుగోలు కేంద్రాల నుంచి తరలించడం లేదని చెప్పారు. రైతులు గట్టిగా అడిగితే రైస్ మిల్లర్లు సహకరించడం లేదని అధికారులు చెబుతున్నారని ఆయన కలెక్టర్ కు వివరించారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు 1800 రూపాయలకే క్వింటాల్ చొప్పున దళారులకు అమ్ముతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. గన్నీ బ్యాగుల కొరత లేదని , కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నారాయణరెడ్డి హామీ ఇచ్చారని మంచిరెడ్డి కిషన్ రెడ్డి చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి , మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి , రైతు బంధు సమితి అధ్యక్షులు మొద్దు అంజిరెడ్డి , బుస్సు పుల్లారెడ్డి , మండల పార్టీ అధ్యక్షులు బుగ్గరాములు , రమేష్ గౌడ్ , చీరాల రమేష్ , అల్వాల వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు




**జడ్చర్ల, మే 15 (జనంసాక్షి) :** జడ్చర్ల పురపాలక సంఘం కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గత కొంతకాలంగా మున్సిపాలిటీ పరిధిలో విపరీతమైన అవినీతి జరుగుతోందని, వివిధ పనుల కోసం అధికారులు ముక్కుపిండి లంచాలు వసూలు చేస్తున్నారంటూ వచ్చిన పలు ఫిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు ఈ దాడులు చేపట్టారు. మహబూబ్ నగర్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సిహెచ్. బాలకృష్ణ ఆధ్వర్యంలో పది నుండి పదిహేను మంది అధికారుల బృందం కార్యాలయంలోకి ప్రవేశించి ఏకకాలంలో అన్ని విభాగాల్లో సోదాలు ప్రారంభించింది. ఇంజనీరింగ్, శానిటేషన్, రెవెన్యూ, జనన-మరణాల ధృవీకరణ పత్రాల విభాగాలతో పాటు భవన నిర్మాణ అనుమతులకు (టౌన్ ప్లానింగ్) సంబంధించిన కీలక రికార్డులను, ఫైళ్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

### రాజకీయంగా, పరిపాలనాపరంగా తీవ్ర చర్చ

ఈ నెల 6వ తేదీతో జడ్చర్ల మున్సిపల్ పాలకవర్గం గడువు ముగియడం, 7వ తేదీ నుండి ప్రత్యేక అధికారిగా (స్పెషల్ ఆఫీసర్) జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ బాధ్యతలు చేపట్టడం తెలిసిందే. మున్సిపల్ పాలకవర్గం గడువు ముగిసిన కొద్దిరోజులకే, స్పెషల్ ఆఫీసర్ పరిపాలన ప్రారంభమైన తొలి వారంలోనే ఈ స్థాయిలో ఏసీబీ దాడులు జరగడం నియోజకవర్గవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

### లంచం డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయండి

ప్రభుత్వాధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ధైర్యంగా ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు లేదా వాట్సాప్ మరియు సోషల్ మీడియా వేదికల ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రస్తుతం తనిఖీలు, రికార్డుల వెరిఫికేషన్ కొనసాగుతున్నాయని, పూర్తి వివరాలను ఉన్నతాధికారుల అనుమతితో నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలు




**శివ్వంపేట, మే 15 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన శివ్వంపేట గ్రంథాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి నివేదిక లో భాగంగా మే 11 నుండి 17 వరకు విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం శివంపేట శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినీ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శివంపేట గ్రంథాలయ పాలకురాలు డి అర్చన ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను స్థానిక సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్, ఉప సర్పంచ్ ఇసుగారి మల్లేశం శివంపేట గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులతో కలిసి పుస్తక ప్రదర్శనను ఆమె తిలకించారు. అనంతరం స్థానిక సర్పంచ్ రాజి పేట వెంకటేశ్వర్,ఉప సర్పంచ్ ఇసుగారి మల్లేశం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డిని ఘనంగా శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బుచ్చ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్, స్థానిక సర్పంచ్ రాజపేట వెంకటేశ్వర్, ఉప సర్పంచ్ ఇసుగారి మల్లేష్ గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, శివంపేట గ్రంథాలయ శాఖ గ్రంథాలయ అధికారులు డి. అర్చన, యాదగిరి, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం తరలించడం లేదని నిరసన

- నర్సాపూర్ చౌరస్తాలో రైతుల రాస్తారోకో
- వారం రోజులుగా లారీలు రావడం లేదంటు ఆందోళన
- తహసీల్దార్ సర్ది చెప్పడంతో నిరసన ముగించిన రైతులకు




**నర్సాపూర్, మే 15 (జనం సాక్షి) :** గత వారం రోజులుగా వరి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడం లేదంటూ రైతులు రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేసిన సంఘటన నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలకు వెళితే మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తుజాల్పూర్ గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం నర్సాపూర్ లోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత వారం రోజులుగా తూకం వేసిన వరి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రోజుల తరబడి దాన్యం కేంద్రం వద్దే నిరీక్షించాల్సి వస్తుందని అన్నారు. వర్షం వస్తే దాన్యం నీటి పాలవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యాన్ని తరలించిన లారీలను అన్లోడ్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేసి, రైస్ మిల్లులకు తరలించాలని కోరారు. అనంతరం తహసిల్దార్ శ్రీనివాస్ అక్కడకు చేరుకొని ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటామని రైతులకు సద్ది చెప్పడంతో నిరసన కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో తుజాల్ పూర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు త్వరలో పాదయాత్ర



**వనపర్తి రూరల్, మే 15 (జనం సాక్షి) :** మాజీ మంత్రి శ్రీనువాస్ గౌడ్ స్వగృహంలో శుక్రవారం ఉమ్మడి పాలమూరు జిల్లా బి ఆర్ ఎస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ అతి త్వరలో పాదయాత్ర చేస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కె సి ఆర్ ను సంప్రదించి తేదీ, స్థలం ప్రకటిస్తాం అని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యక్తి సీఎం అవుతారని ప్రజలు పన్నెండు సీట్లు గెలిపించారు. నల్లమల పులి బిడ్డ అంటూ ప్రసంగాలు ఊదర కొట్టారు. డెబ్బై సార్లు ఢిల్లీ వెళ్లిన సీఎం అధిష్టానంతో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు గురించి ఒకసారి కూడా అడగలేదు. బీ ఆర్ ఎస్ సాగు నీళ్లు ఇవ్వలేదని కొందరు మాట్లాడుతున్నారు. తెలంగాణ రాకముందు యాసంగిలో నాలుగైదు లక్షల ఎకరాల వరి కూడా సాగు కాలేదు, 2026 యాసంగిలో 65 లక్షల ఎకరాలు సాగు అయింది. కాంగ్రెస్ వచ్చాక ఒక ఎకరాకు అయినా సాగునీరు ఇచ్చిందా? తెలంగాణ లో మూడు కోట్ల టన్నుల వడ్లు తెలంగాణ రైతాంగం పండించారు. రాష్ట్రంలో మొక్క జొన్న, వరి పంట రైతులు అరిగోస పెట్టి, తరుగు పేరిట చేస్తున్నారు అని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు శ్రీనువాసు గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నరెందర్ రెడ్డి, అంజన్న యాదవ్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రాంమోహన్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీ శ్రీనువాస్ రెడ్డి, బి ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, ఎం ఎల్ సీలు వాని దేవి, నవీన్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం తూకం వేసి వెంటనే లారీలలో మిల్లుకు తరలించాలి

మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకన్ గౌడ్




**బొంరాస్‌పేట, మే 15 (జనం సాక్షి) :** మండల పరిధిలోని నాందార్ పూర్ గ్రామంలో ఐకెపి, బాపల్లి తండాలో డీసీఎంఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకన్ గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే లారీలలో మిల్లులకు తరలించాలన్నారు.అనంతరం దుద్యాల మండలం గౌరారం గ్రామంలోని రైస్ మిల్లును సందర్శించి ధాన్యం నిల్వలను పరిశీలించారు.

# నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి

- కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్



**చేర్యాల, మే 15 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు కేంద్ర విద్యాశాఖ మంత్రి పూర్తి బాధ్యత వహించాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని, ప్రస్తుతం వారు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. డాక్టర్ కావాలనే లక్ష్యంతో ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి సిద్ధమైన విద్యార్థుల ఆశలపై ఈ పేపర్ లీకేజీ నీళ్లు చల్లినట్లైందని ఆవేదన వ్యక్తం చేశారు. సమయం కేటాయించి శ్రమించిన విద్యా ర్థులు తీవ్ర అయోమయంలో ఉన్నారని, పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) తన పారదర్శకతను నిరూపించుకోవడంలో విఫలమైందని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీకి పాల్పడిన కార్పొరేట్ విద్యా మాఫియాపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో నిష్పక్షపాతంగా విచారణ జరిపి, లీకేజీకి కారణమైన ప్రతీ ఒక్కరిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి విద్యా రంగంపై ఉన్న నిర్లక్ష్యం ఈ ఘటనతో బహిర్గతమైందని ఆరోపించారు. ఇలాంటి పేపర్ లీకేజీల కారణంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల కోశాధికారి నంగి కనకయ్య, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, మండల కార్యవర్గ సభ్యులు ఎగుర్ల ఎల్లయ్య, గోమారపు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
16 మే 2026

# అభివృద్ధిలో తెలంగాణను నెంబర్‌వన్ చేయాలన్నదే సర్కార్ లక్ష్యం

- ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తెలంగాణ రూపుదిద్దుకుంటోంది
- రూ.650 కోట్ల పెట్టుబడితో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు రావాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి ప్రతినిధి, మే 15 (జనంసాక్షి) :** తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, 'తెలంగాణ రైజింగ్' నినాదంతో మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రకటించారు. జహీరాబాద్‌లో ఒక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసే ప్రణాళికలను ఆయన ప్రస్తావించారు. మంత్రులు శ్రీధర్ బాబు మరియు దామోదర రాజనరసింహ కొండాపూర్ మండలం, తొగార్‌పల్లిలో పర్యటించారు. అక్కడ వారు రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఆహార పరిశ్రమ ప్రాజెక్టుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి , టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరయ్యారు. కేజేఎస్ యూనిట్--×× స్థానిక మహిళలకు 1,500 ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 1500 మందికి, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భారీ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌లు ఏర్పాటుకానున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 9 ట్రిలియన్ డాలర్ల మార్కెట్‌గా ఎదగనున్న నేపథ్యంలో తెలంగాణ కూడా ఈ రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించే దిశగా అడుగులు వేస్తోందన్నారు.
జహీరాబాద్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని (నిమ్జ్)ను అతిపెద్ద పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్‌గా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. 65 శాతం పైగా యువత నైపుణ్యాలను వినియోగించుకొని తెలంగాణను మరింత శక్తివంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతాలను గుర్తించి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ దేశంలో అత్యధిక వరి ధాన్యం ఉత్పత్తి చేసే రాష్ట్రంగా నిలిచిందని, పాలు, పండ్లు, కూరగాయలు, పసుపు వంటి ఉత్పత్తులలో కూడా రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు విలువను పెంచే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటవడం రైతులకు, యువతకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పటాన్‌చెరు గుర్తింపు పొందిందన్నారు. అదే తరహాలో వెనుకబడిన ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో ఇంత పెద్ద స్థాయిలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న కే జేఎస్ ఇండియా యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని పేర్కొన్నారు. మెదక్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి స్వర్గీయ ఇందిరా గాంధీ ఎంపీగా ఉన్న సమయంలో ఏర్పడిన పారిశ్రామిక ప్రోత్సాహక చర్యలే కారణమన్నారు. సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందేందుకు ఇంకా అనేక ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, టి జి ఐ ఐ సి చైర్మన్లు నిర్మల జగ్గారెడ్డి, గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్, టీజీఐఐసి ఎండి శశాంక్, మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కంపెనీ చైర్మన్ గిరీష్ జైన్,ఎండి సి.పి. రాంకా, తొగరపల్లి సర్పంచ్ దివ్యవాణి ప్రశాంత్ గౌడ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- గ్రంథాలయ చైర్మన్ అంజయ్య
- సంగారెడ్డిలో ఘనంగా "లైబ్రరీ డే"



**సంగారెడ్డి, మే 15 (జనం సాక్షి) :** నేటి యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సమస్త చైర్మన్ అంజయ్య పిలుపునిచ్చారు. విద్యా వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా "లైబ్రరీ డే" పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పుస్తకాల ప్రదర్శనను ఆయన పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ...విద్యార్థులు, యువత, పాఠకులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. యువతలో చదువుపై ఆసక్తి పెంచేందుకు గ్రంథాలయ శాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పుస్తకాలు మనిషికి మంచి మిత్రులని, గ్రంథాలయాలు జ్ఞానానికి నిలయాలుగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా సాహిత్యం, చరిత్ర, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలను కూడా చదవాలని సూచించారు. డిజిటల్ యుగంలోనూ పుస్తక పఠనానికి ఉన్న ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి వసుంధర, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## కేంద్రాల్లో గన్ని బ్యాగుల కొరత లేకుండా చూడాలి



**నిజాంపేట, మే 15 (జనంసాక్షి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగుల కొరత లేకుండా** తగినంత నిలువలు అందుబాటులో ఉంచాలని ఎంపీడీవో రాజిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నందిగామ గ్రామంలో శుక్రవారం రోజున ఆయన సందర్శించి లోడింగ్ అన్ లోడింగ్ విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల వడ్లు తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే రైతులు ఇబ్బంది పడకుండా సీరియల్ ప్రకారం ధాన్యం సేకరణ చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల స్వప్న రమేష్ కేంద్రం నిర్వాహకులు బాజే చందు, మనోహర్, రిషికేశ్, తదితర రైతులు ఉన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎస్పీ వినీత్
- అక్రమ గోవుల రవాణాపై కఠిన చర్యలు
- బార్డర్ చెక్‌పోస్టుల వద్ద 24 గంటల నిఘా
- పోలీసు, రెవెన్యూ, వెటర్నరీ శాఖల సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు

**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 15 (జనం సాక్షి) :** రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షించడంతో పాటు అక్రమ గోవుల రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులు, వెటర్నరీ డాక్టర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా అమలు చేయాల్సిన భద్రతా చర్యలు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు, పశువుల రవాణాపై నిఘా తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... బక్రీద్ పండుగను ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా గోవులను తరలించినా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలలో రవాణా చేసినా సంబంధిత వారిపై కఠిన చట్టపరమైన చర్యలు




తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పరిధిలోని బోర్డర్ చెక్‌పోస్టుల్లో 24ఐ7 పోలీసు సిబ్బందితో పాటు వెటర్నరీ డాక్టర్లు కూడా అందుబాటులో ఉండి తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా మక్తల్, మద్దూర్, కోస్గి సంతలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పశువుల రవాణా సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సరైన అనుమతి పత్రాలు మరియు "ఫిట్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్" సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అక్రమ రవాణాలో పట్టుబడిన ఆవులు, లేగ దూడలను తాత్కాలిక గోశాలల్లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ ప్రాంతాల్లో అనుమతి పొందిన వధశాలల్లో మాత్రమే కార్యకలాపాలు నిర్వహించాలని, వధ అనంతరం మిగిలే వ్యర్థాలను అదే రోజు తొలగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యర్థాలను ఎక్కడ వేయాలో ముందుగానే మున్సిపల్ అధికారులు గుర్తించి అక్కడే గోతి తీసి పూర్చి వేయాలని ఆదేశించారు. అలాగే సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు వ్యాప్తి చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పెట్రోలింగ్ అధికారులను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్ ఆర్డీఓ రమేష్, సిఐ లు శివ శంకర్, సైదులు, రామ్ లాల్, భగవంత్ రెడ్డి, ఎస్ఐ లు రెవెన్యూ శాఖ అధికారులు, వెటర్నరీ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

**కోహెడ, మే 15 (జనంసాక్షి) :** మండల ములోని శనిగరం గ్రామంలోని గ్రామపంచాయతీ వద్ద వైట్ ఫీల్ట్ బయో ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్వేస్ బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ల సౌజన్యం, వారి సహకారంతో గ్రామం లో 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీసీ కెమెరాలను ముఖ్య అతిథిగా అదనపు డీసీపీ కుషాల్కర్ విచ్చేశారు. ఆయన చేతుల మీదుగా సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు డి సి పి మాట్లాడుతూ అధునిక సాంకేతికతను కలిగిన సీసీ కెమెరాలను గ్రామంలోని ప్రధాన కూడళ్లు బస్‌స్టేషన్, గ్రామం ఎంట్రీ, ఎగ్జిట్‌లలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని సిద్దిపేట జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి నిషేధిత గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా నియంత్రించేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని,గ్రామాల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దనిసూచించారు. వారిని సక్రమమైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళలకు,బాలికలకు ఏమైనా ఇబ్బందులు తలేత్తితే డయల్ 100, షీటీమ్ ను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని,నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యత చాలా కీలకంగా మారుతుందని చెప్పారు. అనుమనాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని



అన్నారు. గ్రామంలోని సీసీ కెమెరాలను ఏర్పాటుకు సహకరించిన వైట్ ఫీల్ట్ బయో ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్వేస్ బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారిని అభినందించారు. ఈ సీసీ కెమెరా ఏర్పాటులో మండల, గ్రామాల్లో ప్రజలు, వ్యాపారులు, యువత సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సి ఐ శ్రీను, స్థానిక ఎస్ఐ , కోహెడ ఎస్సై అభిలాష్, గ్రామ సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య,ఉప సర్పంచ్ పెరుక బుచ్చయ్య, వార్డు సభ్యులు,సీనియర్ నాయకులు,మహిళలు పోలీస్ సిబ్బంది,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే తమ లక్ష్యం..

- దోసపల్లిలో మరోసారి "కళ్యాణ మస్తు" పథకం అమలు..

**మనూర్, మే 15 (జనంసాక్షి) :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే తమ లక్ష్యమని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మనూరు మండల పరిధిలోని దోసపల్లి గ్రామ సర్పంచ్ బిరాదర్ దత్తు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. గ్రామంలోని ప్రతి ఆడపడుచు పెళ్లికి "కళ్యాణ మస్తు" పేరుతో నగదు బహుమతి అందజేస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు శుక్రవారం రెండోసారి ఆ



పథకాన్ని అమలు చేసి తనమాట నిలబెట్టుకున్నారు. గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరైన సర్పంచ్ దత్తు, నూతన వధూవరులను ఆశీర్వదించి "కళ్యాణ మస్తు" పథకం కింద రూ.11,016 నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి ఆడపడుచుకు తమ కుటుంబ సభ్యుడిగా అండగా ఉంటానని తెలిపారు. గ్రామ ప్రజల సంక్షేమం కోసం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయడమే తన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. సర్పంచ్ చేపడుతున్న ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు అర్థం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న కూలీల వేతనాలు విడుదల చేయాలి



**నర్సాపూర్, మే 15 (జనం సాక్షి) :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నర్సాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంపీడీఓ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ పిఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య మాట్లాడుతూ కూలీల పొట్ట కొట్టే విబిజీ రాం జీ చట్టం రద్దు చేయాలన్నారు. పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలన్నారు. నర్సాపూర్ మండలంలో పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. వేతనాలు బకాయిలున్నాయని అన్నారు. టెంట్, ఓఆర్ఎస్, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

### పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పిస్తాం

నర్సాపూర్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో టెంట్, మంచి నీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణి చేయడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. బకాయి వేతనాలు చెల్లిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల శ్రీనివాస్, ఆంజనేయులు, యాదయ్య, పి శ్రీనివాస్, సుగుణ, రంగయ్య, యాదమ్మ, మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి

**మక్తల్, మే 15 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మక్తల్ నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి వందల కోట్ల నిధులు తీసుకువచ్చి, నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నామని రాష్ట్ర పాడి పశుసంవర్ధక క్రీడా డెయిరీ మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం నివాసంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో భాగంగా మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గం కు ఒక్క రోజు లోనే 68.50 కోట్ల రూపాయలతో 65 కిలోమీటర్ల మేర 19 రోడ్ల ను మంజూరు చేసుకున్నామని మంత్రి తెలిపారు. భూత్పూర్ నుంచి కాట్రేపల్లి వరకు 3.5కోట్లు, వనయకుంట, దాసర్ దొడ్డి లకు 5 కోట్లు, దండు నుంచి కేశవ నగర్ వరకు 2.5 కోట్లు, అడవి సత్యారం నుంచి పెగడబండ వరకు 4 కోట్లు, అయినాపూర్ నుంచి సుకూర్ లింగంపల్లి వరకు 4 కోట్లు, పెద్ద పొర్ల నుంచి చిన్న పొర్ల వరకు 4 కోట్లు, ఉట్కూరు మండలంలోని వల్లంపల్లి కి 4 కోట్లు, నాగిరెడ్డి పల్లి నుంచి ఉంద్యాల వరకు 3 కోట్లు, అమరచింత నుంచి మూలమళ్ల వరకు 2.5 కోట్లు, తిప్పడం పల్లి నుంచి అప్పరాల బ్రిడ్జి వరకు 2 కోట్లు, ముష్టిపల్లి నుంచి అనుగొండ వరకు 3 కోట్లు, సోమేశ్వర బండ నుంచి మల్లేపల్లి వరకు కోటి, అమ్మపల్లి నుంచి పర్మన్ దొడ్డి వరకు 3 కోట్లు, అడవి ఖానాపూర్ కు 3 కోట్లు, లంకాల నుంచి ఉంద్యాల వరకు 7 కోట్లు, ధర్మాపూర్ నుంచి చంద్రగడ్ వరకు 3 కోట్లు, రేచింతల నుంచి శాఖాపూర్ వరకు 4 కోట్లు, దమగ్నపూర్ మీదుగా చిత్తనూర్ వరకు 6 కోట్లు, కొత్తపల్లి నుంచి పెద్ద కడుమూర్ వరకు 4 కోట్లు... మొత్తం 19 రోడ్లు...68 కోట్ల 50 లక్షల రూపాయలతో మంజూరు చేసుకున్నామని, ఇది ఒక రికార్డు అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. దీంతో పాటు ఇప్పటికే ఆత్మకూరు గద్వాల మధ్య బ్రిడ్జి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, కొత్తగా కొల్పూర్ కొర్తికుండ వద్ద మినీ జూరాల డ్యామ్ కమ్ బ్రిడ్జి దాదాపు 800 కోట్లతో కర్నాటక తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టు గా అతి త్వరలో పట్టాలెక్కనుందని చెప్పారు. హిందూపూర్ వద్ద థర్మల్ పవర్ స్టేషన్ కు సైతం త్వరలో గ్రీన్ సిగ్నల్ రానుందని చెప్పారు. ఇక ఉమ్మడి రాష్ట్రంలో వెటర్నరీ ట్రేయినింగ్ సెంటర్ అనంతపురం లో ఉండేదని, తెలంగాణ లో లేకపోవడం తో సీఎం రేవంత్ రెడ్డి తో చర్చించి, మక్తల్ కు రాష్ట్ర స్థాయి వెటర్నరీ ట్రేయినింగ్ సెంటర్ ను గోలపల్లి శివారులో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మినీ స్టేడియం, డిగ్రీ కాలేజ్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు లకు సైతం శాశ్వత భవనాలు మంజూరు చేసుకున్నామని చెప్పారు. 20 కోట్లతో చిట్యాల వాగు బ్రిడ్జి పనులు ప్రారంభించామని, మంథన్ గోడ్, గోలపల్లి, శ్రీపురం బ్రిడ్జి లు కూడా పనులు ప్రారంభించామని అన్నారు. నారాయణపేట వరకు నాలుగు లైన్ల రోడ్డు కు త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నర్వకు నవోదయ స్కూల్ కోసం



ప్రయత్నిస్తున్నామని, 220 కేవీ సబ్ స్టేషన్ మక్తల్ కు దాదాపు మంజూరు చేసుకున్నామని, గోలపల్లి శివారులో భారీ స్థాయిలో గ్రౌండ్ ను ఏర్పాటు చేసుకుందామని మంత్రి అన్నారు. దసరాకి 150 పడకల ఆసుపత్రి అందుబాటులోకి రాబోతుందని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రెస్ మీట్ లో మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కో ఆప్షన్ మెంబర్ వల్లంపల్లి లక్ష్మణ్, కట్టా సురేష్ గుప్తా, రవికుమార్, గాయత్రి అనిల్, రాజప్ప గౌడ, చెన్నయ్య సాగర్, పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.



# వరి కొనుగోలుకు లారీల కొరత

- ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు
- ధాన్యం కళ్ళాల్లో పోసి 20 రోజులైనా ఇంకా ధాన్యం కొనుగోలు చేయట్లేదని ఆందోళన

**దస్తూరాబాద్, మే 15 (జనంసాక్షి):** మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రానికి సరిపడా లారీలు లేక శుక్రవారం రోడ్డు పైన బైటాయించిన రైతులు. ఇప్పటికే వరి కొనుగోలు కేంద్రాలలో ఇటీవల కురిసిన వర్షం కారణంగా ధాన్యం తడిసిపోయి రైతులకు తీవ్ర నష్టం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులు నష్టపోకుండా చూడాలని, మండల కేంద్రానికి లారీలు రాక ధాన్యం అలాగే కొనుగోలు కేంద్రాలలో తడిసి ముద్దవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గన్ని బ్యాగుల కొరత ఉందని, ఇప్పటికే 5 లారీల వరకు ధాన్యం తూకం వేశారని అయినా లారీలు సెంటర్ కి కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు. ఇప్పటికే రెండుసార్లు ధాన్యం తడిసాయని అధికారులు ఇంకెందుకు ఆలస్యం చేస్తున్నారని ఆవేదన చెందుతున్న రైతులు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని రైతుల కోరుతున్నారు.

# పుస్తక పఠనం ద్వారానే నిరంతర విజ్ఞానం సాధ్యం

- వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వైవి గణేష్



**వరంగల్ ప్రతినిధి, మే 15 (జనం సాక్షి) :** గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పాఠకులు పుస్తకం పఠనం ద్వారా నిరంతరం జ్ఞాన సముపార్జన చేసుకొవాలని వరంగల్ జిల్లా దినప కలెక్టర్ వైవి గణేష్ అన్నారు. శుక్రవారం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికల 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలలో బాగంగా జిల్లా కేంద్రం లోని గ్రంథాలయం లో గ్రంథాలయ దినోత్సవ కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ గణేష్ పాల్గొని విద్యార్థుల మద్దేశించి మాట్లాడుతూ గ్రంథాలయ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ తమ ప్రాంతాల్లోని గ్రంథాలయాలను నిరంతరం సందర్శిస్తూ పుస్తకాలు చదిని విజ్ఞాన పరిజ్ఞానాన్ని పెంపుదించుకోవాలని ఆయన కోరారు. ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్లకు అలవాటు పడి గ్రంథాలయాలు నిర్లక్ష్యం చేస్తున్నారు కానీ మన దేశ జాతీయ నాయకులు గాంధీ, అంబేద్కర్, స్వామివివేకానంద వంటి వారు కూడా గ్రంథాలయాల నుండే పుస్తకాలు చదివి మహానుభావులుగా ఎదిగారని కాబట్టి అట్టివారిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో మనం కూడా ఆదర్శవంతంగా ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రంగయ్యనాయుడు గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సందర్శించడానికి సమయము వెచ్చించి తద్వారా అన్ని రకాలైన పోటీ పరీక్షలకు సన్నద్ధమై ఉద్యోగ అవకాశాలను పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మండల విద్యాధికారి. వెంకటేశ్వరావు, మట్టెవాడ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, అరుణ, సిబ్బంది చిన్నబాబు, లిలిత, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

# కుబీర్ మండలంలో రోడ్డు ప్రమాదం

- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం



**కుబీర్, మే 15 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కుబీర్ మండలం పల్సి గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... రంజని తండాకు చెందిన విజయ్ కుమార్ మహారాష్ట్ర నుండి స్కూటీపై తండాకు వెళ్తున్నాడు. అదే సమయంలో పల్సి గ్రామానికి చెందిన ప్రవీణ్ బైక్ పై పల్సి నుండి సిర్పెల్లి వైపు వెళ్తున్నాడు. పల్సి పెట్రోల్ పంపు సమీపంలో ఈ రెండు వాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయ్ కుమార్‌ను మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడు. బైక్ పై ప్రయాణిస్తున్న ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు..

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి నిమ్మల మనోహర్




**ఎల్కతుర్తి (జనంసాక్షి) :** తెగించి కొట్లాడి తెచ్చుకున్నటువంటి తెలంగాణ రాష్ట్రంలో మా హక్కుల కోసం ఉద్యమాలు చేస్తున్నటు వంటి సందర్భంలో ఈరోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడి కార్యక్రమంలో ముందస్తుగా మండల నాయకుల నుండి మొదలుకొని రాష్ట్ర ఉద్యమ నాయకులు నాయకురానులను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని అరెస్టు వారంటీలతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ రెండు న ఉద్యమ న్నీ మరింత అభివృధి చేస్తామని అన్నారు ఉద్యమకారురుల డిమాండ్ ను ప్రభుత్వం పంట్టించుకోక పోతే నెలకు నాలుగు సార్లైన ఉద్యమాన్ని చేపట్టి ఉద్రక్తం చేస్తామని నిమ్మల మనోహర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

**చిట్యాల, మే 15(జనంసాక్షి) :** కుటుంబ సమస్యలు, భర్త బాధ్యతారాహిత్యం కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలోని గిద్ద ముత్తారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపి న వివరాల ప్రకారం... పోతుగంటి సునీత కుమార్తె మౌనిక (35) కు వరికోల్ పల్లి గ్రామానికి చెందిన దుద్దేటి శ్రీనివాస్‌తో గత 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు సంతా నం భర్త శ్రీనివాస్ ఏ పనీ చేయకుండా, బాధ్యత లేకుండా తిరుగుతూ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసేవాడు. ముగ్గురు ఆడపిల్లల భవిష్యత్తు ఏమవుతుందో అని తీవ్ర మనస్తాపం చెందిన మౌనిక, ఈ నెల 13న ఉదయం సుమారు గం 07:45 సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగిం ది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. అనంతరం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం సాయంత్రం గం 06:06 కు మౌనిక మృతి చెందింది. మృతు రాలి తల్లి సుచిత్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిట్యాల పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివ రాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# గిరి దర్శక్ పర్యాటక గైడ్‌లకు శిక్షణ

- మొబైల్ మ్యూజియం ప్రారంభించిన ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్...




**ములుగు బ్యూరో, మే15 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్న తెలంగాణ పర్యాటక శాఖ, ములుగు జిల్లాలో గిరి దర్శక్ పర్యాటక గైడ్‌లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. కర్రిగుట్టల ప్రాంతంలోని పర్యాటక కేంద్రాల్లో గైడ్‌లుగా సేవలందించేందుకు ఎంపికైన యువతకు ఈ శిక్షణ కార్యక్రమంను జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకాన్ ప్రారంబించారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లడుతూ ములుగు జిల్లాలో రామప్ప,మేడారం,లక్నవరం, మల్లూరు,బోగత జలపాతం లాంటి పర్యాటక చారిత్రక ప్రదేశాలను సందర్శించే పర్యాటకులకు వాటి ప్రాముఖ్యతను వివరించి రాష్ట్రంలో ములుగు జిల్లాను పర్యాటక రంగంలో ముందుంచడానికి గైడ్లు కృషి చేయాలని,పర్యాటకులకు సేవలను అందించి వారి మన్నలను పొందాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లాలో ఉన్న ప్రముఖ పర్యాటక స్థలాలు,వాటి చారిత్రక ప్రాధాన్యం, పర్యాటకులకు అందించాల్సిన సమాచారం, పర్యాటకుల పట్ల గైడ్‌లు అనుసరించాల్సిన విధానాలపై ఉమ్మడి జిల్లా పర్యాటక అధికారి శివాజీ,రామప్ప టూరిజం గైడ్ గోరంటల విజయ్ కుమార్ అవగాహన కల్పించారు.స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి అందాలను పర్యాటకులకు సమర్థంగా వివరించే విధంగా వారికి మార్గదర్శనం చేశారు.

**పర్యాటక సమాచార మొబైల్ మ్యూజియం అద్భుతం: ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్**

తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ మ్యూజియాన్ని ములుగు జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ములుగు ఎస్పీ కార్యలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ మొబైల్ మ్యూజియంలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన ఛాయాచిత్రాలు,ప్రత్యేక ఆకర్షణలు,పర్యాటక విశేషాలు ప్రదర్శనకు ఉంచగా ఎస్పి ప్రారంబించారు. ఈ సందర్బంగా ఎస్పి మ్యుజియం సందర్శించిన అనంతరం మాట్లాడుతూ మైబైల్ మ్యుజియం అద్భుతంగా ఉందని, రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సమచారం అద్భుతంగా ఉందని కోనియాడారు. పర్యాటకులకు అవసరమైన బ్రోచర్లు, సమాచార పుస్తకాలను కూడా అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం,పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ మొబైల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. శివాజీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మనన్ భట్,డిఎస్పీ రవీందర్,డిపిఆర్ఓ రఫీక్,డిటివో శివాజీ,గైడ్ విజయ్ కుమార్, టూరిస్ట్ పోలీస్లు అరుణ్, శ్రీకాంత్,టూరిజం సిబ్బంది అనంద్ పాల్గొన్నారు.

# చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే సహించం

- ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్
- రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్



**వరంగల్ ఈస్ట్, మే 15 (జనం సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో మామూనూర్ డివిజనల్ పోలీసుల ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం మామూనూర్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఈస్ట్ జోన్ డీసీపీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్బంగా డీసీపీ రౌడీ షీటర్ల ను హెచ్చరిస్తూ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు మరియు నేరప్రవర్తన కలిగిన వ్యక్తులు చట్టబద్ధంగా, సమాజానికి హాని కలగకుండా ప్రవర్తించాలని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, గొడవలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని, చట్టాలను గౌరవిస్తూ పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అనుమానాస్పద కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే పనులు, మద్యం, జూదం, అక్రమ వసూళ్లు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. తమ పరిసరాల్లో ఎటువంటి నేర సంఘటన జరిగినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాజంలో మంచిగా జీవిస్తూ ఉపాధి పొందేందుకు ప్రయత్నించాలని, ఫోన్ నంబర్, చిరునామా లేదా ఇతర వ్యక్తిగత వివరాల్లో మార్పులు వచ్చినప్పుడు వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకుని చట్టానికి లోబడి జీవిస్తే సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకో వచ్చని, లేకపోతే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని డీసీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మామూనూర్ ఏసీపీ వెంకటేష్, మామూనూర్, గీసుగొండ, ఏనుమాముల ఇన్స్ స్పెక్టర్లు శ్రీనివాస్ యాదవ్, విశ్వేశ్వర్, సురేష్ సంగేం ఎస్.ఐ వంశీ కృష్ణ పాల్గొన్నారు.



## జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నేరడిగొండ, మే 15 (జనంసాక్షి) :** జొన్న రైతులకు ప్రభుత్వం సరిపడ బారదాన్లను అందజేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మార్కుఫెడ్ వారి ఆధ్వర్యంలో పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జొన్న రైతుకు ఎమ్మెల్యే సన్మానించారు. కొనుగోలు కేంద్రాలకు సంచులు అందించాలన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం సరిపడ బార్దాన్లను అందజేయాలన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**నిర్మల్ రూరల్, మే15 (జనంసాక్షి) :** మామడ మండలం న్యూసాంగ్వి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ. 38 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పనకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదనపు గదుల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో పాఠశాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్,కొంద్ర రాజారెడ్డి,డీఈఓ భోజన్న, డిఇ గంగాధర్,ఏఈ ఆంజనేయులు,గ్రామ సర్పంచ్ అశ్విన్ రెడ్డి, మండల నాయకులు బాపురెడ్డి,గోవర్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం నిల్వ ప్రక్రియ సక్రమంగా చేపట్టాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, మే 15 (జనంసాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు త్వరితగతిన తరలించాలని, ధాన్యం దెబ్బతినకుండా నిల్వ ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం గోదామును దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని, సంబంధిత రైస్ మిల్లర్లు, అధికారులు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూర్చడం జరుగుతుందని, రైస్ మిల్లుల యజమానులు ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. అనంతరం జన్నారం మండలం మొర్రిగూడ, జన్నారం లలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం గోదామును మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి సందర్శించి గోదాము నిర్వాహకులు, అధికారులకు పలు సూచనలు చేశారు. జన్నారం మండలం పొనకల్ గ్రామంలో గల సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రస్తుతం వేసవి సెలవులు అయినందున వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పనులు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తదనంతరం లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో గల ధాన్యం గోదామును లక్షెట్టిపేట మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించారు. ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పుష్కర పనుల్లో నిర్లక్ష్యం

**కాళేశ్వరం, మే 16 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని కాళేశ్వరం లో మే 21 నుండి జరగబోవు సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న పనులలో అధికారుల నిర్లక్ష్యం అడుగడుగున కనపడుతోంది. సరస్వతి ఆది పుష్కరాల సందర్భంగా హడావుడిగా సరస్వతి ఘాట్ వద్ద మెట్ల నిర్మాణం చేపట్టి సైడ్లకు స్టీల్ రాడ్ లతో రైలింగ్ వేశారు. ప్రస్తుతం మరల మెట్లకు మరమత్తులు చేస్తూ ఆ స్టీల్ రైలింగులను పక్కన పడవేశారు. వాటిని తీసి భద్రపరిస్తే మరల ఉపయోగించుకునే అవకాశం ఉంది. అయితే పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలాంటివి జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# బండి భగీరథ్‌ను అరెస్టు చేయాలి

- పివైఎల్ కొత్తగూడ, గంగారం మండలాల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్ డిమాండ్
- మండల కేంద్రంలో ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన




**కొత్తగూడ, మే 15 (జనంసాక్షి) :** బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని పివైఎల్ (ప్రగతిశీల యువజన సంఘం) కొత్తగూడ, గంగారం మండలాల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో పివైఎల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ? ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కుమారుడు బండి భగీరథ్‌పై కేసు నమోదై వారం రోజులు గడుస్తున్నా, ఇంతవరకు పోలీసులు అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. పోక్సో చట్టం కింద నిందితుడైన భగీరథ్‌ను చట్టం ముందు హాజరుపరచాలని కోరారు. రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తుల పిల్లలకు ఒక న్యాయం, సామాన్యులకు ఒక న్యాయం ఉండటం సరికాదని ఆయన మండిపడ్డారు. చట్టం ముందు అందరూ సమానులేనని, నిందితుడిని వెంటనే శిక్షించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ మండల నాయకులు కాసర్ల నగేష్, గట్టి సతీష్, భూక్య పూర్ణచందర్, ఐలబోయిన నరేష్, పార్టీ నాయకులు పుల్లన్న, బుర్కా బుచ్చి రాములు, మంగన్న, గట్టి సురేందర్, గుగ్గిళ్ళ వెంకన్న, పసునూరి రాజమల్లు, గజ్జి సోమన్న, జాల్ల జక్కుల సమ్మన్న, గట్టి వెంకన్న, చల్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సీపీ సన్ ప్రీత్ సింగ్



**ఆత్మకూర్, మే 15 (జనం సాక్షి):** ఆత్మకూర్ మండలం నీరుకుళ్ళ గ్రామంలో ఎర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతున్న తీరును పోలీస్ కమిషనర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను పోలీస్ కమిషనర్ రైతులను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుకోవడంతో, ధాన్యం తరలించేందుకుగా అవసరమైన లారీలు అందుబాటు లేక చాలా ఇబ్బందులకు గురౌవుతున్నట్లు రైతులు పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుక పోవడంతో స్పందించిన సిపి లారీల సమస్యను జిల్లా కలెక్టర్,సంబంధిత అధికారుల దృష్టికి తీసుకపోవడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ రైతులకు బరోసానిచ్చారు. పోలీస్ కమిషనర్ వెంట ఆత్మకూర్ ఇన్స్ స్పెక్టర్ సంతోష్, ధాన్యం కొనుగోలు కేంద్రం అధికారులు వున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
16 మే 2026

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలి



భూదాన్ పోచంపల్లి, మే 15 (జనం సాక్షి) : మండలంలోని జూలూరు గ్రామ పరిధిలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తూకం విధానం, హమాలీల సేవలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. రైతులు ధాన్యం విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పీఏసీఎస్ జూలూరు ఆధ్వర్యంలో రైతులకు మజ్జిగ, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ,మండల వ్యవసాయ అధికారి శైలజ, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, ఆర్ఐ వెంకటరెడ్డి, సర్పంచ్ కాసుల అంజయ్య గౌడ్, జూలూరు పిఏసిఎస్ సీఈఓ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో చేతివాటం

- రైతుల రాస్తారోకో



**చిన్నశంకంపేట, మే 15 (జనం సాక్షి) :** కొనుగోలు కేంద్రాలలో చేతివాటం చూపిస్తున్నారని రైతులు శుక్రవారం మెదక్ చేగుంట రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. చిన్నశంకరంపేట మండలం గవ్వల పల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో 20 రోజుల కిందట వరి ధాన్యం తీసుకువచ్చామని, నిర్వాహకులు ధాన్యం కొనుగోలు చేతివాటం చూయిస్తూ, వెనకాల వచ్చిన వడ్లను అక్కడి నిర్వాహకులు కాంటా పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండ వేడిమి కి తట్టుకొని అక్కడే పడుకొని ఉంటే తమ ధాన్యం కాదని ఇతరుల ధాన్యం ఎలా పెడతారని రైతులు నిలదీశారు. సమాచారం అందుకున్న ఎస్సై శివానందం తన సిబ్బంది పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడి శాంతింప చేశారు.

## ధాన్యం దిగుమతిలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు



**మోత్కూర్, మే 15 (జనం సాక్షి) :** ధాన్యం దిగుమతి ప్రక్రియలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ కొర్రీలు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎంపీవో జనార్దన్ రెడ్డి హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మోత్కూర్ మండలంలోని ధనలక్ష్మి, శ్రీరామకృష్ణ పార్బాయిల్డ్ రైస్ మిల్లులను ఆయన సందర్శించి ధాన్యం సేకరణ, అన్‌లోడింగ్ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లుల యాజమాన్యాలతో సమావేశమైన ఆయన వివిధ ఐకేపీ కేంద్రాల నుంచి రోజువారీగా వచ్చే ధాన్యం లారీల సంఖ్య, అన్‌లోడింగ్ పరిస్థితి, హమాలీల అందుబాటు, ధాన్యం నిల్వ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే అన్‌లోడింగ్ చేయాలని స్పష్టం చేశారు. ధాన్యం లారీలను నిర్లక్ష్యంగా నిలిపివేయడం, అనవసర అభ్యంతరాలు చెప్పడం, రైతులను వేధించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని ఎంపీవో జనార్దన్ రెడ్డి హెచ్చరించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ధాన్యం నిల్వకు సరిపడా స్థలం, అవసరమైన వసతులు సిద్ధంగా ఉంచుకోవాలని ధనలక్ష్మి రైస్ మిల్ యజమాని శ్రీనివాస్‌కు, శ్రీరామకృష్ణ రైస్ మిల్ యజమాని వెంకటేశ్వర్లుకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం దిగుమతి ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా కొనసాగించాలని ఆయన అధికారులకు, మిల్లర్లకు సూచించారు.

## బండారుగుంపులో భూ వివాదం ఉద్రిక్తం

- కుర్సం రాజులు కుటుంబంపై దాడి చేశారంటూ ఆరోపణలు




**అశ్వరావుపేట, మే 15 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం తిరుమలకుంట పంచాయతీ పరిధిలోని తోగ్గుడెం గ్రామానికి చెందిన కుర్సం రాజులు కుటుంబంపై దాడి జరిగినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని బండారు గుంపు సమీపంలో ఉన్న 5 ఎకరాల భూమిని అక్రమంగా కబ్జా చేసుకునేందుకు పొట్ట పాపారావు, పొట్ట భీమరాజు, పొట్ట రాజశేఖర్, పొట్ట సతీష్, పొట్ట నాగలక్ష్మి, పొట్ట సిరమమ్మలు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో కుర్సం రాజులు, ఆయన పెద్ద కుమారుడు వీర్రాజు, అలాగే బైట గోపాలరావు, బైట దినేష్‌లపై కర్రలు, రాళ్లు, కత్తులతో దాడి చేశారని ఆరోపించారు. భూమిని స్వాధీనం చేసుకునేందుకు తమ కుటుంబ సభ్యులను హత్య చేయాలనే ఉద్దేశంతో దాడి చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# సూర్యాపేట పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**సూర్యాపేట, మే 15 (జనంసాక్షి) :** సూర్యాపేట పట్టణ అభివృద్ధిలో కౌన్సిలర్లు పార్టీలకు అతీతంగా భాగస్వాములు కావాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పిలుపునిచ్చారు.గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో సూర్యాపేట మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ కీర్తి లవన్ పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో భారీగా



చేరుతున్నారని అన్నారు.జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో సూర్యాపేట జిల్లా అభివృద్ధి, సంక్షేమంలో ముందు వరుసలో ఉందన్నారు.సూర్యాపేట నియోజకవర్గంలో అన్ని సమస్యలను ఇప్పటికే గుర్తించామని, వాటిని పరిష్కరించేందుకు జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఎంపీ రఘువీర్ రెడ్డిల సహకారంతో భారీ ఎత్తున నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం కౌన్సిలర్ కీర్తి లవన్ మాట్లాడుతూ వార్డు అభివృద్ధి కోసం అధికార పార్టీతో పాటు మున్సిపల్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సారథ్యంలో పనిచేసేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి. అంజద్ అలీ, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కౌన్సిలర్లు చిలుముల సునీల్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, గునగంటి హేమా సతీష్,నాయకులు పోలగాని బాలు గౌడ్, నిమ్మల వెంకన్న, బొప్పని శ్రీకాంత్,పార్టీలో చేరిన వారిలో నిమ్మల పురుషోత్తం, కోడి వినయ్, సతీష్, పృథ్వి, జలగం రాజు, షేక్ జావీద్, కృష్ణ, నాంపల్లి బాలు, అఖిల్, మోర అజయ్, సాయి, ఎండీ సాజిద్, కె.సందీప్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా భవనం ముందు ఉద్యమకారుల నిరసన

ఖమ్మం, మే 15 (జనం సాక్షి) : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ పిలుపుమేరకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమకారులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని వివిధ జిల్లాలో ఉన్న ఉద్యమకారులందరూ హైదరాబాద్ ప్రజా భవన్ ముందు నిరసన చేశారు .ప్రభుత్వం అన్ని జిల్లాల్లో తెలంగాణ ఉద్యమకారుల ను అక్రమ అరెస్ట్ లు చేసినా కూడా పెద్ద ఎత్తున ఉద్యమకారులు ప్రజా భవన్ దగ్గరికి వెళ్ళారు .ఈ క్రమంలో నిరసన చేస్తున్న ఉద్యమకారులను పోలీస్ అధికారులు ప్రజాపాలనలో వినతి పత్రాలను స్వీకరిస్తున్న (తీసుకుంటున్న) అధికారి చిన్నారెడ్డి దగ్గరకు తీసుకొని వెళ్లారు . ఆయన సీఎం ముఖ్య కార్యదర్శి అయిన శేషాద్రికి లెటర్ రాశారు. ఆ లెటర్ ను తీసుకొని ఉద్యమకారుల ప్రతినిధులను వెంటబెట్టుకుని పోలీసులు తమ వాహనంలో సెక్రటేరియట్ కి తీసుకెళ్లి ఆరవంతస్తులో ఉన్న సీఎం ముఖ్య కార్యదర్శి అయిన శేషాద్రి దగ్గరికి తీసుకెళ్లారు . ఆయన ఉద్యమకారులతో మాట్లాడి వారి ఆవేదనను విని ,ముఖ్యమంత్రి ఆదేశానుసారం చర్చలు జరిపారు . ఈ సమస్య ఆల్రెడీ సీఎం రేవంత్ రెడ్డి దృష్టిలో కూడా ఉందని ఒక వారం రోజులలో కమిటీని ఏర్పాటు చేసి నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె వి కృష్ణారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ జూన్ 2 లోపల స్పష్టమైన ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య , బచ్చల పద్మాచారి , కేలోత్ రవిచంద్ర చౌహాన్ , మొతుకురి వెంకటాచారి , గాజుల రవి కుమార్ , ఉపేందర్ , రెడ్డబోయిన వరలక్ష్మి , కామని అనంతలక్ష్మి , నల్లా స్వరూప , ధనలక్ష్మీ, కమలమ్మ, ఆకారపు కృష్ణవేణి పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఇద్దరు యువకులు అరెస్ట్

**ఉర్కొండ, మే 15 (జనం సాక్షి) :** గంజాయి కేసులో ఇద్దరు యువకులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 12 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్ కు పంపించినట్లు ఎస్సై కృష్ణదేవ తెలియజేశారు. ఎస్సై కృష్ణదేవ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుండ్ల గుంటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సూర్య లత కాటన్ మిల్లులో గంజాయి అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో తనిఖీలు నిర్వహించామని మిల్లులో పనిచేసే మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన ప్రదీప్ ,సూరజ్ అనే కార్మికులు గంజాయి తీసుకుంటున్నారని అనుమానంతో క్లూస్ టీం తో పరీక్షలు నిర్వహించగా గంజాయి తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. వారు ఉంటున్న గదిలో సిబ్బందితో వెతకగా 13 గ్రాముల గంజాయి లభించింది.వెంటనే ఆ యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపించినట్లు ఎస్ఐ కృష్ణ దేవ తెలియజేశారు.

## ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



**ఉర్కొండ, మే 15 (జనం సాక్షి) :** అన్నదాతలు ఆరుకాలం కష్టం చేసి పండించిన పంటను కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని మండలంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి అన్నారు. సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే రైతులకు సంచులను అందించి మొక్కజొన్నను కొనుగోలు చేయాలనీ,ప్రతి మండలానికి రెండు కొత్త కొనుగోలు సబ్ సెంటర్ లను ఆమోదించి కొనుగోలు ప్రారంభించాలనీ,స్థానిక గోదాంల దగ్గర ఎక్కడైనా తడిచిన ఉన్న మొక్కజొన్నని ప్రభుత్వమే కొనుగోలు చేయాలనీ, కొనుగోలు కేంద్రల వద్ద అక్కడక్కడా జరుగుతున్న అవినీతిని వెంటనే ఆపాలి, అవినీతికి పాల్పడుతున్నటువంటి వారి పట్ల తగు చర్యలు కూడా తీసుకోవాలి.రైతుల దగ్గర ఉన్నటువంటి పూర్తి ధాన్యాన్ని ఎప్పటిలోపుకుంటారో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలి.ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.రోజులు గడుస్తున్నా మొక్కజొన్న పంట సంచులు లేక పంట పొలాల్లో, రోడ్డుపై, ఉంచి రైతులు పడిగాపులు ఉంటున్నారు. రైతన్నలు ఎవరు కూడా దళారుల చేతిలో మోసపోకండి.కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న మద్దతు ధర 2400 నిర్ణయించారని దళారులు, వ్యాపారులు కేవలము క్వింటాలకు 1800 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు దయచేసి రైతులు మార్కెఫెడ్ ద్వారా అమ్మలని ముచ్చర్ల జనార్దన్ రెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి కొనే ధాన్యం క్వింటాలకు 15 కిలోలు తరుగు తీసుకుంటున్నారని ఇది చాలా అన్యాయం అని ఈ సందర్భంగా తెలియజేశారు. అకాల వర్షాలు వస్తున్న కారణంగా రైతుల వద్ద నుండి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని లేకుంటే రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి తెలియజేశారు .ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, మాజీ అధ్యక్షుడు అంజనేయులు, రేపానీ శ్రీనివాసులు, సందీప్ కుమార్, బండి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.ఖ

## సికింద్రాబాద్‌లో ఘనంగా రైల్వే ఫిజిషియన్ల 21వ వార్షిక సదస్సు

**సికింద్రాబాద్, మే 15 (జనంసాక్షి) :** దక్షిణ మధ్య రైల్వే మెట్టుగూడ కేంద్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో రైల్వే ఫిజిషియన్ల 21వ వార్షిక సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఐఆర్ఐఎఫ్ఎమ్ లో జరుగుతున్న ఈ సదస్సులో భారతీయ రైల్వేలు, ఇతర ప్రముఖ ఆరోగ్య సంరక్షణ సంస్థల నుంచి సుమారు 250 మంది వైద్య నిపుణులు పాల్గొన్నారు."ఆవిష్కరణ నుండి ఆధారిత క్లినికల్ అన్వయానికి – ఖచ్చితత్వం, సాంకేతిక సహాయక సంరక్షణలో పరిణామ దృక్కోణాలు" అనే ఇతివృత్తంతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. సదస్సుకు డైరెక్టర్ జనరల్ ఆర్‌హెచ్ఎస్ డాక్టర్ జగదీష్ చంద్ర, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారాం హాజరయ్యారు. దేశ వ్యాప్తంగా ఉన్న రైల్వే ఆసుపత్రులు, ఆరోగ్య సంస్థలకు చెందిన సీనియర్ వైద్య నిపుణులు, లాలాగూడ కేంద్ర ఆసుపత్రి వైద్యులు కూడా



పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ చంద్ర మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పురోగతులను వైద్య సేవలతో అనుసంధానించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ నిర్మలా రాజారామ్ మాట్లాడుతూ ఈ సమావేశం వైద్య నైపుణ్యాల పెంపు, వినూత్న వైద్య విధానాల అవగాహన, వృత్తి పరమైన బంధాల బలోపేతానికి వేదికగా నిలుస్తుందని తెలిపారు. సదస్సు రెండో రోజు ఎండోక్రినాలజీ, నెఫ్రాలజీ, పల్మనాలజీ తదితర అంశాలపై సమావేశాలు జరగనున్నాయి.

## తప్పుడు వార్తలతో రైతుల్లో ఆందోళన సృష్టించవద్దు

- రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు..
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం, మే 15 (జనం సాక్షి) : ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. వివిధ దినపత్రికల్లో మే 15న శుక్రవారం రోజున మొక్కజొన్న కొనుగోలు, లిఫ్టింగ్‌లో జాప్యం జరుగుతోందంటూ ప్రచురితమైన వార్తలు అసంపూర్ణ సమాచారం ఆధారంగా ప్రచురించబడినవని జిల్లా కలెక్టర్ రిజాయిండర్ జారీ చేశారు.జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా యంత్రాంగం, టీజీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సజావుగా కొనసాగుతోందని తెలిపారు.యాసంగి సీజన్ 2025–26లో భారీ స్థాయిలో దిగుబడులు రావడంతో కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద లోడెడ్ వాహనాల కదలికలో తాత్కాలిక ఒత్తిడి ఏర్పడిందన్నారు.

అధిక స్టాక్ నిల్వలు, పరిమిత అన్‌లోడింగ్ స్థలాల కారణంగా కొంత ఆలస్యం చోటుచేసుకున్నప్పటికీ, సమస్య పరిష్కారానికి యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో చర్యలు తీసుకుంటోందన్నారు.జిల్లాలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు జరిగిందని, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో కొనుగోళ్లు జరగలేదని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదనపు రవాణా వాహనాలు ఏర్పాటు చేయడం, ప్రత్యామ్నాయ గోదాములు, నిల్వ కేంద్రాలు సిద్ధం చేయడం జరుగుతోందన్నారు.కొనుగోలు కేంద్రాల పనితీరును జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో మొక్కజొన్న, వరి పంట పండించిన రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1077 ను ఏర్పాటు చేశామని, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యం, మొక్కజొన్న పంటకు ఎవరైనా కోతలు విధించిన లేక ఏ ఇతర సమస్య ఉన్న వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.రైతులు అసత్య, అసంపూర్ణ వార్తలను నమ్మవద్దని, ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని ఆ రిజాయిండర్ లో స్పష్టం చేశారు.

## నలుగురు హంతకులకు జీవితఖైదు

**హుజూర్‌నగర్, మే 15 (జనంసాక్షి) :** ఒక వ్యక్తిని నమ్మించి దారుణంగా హత్య చేసిన నలుగురు హంతకులకు హుజూర్ నగర్ రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ పి శివ రామ్ ప్రసాద్ జీవిత ఖైదు విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే మేళ్లచెరువు మండలం రామాపురం గ్రామానికి చెందిన చార్ల వెంకటేశ్వర్లు ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అతని సామాజిక వర్గానికి చెందిన ఒక అవివాహిత యువతితో ప్రేమాయణం కొనసాగిస్తున్నాడు. అంతకు మునుపు అదే గ్రామానికి చెందిన రెడపంగు కోటేశ్వరరావు అనే యువకుడు సదరు యువతితో ప్రేమలో పడి ఆమెను వివాహం చేసుకోవడానికి నిర్ణయించుకున్నాడు. తదుపరి అతను కంప్యూటర్ శిక్షణ కొరకు హైదరాబాద్ కు వెళ్ళగా సదరు యువతి చార్ల వెంకటేశ్వర్లు కు దగ్గరై అతనితో సన్నిహితంగా ఉండటం ప్రారంభించింది. ఇట్టి విషయాన్ని తన మిత్రులైన అదే గ్రామానికి చెందిన రెడపంగు శ్రీహరి, పెరిమి మహేష్, కొత్తపల్లి నాగ సైదులు ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న కోటేశ్వరరావు గ్రామానికి చేరుకుని తన మిత్రులతో సంప్రదించి ఎలాగైనా వెంకటేశ్వర్లు ను హత్య చేయడానికి తనతో సహకరించమని కోరగా అందుకు వారు అంగీకరించారు. హత్య చేయడానికి నలుగురు కలిసి పథకం రూపొందించి 2016 ఏప్రిల్ 15 వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో చార్ల వెంకటేశ్వర్లు తన ఇంటి వద్ద ఉండగా రెడపంగు శ్రీహరి అతనికి ఫోన్ చేసి రామాపురం నుండి మేళ్లచెరువు వెళ్లి ఫ్రిజ్ తీసుకు రావడానికి ఆటో కిరాయికి కావాలని అడగగా అందుకు వెంకటేశ్వర్లు అంగీకరించి ఆటోను కిరాయికి తీసుకు వెళ్ళినాడు. చార్ల వెంకటేశ్వర్లు ఆటో లో రెడపంగు శ్రీహరి రామాపురం నుండి మేళ్లచెరువు కు వెళ్లారు. హంతకులు నలుగురు పన్నిన పన్నాగం లో భాగంగా కూల్ డ్రింక్ లో మత్తుమందు కలిపి వెంకటేశ్వర్లు కు తాపించి అతను మత్తులోకి జారుకున్న తర్వాత హత్య చేయాలనే నిర్ణయంతో ముందస్తుగానే శ్రీహరి మత్తు మాత్రలు కలిపిన కూల్ డ్రింక్ తన వద్ద ఉంచుకొని మేళ్లచెరువు కు బయలుదేరారు. అట్టి ఆటో ను రెడపంగు కోటేశ్వరరావు, పెరిమి మహేష్, కొత్తపల్లి నాగ సైదులు మోటార్ సైకిల్ పై వెంబడించినారు. మేళ్లచెరువు లో శ్రీహరి బీరు త్రాగగా రెడపంగు వెంకటేశ్వర్లకు మత్తుమందు కలిపిన కూల్ డ్రింక్ ను తాగిపించినాడు. తిరిగి రామాపురం వస్తుండగా మార్గమధ్యంలో రేవూరు గ్రామ శివారులో నిర్మానుష్య ప్రదేశంలో తనకు వాంతి వస్తున్నదనే నెపంతో శ్రీహరి ఆటోని ఆపమని కోరగా వెంకటేశ్వర్లు రోడ్డు పక్కన ఆటోను నిలిపేసినాడు. ఇదే అదునుగా భావించిన రెడపంగు కోటేశ్వరరావు, పెరిమి మహేష్, కొత్తపల్లి నాగ సైదులు ఆటో వద్దకు వచ్చి మత్తులో ఉన్న వెంకటేశ్వర్ల ను బలవంతంగా ఎన్నెస్పీ కాల్వ వద్దకు తీసుకువెళ్లి రాళ్లతో అతని మర్మాంగాలపై మరియు శరీరంలో ఇతర భాగాలపై తీవ్రంగా కొట్టి, కోటేశ్వరరావు తనతో తెచ్చుకున్న తాడును మెడ చుట్టూ బిగించి అందరూ కలిసి హత్య చేశారు. తదనంతరం ఆటోలో శవాన్ని తీసుకొని వెళ్లి భీమా సిమెంట్ క్వారీ వద్ద ఆటోను వదిలేసి క్వారీలో శవాన్ని పడేసి వెళ్ళిపోయినారు. వెంకటేశ్వర్లు తండ్రి లక్ష్మీపతి తన కుమారుడు ఎంతకు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫోన్లో సంప్రదించగా అరగంటలో ఇంటికి వస్తానని మొదటిగా చెప్పిన వెంకటేశ్వర్లు తర్వాత తన సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో రాత్రి కావడంతో ఎటువంటి ఫిర్యాదు చేయకుండా ఉండిపోయాడు. మరుసటి రోజు ఉదయం రేవూరు గ్రామానికి చెందిన రైతులు తమ పొలాలకు వెళుతూ భీమా సిమెంట్ ఫ్యాక్టరీ క్వారీ వద్ద ఒక ఆటో ఉన్నదని దాని పక్కన ఒక యువకుడి శవం పడి ఉన్నదని పలువురికి చెప్పగా ఆ విషయం తెలుసుకున్న లక్ష్మీపతి నేర స్థలానికి వెళ్లి శవం తన కుమారుడిదేనని నిర్ధారించుకొని మేళ్లచెరువు పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేసినాడు. అట్టి ఫిర్యాదును అనుసరించి అప్పటి హెడ్ కానిస్టేబుల్ సైదా అనుమానస్పద కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు. పోలీసుల విచారణలో రెడపంగు కోటేశ్వరరావు, రెడపంగు శ్రీహరి, పెరిమి మహేష్, కొత్తపల్లి నాగ సైదులు హత్యకు పాల్పడినట్లుగా నిర్ధారణ కావడంతో ఆ నలుగురిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసి అప్పటి కోదాడ రూరల్ సీఐ రవి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసినారు. సాక్షుల సుదీర్ఘ విచారణ అనంతరం నలుగురు నిందితులపై నేరం నిరూపణ కావడంతో హుజూర్ నగర్ రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ పి శివ రామ ప్రసాద్ హంతకులు నలుగురికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. అలాగే నిందితులు ఒక్కొక్కరు వెయ్యి రూపాయలను జరిమానా గా చెల్లించాలని జరిమానా చెల్లించని పక్షంలో 15 రోజుల సాధారణ జైలు అనుభవించాలని న్యాయమూర్తి శివ రామ్ ప్రసాద్ తన తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బొబ్బకోటిరెడ్డి వాదించగా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో లైజన్ ఆఫీసర్లు ఆరుట్ల వెంకన్న, శ్రీకాంత్ క్లాసిక్యూషన్ కు సహకరించారు.




# ఎగుమతిదారులకు షాక్

న్యూఢిల్లీ, మే 14: దేశంలోకి వచ్చే బంగారం, వెండి దిగుమతులపై బుధవారం సుంకాలను భారీగా పెంచిన మోదీ సర్కార్.. గురువారం దిగుమతులపైనా పరిమితుల్ని తీసుకొచ్చింది. అడ్వాన్స్ ఆథరైజేషన్ స్కీమ్ కింద పసిడి దిగుమతులు 100 కిలోలు మించరాదని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్టీ) ఓ బహిరంగ ప్రకటనలో తెలిపింది. ఈ పథకంలో జ్యుయెల్లరీ ఎగుమతిదారులు నగల తయారీకి అవసరమైన ముడి సరుకుగా బంగారాన్ని ఎటువంటి సుంకం లేకుండా దిగుమతి చేసుకోవచ్చు. అయితే ఇంతకుముందు ఎంతైనా దిగుమతి చేసుకొనే వీలుండేది. కానీ ఇకపై ఒక లైసెన్స్‌కు 100 కిలోలకు మించి ఒకేసారి దిగుమతి చేసుకోరాదు. అలాగే సదరు లైసెన్స్ కలిగిన ఎగుమతిదారు మళ్లీ పుత్తడిని దిగుమతి చేసుకోవాలంటే అంతకుముందు దిగుమతైన బంగారంలో కనీసం 50 శాతాన్ని (గరిష్ఠంగా 50 కిలోలు) ఎగుమతి చేసైనా లేదా ఎగుమతికి సిద్ధం చేసైనా ఉండాలన్న నిబంధనను డీజీఎఫ్టీ ఇప్పుడు పెట్టింది.ఇక కొత్తగా బంగారాన్ని దిగుమతి చేసుకోవాలనుకునే జ్యుయెల్లర్ ఎగుమతిదారు.. సంబంధిత అధికారులకు వారి నగల తయారీ కేంద్రాన్ని చూపించాల్సి ఉంటుందని, అన్నీ పరిశీలించిన తర్వాతనే నిబంధనలకు లోబడి లైసెన్స్‌ను మంజూరు చేస్తామని డీజీఎఫ్టీ ఈ సందర్భంగా పేర్కొన్నది. కాగా, ఎగుమతయ్యే ఉత్పత్తి తయారీలో వినియోగించే ఉత్ప్రేరకాలు, ప్యాకేజింగ్ సామగ్రి, ఇంధనం, చమురు వంటి దిగుమతులనూ ఈ స్కీమ్‌లోనే అనుమతిస్తారు. ఇక నగల ఎగుమతిదారులు 15 రోజులకోసారి తమ ఉత్పాదక కార్యకలాపాల నివేదికను తయారు చేయాల్సి ఉంటుంది. ఇందులోని పసిడి దిగుమతి, ఎగుమతుల వివరాలను స్వతంత్ర చార్టెడ్ అకౌంటెంట్ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఈ వివరాలన్నింటినీ నెలకోసారి సంబంధిత అధికారులు డీజీఎఫ్టీకి సమర్పించాల్సి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

1.66 లక్షలకు పుత్తడి


బంగారం ధరలు మరింత పెరిగాయి. న్యూఢిల్లీలో పదిగ్రాముల పుత్తడి రూ.1.66 లక్షలకు చేరుకున్నది. రూపా యి పతనం చెందడం, అంతర్జాతీయంగా రాజకీయ అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో అతి విలువైన లోహాలు ఎగువముఖం పడుతున్నాయి. దీంట్లోభాగంగా 99.9 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.650 అందుకొని రూ.1,66,000కి చేరుకున్నట్టు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది.



# ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి..

## నష్టాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడం, డాలరుతో రూపాయి మారకం విలువ తొలిసారి 96 మార్కును దాటడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో రెండ్రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 75,497.10 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,398.72) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,870.36 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. చివరికి 160.73 పాయింట్ల నష్టంతో 75,237.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46.10 పాయింట్ల నష్టంతో 23,643.50 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో 96.15 వద్ద కనిష్ఠాన్ని తాకి 95.94కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఎటర్నల్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్‌బీఐ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,560 వద్ద ట్రేడవుతోంది. భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. రూపాయి విలువ అత్యంత కనిష్టానికి పతనమవడం, క్రూడాయిల్ ధరలు పెరగడం మార్కెట్లపై దుష్ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ



సెన్సెక్స్ 160.73 పాయింట్లు (0.21 శాతం) నష్టపోయి 75,237.99 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 కూడా 46.10 పాయింట్లు (0.19 శాతం) నష్టపోయి 23,643.50 వద్ద ముగిసింది.రూపాయి విలువ తగ్గడం, చమురు ధరలు పెరుగుదల, ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయం వంటివి ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగడం, హోర్ముజ్ జలసంధి పూర్తి స్థాయిలో తెరుచుకోకపోవడం వంటివి కూడా ఇందుకు కారణాలు. ఈ కారణాలతో చమురు ధరలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర 109 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మరోవైపు భారతీయ రూపాయి అత్యంత కనిష్ట స్థాయికి చేరింది. డాలర్‌తో రూపాయి విలువ 96.05 వద్ద ట్రేడవుతోంది. అంతకుముందు ఇది 95.9575 వద్ద కొనసాగింది. రూపాయి అత్యంత తక్కువ స్థాయికి చేరుకోవడం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది.రూపాయి ఇంత తక్కువ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. ఈ రోజు 0.3 శాతం తగ్గింది. చమరు ధరల పెరుగుదల, విదేశీ ద్రవ్యం అధికం కావడం, పశ్చిమాసియాలో అస్థిరత వంటివి రూపాయి పతనానికి కారణాలు. ఇండియా చమురు దిగుమతులపైనే ఎక్కువగా ఆధారప డుతున్న సంగతి తెలిసిందే. అలాగే, అమెరికా వడ్డీ రేట్లు, మారక నిల్వలు తగ్గడం కారణాలుగా చెప్పుకోవచ్చు.

# నాట్కో ఫార్మాకు నోటీసులు

న్యూఢిల్లీ, మే 14: రెండు ఔషధాలకు అధిక ధర వసూలు చేశారని ఆరోపణలపై నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ)..నాట్కో ఫార్మాకు రూ.4.92 కోట్ల డిమాండ్ నోటీసును జారీ చేసింది. డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ 2013 ప్రకారం జరిమానాతోపాటు వడ్డీ కలుపుకొని నాట్కో ఫార్మా రూ.4,92,25,923 డిపాజిట్ చేయాలని ఎన్‌పీపీఏ ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఏప్రిల్ 2023 నుంచి నవంబర్ 2023లోపు ఈ రెండు ఔషధాలను సంస్థ అధిక ధరకు విక్రయించినట్టు వచ్చిన ఆరోపణలపై ఎన్‌పీపీఏ విచారణ జరిపించింది.

# ఎయిర్‌టెల్ 56 ఎడ్జ్ డాటా సెంటర్లు

**న్యూఢిల్లీ:**దేశీయ టెలికాం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్..దేశవ్యాప్తంగా ఎడ్జ్ డాటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. న్యూఢిల్లీ, మే 14: దేశీయ టెలికాం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్..దేశవ్యాప్తంగా ఎడ్జ్ డాటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. వచ్చే రెండేండ్లకాలంలో దేశవ్యాప్తంగా 56 ఎడ్జ్ డాటా సెంటర్లను నెలకొల్పబోతున్నట్టు భారతీ ఎయిర్‌టెల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గోపాల్ విఠల్ తెలిపారు. కంపెనీ వ్యాపారాన్ని శరవేగంగా విస్తరించాలనే ఉద్దేశంతో ఈ సెంటర్లు నెలకొల్పాలని నిర్ణయించారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,48,800 | ₹ 1,62,330 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 3,15,000

# చైనీస్ అమ్మాయి వైపు మస్క్ చూపు..

## వైరల్ అవుతున్న వీడియో

బీజింగ్ : అమెరికా వ్యాపారవేత్త ఎలన్ మస్క్ ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్నారు. దేశాధ్యక్షుడు ట్రంప్‌తో వెళ్లిన బృందంలో ఆయన ఉన్న విషయం తెలిసిందే. అయితే అతిథులకు ఆర్గనైజ్ చేసిన విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇక ఆ సమయంలో మస్క్ ఓ సెలబ్రిటీ అయిపోయారు. ఆయనతో ఫోటో దిగేందుకు చైనీయులు ఎగబడ్డారు. కొందరు సెల్ఫీలు తీసుకున్నారు. ఇక అక్కడ సర్వ్ చేస్తున్న మహిళా సిబ్బంది కూడా మస్క్‌తో ఫోటో కోసం ప్రయత్నం చేశారు. అయితే మస్క్ తన ఎక్స్ అకౌంట్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. ఆ వీడియోను పోస్టు చేసిన గంటల్లోనే దాన్ని 82 లక్షలకు మందికిపైగా చూశారు. ఇంకా ఆ వీడియోకు వ్యూస్ వస్తూనే ఉన్నాయి.ఓ టేబుల్ వద్ద కూర్చున్న మస్క్ కోసం చైనా సంపన్నులు కూడా



ఆసక్తి చూపారు. అయితే మస్క్ ఆ సందర్భాన్ని ఫుల్ ఎంజాయ్ చేశారు. అటూ ఇటూ చూస్తూ తనతో ఫోటో దిగే వారికి స్మైల్ ఇచ్చారు. కొందరు కుడి వైపు నుంచి, కొందరు ఎడమవైపు నుంచి వచ్చి మస్క్‌తో సెల్ఫీలు దిగారు. ఓ సందర్భంలో టిక్ కుక్ కూడా వచ్చి మస్క్‌తో కలిసి ఫోజు ఇచ్చారు. అయితే ఆ సమయంలో ఓ చైనీస్ అమ్మాయి.. మస్క్ టేబుల్ వద్దకు వచ్చింది. ఇక మస్క్ ఆ అమ్మాయిని చూడాలా వద్దా అన్న రీతిలో తన లుక్స్‌ను ప్రజెంట్ చేశారు. అక్కడ చోటుచేసుకున్న పరిణామాలను ఫన్నీ రూపంలో ఆయన తన వీడియోలో పోస్టు చేశారు. రకరకాల ఎమోషన్స్ తన ఫేస్‌లో చూపించారు. చైనాలో మస్క్ ఓ పాపులర్ ఫిగర్. ఆయనకు సెలబ్రిటీ స్టేటస్ ఉంది. మస్క్ కంపెనీ టెస్లా కార్లకు అక్కడ ఆదరణ బాగా ఉంది. ఆయన్ను ఓ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ తరహాలో కాకుండా పాప్ కల్చర్ ఐకాన్ తరహాలో చూస్తున్నారు. మస్క్ బాడీ లాంగ్వేజ్ చాలా ఫ్రెండ్లీగా ఉన్నట్లు కొందరన్నారు.

# ముందుంది.. మహా సంక్షోభం

- ఆర్థిక మాంద్యంలోకి కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు
- ప్రజలందరూ అన్నింటికీ సిద్ధంగా ఉండాలి
- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై దేశ ప్రజలకు సింగపూర్ ప్రధాని లారెన్స్ హెచ్చరిక



హైదరాబాద్:రెండున్నర నెలలు గడిచినప్పటికీ పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం లేదు. హ్పార్ముజ్ జలసంధిపై నెలకొన్న ప్రతిష్ఠంభనతో యావత్తు ప్రపంచ దేశాలకు చమురు కష్టాలు పెరుగుతున్నాయి. అమెరికా–ఇరాన్ యుద్ధం ఇప్పట్లో ముగిసేట్టు కనిపించకపోవడంతో భవిష్యత్తులో పరిస్థితులు మరింతగా దిగజారనున్నట్టు ఇప్పటికే పలువురు ఆర్థిక నిపుణులు, పారిశ్రామికవేత్తలు హెచ్చరించారు. ఇప్పుడు ఈ జాబితాలో సింపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ కూడా చేరారు. ఇటీవల జాతినుద్దేశించి ఆయన చేసిన ప్రసంగంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు, తదనంతర పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. హ్పార్ముజ్ సంక్షోభం ఇప్పట్లో పరిష్కారమయ్యే సూచన ఎంతమాత్రం కనిపించట్లేదని వాంగ్ అన్నారు. దీని కారణంగా కొన్ని దేశాలు ఆర్థిక మాంద్యంలోకి వెళ్లిపోయే ప్రమాదమున్నదని హెచ్చరించారు. ఆ ప్రభావం సింగపూర్ మీద కూడా పడబోతున్నదని చెప్పారు. ఇంధనమే కాకుండా ఆహారం, ఎరువుల ధరలు కూడా ఆకాశాన్నంటే ప్రమాదమున్నదని పేర్కొన్నారు. ఇప్పటికిప్పుడు హ్పార్ముజ్ జలసంధిని తెరిచినప్పటికీ, పరిస్థితులు సానుకూలంగా మారే అవకాశం లేదని తేల్చి చెప్పారు. నెలలపాటు ఆర్థిక సంక్షోభం కొనసాగొచ్చని అంచనా వేశారు.

**వచ్చేవి దారుణ పరిస్థితులే**

పశ్చిమాసియా ఉద్రిక్తతలపై కొటక్ మహీంద్రా బ్యాంకు వ్యవస్థాపకుడు ఉదయ్ కొటక్ ఇటీవల స్పందిస్తూ.. రాబోయే రోజుల్లో ఎదురయ్యే దారుణ పరిస్థితులకు భారతీయులు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్ వాహనాలు నేరుగా వాడని వారికి కూడా నిత్యావసరాల రూపంలో గల్ఫ్ దెబ్బ పడుతుందని అన్నారు. వేతనాలు పెరిగే అవకాశం లేని కుటుంబాలకు ఇది పెద్ద షాక్ కానుందని చెప్పారు. ఇక, అమెరికా–ఇరాన్ యుద్ధం కేవలం విదేశాంగ శాఖ సమస్య కాదని, భారత్ చెల్లింపుల సామర్థ్యానికి అగ్నిపరీక్ష అని భారత ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ అన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచ దేశాలకు ఇబ్బందులు తప్పవని, ఆర్థిక వృద్ధికి విఘాతంగా మారనున్నదని ప్రపంచ బ్యాంకు ప్రెసిడెంట్ అజయ్ బంగా హెచ్చరించారు.తెలంగాణ వార్తలు

# క్యూబాలో బ్లాక్ అవుట్..

## పూర్తిగా అడుగంటిన పెట్రోల్, డీజిల్ నిల్వలు

## రాజధాని హవానాలో పెద్దఎత్తున నిరసనలు

హవానా: అమెరికా విధించిన ఆంక్షల ధాటికి.. క్యూబా తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయింది. దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పూర్తిగా అడుగంటాయి. దేశ రాజధాని హవానా సహా అన్నిచోట్లా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రభుత్వం దేశమంతా బ్లాక్ అవుట్ విధించింది. దీంతో వందలాది మంది పౌరులు రోడ్లమీదకు రాగా, బుధవారం హవానాలో పెద్ద ఎత్తున నిరసనలు చోటుచేసుకున్నాయి.నిరసనకారులు రోడ్లను దిగ్బంధించి, టైర్లను కాల్చుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హవానాలో రోజుకు 20 నుంచి 22 గంటలపాటు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. అమెరికా ఆంక్షల వల్లే దేశంలో ఈ పరిస్థితి తలెత్తిందని ఇంధన మంత్రి విసెంటీ లివీ అన్నారు.



# పినరయ్ విజయన్‌తో కేరళ కాబోయే సీఎం భేటి

వెలువడిన కొన్ని గంటల వ్యవధిలోనే తిరువనంతపురంలో కాంగ్రెస్ శాసనసభాపక్షం సతీశన్‌ను తమ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానం ఆమోదించింది. అనంతరం గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌ను కలిసి మద్దతిస్తున్న ఎమ్మెల్యేల జాబితాను సతీశన్, సీనియర్ నేతలు సమర్పించారు. ఈనెల 18న కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే అవకాశం ఉంది. పినరయి విజయన్ ప్రతిపక్ష నాయకుడి స్థానంలో ఉండనున్నారు. ఇదీ చదవండి: వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్: ధర్మేంద్ర ప్రధాన్

# పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచంపై పెనుప్రభావం

ప్రభావం ప్రపంచం మొత్తంమీద ఉందని చెప్పారు. హర్మూజ్ విషయంలో అంతా అంత ర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలన్నారు. యూఏఈ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ సమక్షంలో భారత్ పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఎల్‌పీజీ సరఫరా, పెట్రోలియం నిల్వలపై ఎంవోయూ కుదుర్చుకుంది. అంతేకాకుండా వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం, నౌకల మరమ్మతు కేంద్రం ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించిన ఎంవోయూలపై భారత అధికారులు సంతకాలు చేశారు.



# అమెరికన్లను నమ్మలేం..


అర్థవంతమైన ప్రతిపాదనతో వస్తే మద్దతు తెలుపుతామని చెప్పారు. అమెరికా, ఇజ్రాయెల్‌లతో యుద్ధానికి సైనిక చర్య ఎంతమాత్రం పరిష్కారం కాదన్నారు. హోర్ముజ్ వద్ద పరిస్థితి చాలా క్లిష్టంగా ఉందని, అయితే, ఇక్కడి నుంచి నౌకలు సురక్షితంగా కదిలేందుకు ఎలాంటి సాయం అందించడానికైనా ఇరాన్ సిద్ధంగా ఉందని ప్రకటించారు.అమెరికాపై విశ్వాసం లేకపోవడం వల్లే చర్చలు పురోగతి సాధించడం లేదని అభిప్రాయపడ్డారు. అమెరికాను తాము నమ్మకపోవడానికి పలు కారణాలున్నాయని, అయితే, అమెరికాకు మాత్రం ఇరాన్‌పై పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. 40 రోజుల యుద్ధం తర్వాత కూడా అమెరికా ఎలాంటి లక్ష్యాన్ని సాధించలేదని, అందుకే ఇరాన్‌తో చర్చలకు ప్రతిపాదించారని, తమకు అమెరికన్లపై నమ్మకం లేదని అబ్బాస్ అరాగ్చీ చెప్పుకొచ్చారు. అమెరికాతో దౌత్యపరంగా ఇబ్బందులున్నాయన్నారు. అమెరికా, ఇరాన్ మధ్య పాక్ మధ్యవర్తిత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే.ఈ అంశంపై కూడా అబ్బాస్ స్పందించారు. పాక్ దౌత్యచర్యలు విఫలం కాలేదని, కానీ, అమెరికా వైఖరి సరిగ్గా లేకపోవడం వల్ల ఆ దేశంపై విశ్వాసం లేదని చెప్పారు. ఈ విషయంలో తమకు చైనా సహకరించినా స్వాగతిస్తామని అభిప్రాయపడ్డారు.

**అమెరికా పతనంలో ఉందన్న జిన్‌పింగ్..**

అమెరికా పతనం అంచున ఉందని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. దీన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఏకీభవించారు. అయితే, అది మాజీ అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో అంటూ విమర్శలు చేశారు. తన పరిపాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ఆయన పోస్టు పెట్టారు. అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికాను క్షీణిస్తున్న దేశంగా అభివర్ణించారని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, నిద్రమత్తులో ఉండే జో బైడెన్ పరిపాలనను ఉద్దేశించి ఆయన ఆ వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ విషయంలో చైనా అధ్యక్షుడితో తాను 100% ఏకీభవిస్తానని తెలిపారు. బహిరంగ సరిహద్దులు, అధిక పన్నులు, దారుణమైన వాణిజ్య ఒప్పందాలు, పెరిగిన నేరాలతో సహా అనేక కారణాలతో అమెరికా అపారంగా నష్టపోయిందంటూ బైడెన్ పరిపాలనను విమర్శించారు. తన 16 నెలల అద్భుతమైన పదవీకాలంలో దేశం అసాధారణమైన పురోగతి సాధించిందని ట్రంప్ వెల్లడించారు. రికార్డ్ స్థాయి స్టాక్‌మార్కెట్లు, కొత్త పెట్టుబడి నిబద్ధతలు, వెనెజువెలాలో సైనిక విజయం, సైనిక చర్యతో ఇరాన్‌ను నాశనం చేయడం (ఇది ఇంకా కొనసాగుతోంది) వంటివి ఎన్నో జరిగాయన్నారు. నిజానికి ఇంత తక్కువ సమయంలో ఇన్ని అద్భుతమైన విజయాలు సాధించినందుకు జిన్‌పింగ్ తనను అభినందించాలని వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా రెండేళ్ల క్రితం తమ దేశం నిజంగానే పతనం అంచున ఉందని ట్రంప్ తెలిపారు. కానీ, ఇప్పుడు అమెరికా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న దేశమని వెల్లడించారు.

# హోర్ముజ్‌లో చిక్కుకుపోయిన నౌకలు

## పెరిగిపోతున్న ట్రాఫిక్.. రోజుకు 40 నౌకలే రవాణా



హోర్ముజ్ వద్ద ప్రస్తుతం 360 వరకు వాణిజ్య నౌకలు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. వివిధ దేశాలకు చమురు, ఆహారం, ఇతర ఉత్పత్తులు రవాణా చేసే నౌకలివి. దీంతో ఆయా దేశాలు సమస్యలు ఎదుర్కొంటున్నాయి. 360 వరకు నౌకలు చిక్కుకుపోవడంతో ఈ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ పెరిగిపోయింది.అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో రోజుకు

టెహ్రాన్:హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని ఇరాన్ అంత సులభంగా అనుమతించడం లేదు. దీంతో ప్రస్తుతం 360 వరకు వాణిజ్య నౌకలు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని ఇరాన్ అంత సులభంగా అనుమతించడం లేదు. దీంతో

40 నౌకలు మాత్రమే ఇక్కడినుంచి కదులుతున్నాయి. దీంతో నౌకా రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రపంచంలోనే అత్యంత రద్దీ అయిన సముద్ర రవాణా మార్గం ఇది. అంతర్జాతీయ ఆర్థిక ప్రగతికి కూడా ఈ మార్గం కీలకం. దాదాపు 20 శాతం నౌకలు ఈ మార్గం నుంచే వెళ్తాయి. అందులోనూ చమురు, గ్యాస్ నౌకలు ఎక్కువగా రవాణా జరిగేది ఈ ప్రాంతం నుంచే. అలాంటిది, ఇక్కడ నౌకలు నిలిచిపోవడంతో అంతర్జాతీయంగా చమరు సంక్షోభం మొదలైంది. చమురు మార్కెట్లు, ప్రభుత్వాలు, షిప్పింగ్ కంపెనీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. షిప్పింగ్ ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ ప్రకారం.. ఇక్కడ 360 వాణిజ్య, ఆహారోత్పత్తుల నౌకలు నిలిచిపోయాయి.వీటిలో అతికష్టం మీద రోజుకు 40 నౌకలు మాత్రం కదులుతున్నాయి. ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని రక్షించేందుకు అమెరికాకు చెందిన నౌకలు రక్షణ కల్పిస్తున్నాయి. అయినప్పటికీ, నౌకల రవాణా చాలా తక్కువగా ఉంది. ఇలాంటి యుద్ధం, దిగ్బంధం వంటి పరిస్థితుల్లో రక్షణ, సహాయం అందించడానికి ఈ ప్రాంతం అంత అనుకూలం కాదు. వన్ వే ట్రాఫిక్ సాధ్యం కాదు. అందుకే అనేక నౌకల్ని రక్షించడం కష్టంగా మారింది. దీంతో ప్రపంచం ఎప్పుడూ చూడని నౌకల బ్లాకేజ్ కొనసాగుతోంది. కాగా ఇరాన్ విదేశాంగ మంత్రి పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు, శాంతి స్థాపనకు భారత్ కీలక పాత్ర పోషించగలదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అన్నారు. ఈ ప్రాంతంలో శాంతి నెలకొనేందుకు దైపాక్షిక, దౌత్యపరమైన చర్చలు మాత్రమే మార్గం అని అబ్బాస్ అభిప్రాయపడ్డారు. బ్రిక్స్ సదస్సులో భాగంగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రస్తుతం ఇండియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రస్తుత యుద్ధాన్ని ముగించేందుకు ఇండియా ఎలాంటి నిర్మాణాత్మక ప్రతిపాదనతో వచ్చినా స్వాగతిస్తామని ప్రకటించారు.



# అడ్రస్ ఒకచోట... పరీక్ష మరోచోట

- హాల్ టికెట్ గందరగోళం.. 10 మంది విద్యార్థులకు తప్పిన ప్రవేశ పరీక్ష
- అడ్రస్ ఉన్న చోటే ఎగ్జామ్ జరగాలి

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, మే 15 (జనంసాక్షి):** గట్టులోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ఎంట్రన్స్ పరీక్షకు వచ్చిన 10 మంది విద్యార్థులు 10 నిమిషాల ఆలస్యం కారణంగా పరీక్షా కేంద్రంలోకి అనుమతించకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ మానవపాడు జూనియర్ కళాశాలను గట్టులో నిర్వహిస్తున్నారు. అయితే హాల్ టికెట్‌లో 'ప్రిన్సిపల్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/జేసీ(జి) మానవపాడ్.గట్టు ఎమ్మార్వో ఆఫీస్ దగ్గరలో' ' అని ఉండటంతో విద్యార్థులు మానవపాడు వెళ్లారు. అక్కడి నుంచి గట్టుకు బైకుపై వస్తుండగా ఆలస్యం కావడంతో అధికారులు లోపలికి అనుమతించలేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు. హాల్ టికెట్‌లో అడ్రస్ తప్పుగా లేదా అస్పష్టంగా ఉంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. కానీ విద్యార్థులు హాల్ టికెట్‌లో ఇచ్చిన అడ్రస్ ఆధారంగానే వచ్చారని, అక్కడికి వెళ్లి సమయం దాటిపోవడంతో పరీక్షకు అనుమతించలేదని వాపోయారు. హాల్ టికెట్‌లో ఉన్న అడ్రస్ అనుగుణంగానే ఎగ్జామ్ జరపాలని, లేకపోతే తమ భవిష్యత్తు అన్యాయం అవుతుందని విద్యార్థులు కోరుతున్నారు.

# 5 కోట్ల 70 లక్షలతో పలు పనులకు శంకుస్థాపన

- శేరిలింగంపల్లి నియోజకవర్గం, కొత్తగూడ, దుర్గం చెరువు, విఠల్‌రావు నగర్‌లో అభివృద్ధి
- ప్రజా సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, మే 15 (జనంసాక్షి):** శేరిలింగంపల్లి నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తెలిపారు. ఈ మేరకు కొండాపూర్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని కొత్తగూడ, దుర్గం చెరువు వద్ద, విఠల్ రావు నగర్, గోకుల్ ప్లాట్స్ కాలనీల లో 5 కోట్ల 70 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఇందులో భాగంగా మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలోని హనుమాన్ దేవాలయం వద్ద దాదాపు రెండు కోట్ల రూపాయల ప్రభుత్వ నిధుల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ నుండి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు మరియు రైల్వే అండర్ బ్రిడ్జి నుండి హఫీజ్‌పేట్ ఫ్లై ఓవర్ వరకు గల మంజీర పైప్ లైన్ రోడ్డు విస్తరణ, ఫుట్ ఫాత్ నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన గావించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా ఇప్పటికే వందల కోట్ల రూపాయలు కేటాయించి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, తాజాగా రెండు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో గోకుల్ ప్లాట్స్‌లో నూతనంగా చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇందువల్ల కాలనీవాసులకు రవాణా మార్గాలు మెరుగుపడి సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించినట్టేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో జిల్లా మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామని, నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధియే తన ప్రధాన లక్ష్యమన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను కోరారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సన్‌సిటీలో ఘోర రోడ్డు ప్రమాదం..

## యువకుడు మృతి

రాజేంద్రనగర్,మే15(జనంసాక్షి)

రాజేంద్రనగర్ పరిధిలోని సన్‌సిటీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం బండ్లగూడ సాయి హర్ష నగర్‌కు చెందిన వుయ్యాల సరిష్ (23) తన స్నేహితుడు క్రిష్ సింగ్‌తో కలిసి బండ్లగూడ కాలీమందిర్ వద్ద టిఫిన్ చేసి బైక్‌పై తిరిగి వెళ్తుండగా, ఉదయం సుమారు 5 గంటల సమయంలో వారి బైక్ టిజి07 ఏఆర్ 0605) అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న అడ్వర్టైజ్‌మెంట్ బోర్డును ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో సరిష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. క్రిష్ సింగ్‌కు గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఐటీఐలలో ప్రవేశాలకు ఆన్‌లైన్

# దరఖాస్తులకు ఆహ్వానం

- పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎన్. మల్లికార్జున స్వామి
- సాంకేతిక కారణాలతో మే 14 నుంచి ప్రారంభం కావాల్సిన దరఖాస్తుల ప్రక్రియ మే 25కు వాయిదా
- మే 25 నుంచి జూన్ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



**పెద్దపల్లి,మే 15(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు), ఏటీసీలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎన్. మల్లికార్జున స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ మెమో, బోనాఫైడ్, కుల ధృవీకరణ పత్రం, ఆధార్, టీసీ తదితర ధ్రువపత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ఈ నెల 14-05-2026 నుంచి ప్రారంభం కావాల్సిన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ సాంకేతిక కారణాల వల్ల 25-05-2026కు వాయిదా పడినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 25-05-2026 నుంచి 08-06-2026 వరకు ఐటిఐ. తెలంగాణ గౌ.ఇన్(ఎచ్ టి టి పి ఎస్:// యుటిఎం సోర్స్ =చాట్ జిపిటి కం) వెబ్‌సైట్‌లో రూ.100 వెరిఫికేషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.01-08-2026 నాటికి 14 సంవత్సరాలు పూర్తి అయిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ సొంత సెల్‌ఫోన్ నంబర్ మరియు ఈ-మెయిల్ ఐడీలను మాత్రమే ఉపయోగించాలని, దరఖాస్తు సమయంలో ఉపయోగించిన ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీలను ఐటీఐ కోర్సు పూర్తయ్యే వరకు మార్చకూడదని సూచించారు. మార్చిన పక్షంలో అడ్మిషన్ రద్దు అయ్యే అవకాశం ఉందన్నారు.రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి అభ్యర్థి తమకు నచ్చిన ట్రేడ్లలో ఎక్కువ సంఖ్యలో ఐటీఐలను ఆప్షన్లుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో కోరారు.

# చిన్నపిల్లలకు ఉచిత యోగ కరాటే శిక్షణ

శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన కొండూరి.



**గంభీరావుపేట మే 15(జనం సాక్షి)** గంభీరావుపేట మండల కేంద్రంలో ఉచిత యోగ కరాటే సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నాయకులు చేరాల లహరిక నిఖిల్ గౌడ్ ఆధ్వర్యంలో కేజీ టు పీజీ క్యాంపస్ ఆవరణలో జరుగుతున్నటువంటి యోగ కరాటే శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం నాస్కబ్ చైర్మన్ కొండూరు రవీందర్రావు పరిశీలించారు వారు మాట్లాడుతూ 15 సంవత్సరాల లోపు చిన్నారులకు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు కరాటే యోగ శిక్షణ ఇస్తూ వేసవి సెలవుల్లో పిల్లలు ఇంట్లో ఫోన్లకు అడాప్ట్ కాకుండా ఆత్మవిశ్వాసం శారీరక దురత్వం పెంపొందించే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేరాల లహరిక నిఖిల్ గౌడ్ విజయవంతంగా నిర్వహిస్తూ యోగ అనంతరం విద్యార్థులకు సైదా అంబలి స్నాక్స్ అందిస్తున్నారు. శిక్షణ ఇస్తున్న కరాటే యోగ మాస్టర్ లు చిన్నపిల్లలకు ముఖ్యంగా మహిళ విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ ధైర్యాన్ని పెంపొందించే ఫిట్నెస్ క్రమశిక్షణ వ్యక్తిగత వికాసం యోగ కరాటే ఎంతో దోహదపడతాయని చిన్నపిల్లలకు విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు ఇంటి వద్ద ఫోన్లకు పరిమితం కాకుండా వారికి యోగ కరాటే వల్ల మానసిక వికాసం తో పాటు శారీరక దృఢత్వం పెంపొందించడానికి ముఖ్యంగా మహిళ చిన్నారులకు కరాటే వారికి ఎంతగానో దోహదపడ్డాయని. అలాగే శిక్షణ నిర్వహిస్తున్న లహరికకు నిఖిల్ గౌడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వెంకట స్వామి గౌడ్ తో పాటు గ్రామ ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి. వార్డ్ సభ్యులు కలవరి శంకర్. చిలక ప్రశాంత్. ఎగదండి అర్జున్. శ్రీమతి ఎగదండి స్వామి. యోగ మాస్టర్ రమేష్. సంజీవరెడ్డి. కరాటే మాస్టర్ విక్రమ్ ఆంజనేయులు. నాయకులు పిట్ల బాబు. దోసల శంకర్. శ్రీనివాస్. సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం

## నూతన డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



**ఘట్‌కేసర్, మే 15 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా బాధ్యతలు స్వీకరించిన ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌ను మేడ్చల్ జిల్లా మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీకి పూలగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ అమలు చేస్తున్న విధానాలను సుధీర్ రెడ్డి అభినందించారు. సీవీ ఆనంద్ నాయకత్వంలో తెలంగాణ పోలీస్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, ప్రజా రక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీని కోరిన సుధీర్ రెడ్డి, ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నేరాల నిర్మూలనకు, ప్రజలకు మెరుగైన భద్రతా వాతావరణం కల్పించేందుకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

# బైక్‌ను ఢీకొట్టి..పాదచారిపైకి దూసుకెళ్లిన కారు ఇద్దరి మృతి

**చేవెళ్ల, మే 15 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల పరిధిలోని ఎంకేపల్లి నుంచి ఈర్లపల్లి వెళ్లే మార్గంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. గొల్లగూడ గ్రామానికి చెందిన గొంగళ్ల శ్రీరాం తన ఎఫ్‌జెడ్ బైక్ పై ఎంకేపల్లి వైపు నుంచి ఈర్లపల్లి వైపు వెళ్తుండగా, అదే దారిలో వెనుక నుంచి వేగంగా వచ్చిన బాలెనో కారు ఢీకొట్టింది. అనంతరం అదుపుతప్పిన కారు ముందుకు వెళ్లి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న ఈర్లపల్లికి చెందిన ఫకీర్ మహబూబ్‌షాను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఫకీర్ మహబూబ్ షా సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో గొల్ల శ్రీరామ్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం నగరంలోని కాంటినెంటల్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన వికారాబాద్ జిల్లా కోస్గి ప్రాంతానికి చెందిన కృష్ణయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.




# కలవర పెడుతున్న లైంగిక దాడులు

## జిల్లాలో 15 రోజుల్లో నాలుగు ఫోక్సో కేసులు నమోదు

### ఫోక్సో కేసులో స్టేషన్ బెయిల్ అంట

ఫోక్సో పోలీసుల దర్యాప్తు ఎంత నిజాయితీగా ఉంటుందో దేవుడు ఎరుగు కానీ ఒక ఫోక్సో కేసులో తాండూరు పోలీసులు నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇవ్వడం పట్ల చర్చనీయ అంశమైంది. రాష్ట్రం కానీ రాష్ట్రానికి చెందిన ఒక నిందితుడికి ఫోక్సో కేసు నమోదు అయితే నిందితుడికి ఒక రాజకీయ నాయకుడు మధ్య వర్తిత్వంతో పోలీసులు బెయిల్ ఇచ్చారు. ఈ విషయమై మీడియా ప్రశ్నిస్తే కిడ్నాప్ కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చిన మాట వాస్తవమని అంగీకరించారు. కానీ పోలీసులు బెయిల్ ఇచ్చిన నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. బేడీలతో పోలీస్ స్టేషన్ నుంచి పరారీ అయ్యాడని విశ్వసనీయ సమాచారం ప్రకా రం తెలుస్తుంది. కానీ స్టేషన్ బెయిల్ ఇచ్చిన తర్వాత నిందితుడు కనిపించకుండా పోయాడని పోలీసులు అంటున్నారు. ఏది ఏమైనా పోలీసుల దర్యాప్తు వాళ్ళ పాత్రలపై జనంలో అనుమానం రేకెత్తుతుంది.



- బాధితుల్లో నలుగురు విద్యార్థులే ఒకరు మృతి
- అందులో ఏడేళ్ల చిన్నారి
- వేసవి సెలవుల్లో ఘటన తల్లిదండ్రుల ఆందోళన
- ఫోక్సో కేసులో స్టేషన్ బెయిల్
- నిందితుడు స్టేషన్ నుంచి పరారీ అంటున్న స్థానికులు




**వికారాబాద్ జిల్లా బ్యూరో మే 15 (జనం సాక్షి):**

ఎన్ని చట్టాలు తెచ్చినా.. ఎన్ని శిక్షలు విధించిన మానవ మృగాల్లో మార్పు రావడం లేదు. ముక్కు పచ్చలారని చిన్నారులపై మైనర్ బాలికలపై దారుణానికి తెగబడుతున్నారు. జిల్లాలో ఇలాంటి అఘాయిత్యాల సంఘటనలు పెరిగిపోవడం పట్ల జిల్లా ప్రజలను కలవరపెడుతుంది. లైంగిక దాడికి గురి అయిన చిన్నారుల మైనర్ బాలికల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు రావడం విద్యార్థినిల పట్ల అమానుషం జరగడం ఆందోళన కలిగిస్తున్న విషయం వివరాల్లోకి వెళితే. వికారాబాద్ జిల్లా తాండూర్ యాలాల బషీరాబాద్ కోట్ పల్లి మండలాలలో గత 15 రోజుల్లో నాలుగు ఫోక్సో కేసులు నమోదయ్యాయి. ఒక చిన్నారి ఇంటి ముందు ఆడుకుంటుండగా అఘాయిత్యానికి పాల్పడితే మరో ముగ్గురి మైనర్ బాలికలపై ఇంటిదగ్గర లైంగిక దాడి జరిగింది. కో ట్ పల్లి తాండూర్ బషీరాబాద్ మండలాలలోని ఓ గ్రామంలో మైనర్ బాలికలపై చిన్నారిపై జరిగిన లైంగిక దాడి మరువకముందే ఈ యాలాల మండలంలోని ఒక గ్రామంలో మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగింది. మంచినీళ్లు చార్జర్ కావాలంటూ మైనర్ బాలికను ఒంటరిగా చూసి ఇంట్లోకి వెళ్లి షేక్ ఫరక్(19) యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. స్థానిక పాఠశాలలో మైనర్ బాలిక చదువుకుంటుంది. ఈ విషయమై పోలీసులు ఫోక్సో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం బషీరాబాద్ మండలంలో ని ఒక గ్రామంలో ఏడేళ్ల చిన్నారిపై నరేష్ అనే యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఒక పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న చిన్నారికి చాక్లెట్లు ఇప్పిస్తానని అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ విషయమై బషీరాబాద్ పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే వారం రోజుల క్రితం తాండూరు పట్టణంలో ప్రేమ పెళ్లితో ఒక మైనర్ బాలికను వంచించిన ఘటన జరిగింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముజాఫర్ నగర్ చెందిన ఆసిఫ్ ఎలియాస్ అజీమ్ పట్టణంలోని ఒక మైనర్ బాలికలు ప్రేమ పెళ్లితో వంచించి ఢిల్లీకి తరలించే ప్రయత్నం చేశారు. తాండూర్ పోలీసులు హైదరాబాదులో వీరిని పట్టుకొని నిందితులపై కేసు ఫోక్సో నమోదు చేశారు. 15 రోజుల క్రితం కోట్ పల్లి మండలం లోని ఒక గ్రామంలో మైనర్ బాలికపై వరసకు అన్న అయిన సాకేత్ అనే యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అవమానం భరించలేక ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. సంగారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. బాలిక నవాబ్ పెట్ మండలంలోని ఒక గురుకులంలో చదువుకుంటుంది. కో ట్ పల్లి పోలీసులు ఫోక్సో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. వేసవి సెలవులు రావడంతో చిన్నారులు మైనర్ బాలికలంతా వివిధ పాఠశాలల్లో చదువుతూ సెలవుల్లో ఇంటికి వచ్చి లైంగిక దాడులకు గురి అయ్యారు. జిల్లాలో వరుస సంఘటనల పట్ల బాలికల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

# గ్రంథాలయాలు జ్ఞానానికి పునాది, పఠన సంస్కృతికి మార్గదర్శి

- గ్రంథాలయాలు - జ్ఞానానికి పునాది, పఠన సంస్కృతికి మార్గదర్శి
- 5వ రోజు ఎడ్యుకేషన్ వీక్‌లో విస్తృత కార్యక్రమాలు
- పుస్తక పఠన సంస్కృతిని ప్రోత్సహించాలి

**పెద్దపల్లి, మే 15 (జనంసాక్షి):** ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఎడ్యుకేషన్ వీక్ కార్యక్రమాలలో 5వ రోజు "గ్రంథాలయాలు - జ్ఞానానికి పునాది, పఠన సంస్కృతికి మార్గదర్శి" అనే అంశంపై జిల్లావ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ తెలిపారు.శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, జిల్లా విద్యాశాఖాధికారి జి. శారదతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనలు, పుస్తక సమీక్షలు, పఠన చర్చా వేదికలు, గ్రంథాలయాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలను పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ మాట్లాడుతూ, గ్రంథాలయాలు జ్ఞానానికి పునాది, పఠన సంస్కృతికి మార్గదర్శిగా నిలుస్తాయని తెలిపారు. జిల్లాలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం సుమారు రూ.5 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆధునిక గ్రంథాలయ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయాలు పుస్తక పఠనానికి ప్రశాంతమైన కేంద్రాలని, రీడర్స్‌తో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలోని వివిధ మండలాల్లో మొత్తం 253 పుస్తక ప్రదర్శనలు, 224 పఠన, పుస్తక సమీక్షా సమావేశాలు, 171 అంశాధారిత చర్చలు, 143 గ్రంథాలయ, డిజిటల్ లైబ్రరీ అవగాహన కార్యక్రమాలు, 27 పుస్తక దాన కార్యక్రమాలు నిర్వహించగా, మొత్తం 1,969 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నట్లు తెలిపారు.

ప్రతి పాఠశాలలో పఠన సంస్కృతిని అభివృద్ధి చేయడం ద్వారా విద్యార్థుల్లో జ్ఞానార్జనతో పాటు విలువలు, సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యాలు పెరుగుతాయని, కార్యక్రమాలను విజయవంతం చేసిన మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రంథపాఠకులు, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సి.హెచ్. మల్లేష్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి డా. పి.ఎం. షేక్, జి. కవిత, స్థానిక కౌన్సిలర్ కమల్, గ్రంథపాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పూర్తి, ధాన్యం కొనుగోళ్ల వేగంపై కలెక్టర్ ఫోకస్

- గ్రౌండింగ్ పూర్తైన ఇళ్లకు ఐదు రోజుల్లో శాంక్షన్ ఆర్డర్లు
- పతి మండలంలో 10-15 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు సిద్ధత
- ఉపాధి హామీ పనుల్లో కార్మికుల సమీకరణ పెంచాలని ఆదేశం
- రైతు వద్ద చివరి గింజ వరి, మొక్కజొన్న కూడా మద్దతు ధరకే కొనుగోలు



**పెద్దపల్లి, మే 15 (జనంసాక్షి) :**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ఉపాధి హామీ పనులు, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఉపాధి హామీ, హౌసింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, ఉపాధి హామీ పనుల అమలు, ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిపై సమగ్రంగా చర్చించారు. జిల్లాలో ఉపాధి హామీ పనుల అమలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రాబోయే 25 రోజుల్లో కార్మికుల హాజరు గణనీయంగా పెంచి, మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి మండలంలో కనీసం 200 మంది కార్మికులతో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాలకుర్తి, ముత్తారం, ఓదెల, సుల్తానాబాద్, పెద్దపల్లి, ధర్మారం మండలాల్లో రోజువారీ హాజరు 150 నుంచి 200 మంది వరకు ఉండేలా చూడాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం 5.30 నుంచి 6.30 గంటల మధ్య కార్మికుల మొబిలైజేషన్ చేపట్టి, పనులపై చెల్లింపుల వివరాలను అదే రోజు వారికి తెలియజేయాలని స్పష్టం చేశారు. కొన్ని మండలాల్లో ఉన్న ఆఫ్‌కార్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ముత్తారం, జూలపల్లి, శ్రీరాంపూర్ మండలాల్లో పాడైపోయిన కాలువల పూడికతీత పనులను ప్రాధాన్యంగా చేపట్టి సాగునీటి సౌకర్యాలను మెరుగుపరచాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తూ ప్రస్తుతం 605 శాంక్షన్ ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయని, గ్రౌండింగ్ పూర్తైన ప్రతి ఇంటికి ఐదు రోజుల్లోపు ఆర్డర్లు జారీ చేయాలని స్పష్టం చేశారు. రద్దు చేసిన ఇళ్లను ఇతర అర్హులైన లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని సూచించారు. ప్రతి మండలంలో కనీసం 10 నుంచి 15 ఇళ్లకు గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్-3 నుంచి ఎల్-1కు మార్పుల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, ఫీల్డ్ స్థాయి పరిశీలన అనంతరం గెజిటెడ్ అధికారి తుది నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 2బిహెచ్‌కే ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, కేటాయింపు ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

అనంతరం కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాతో కలిసి పెద్దపల్లి మండలం పెద్దకల్వలలోని అన్నపూర్ణ రైస్‌మిల్, పెద్దబొంకూరు రాఘవేంద్ర రైస్‌మిల్‌తో పాటు పలు రైస్‌మిల్లులు, కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో రైతు వద్ద ఉన్న చివరి గింజ వరి, మొక్కజొన్న పంటను కూడా కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ యాసంగి సీజన్‌లో సుమారు 4 నుంచి 4.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, ఇప్పటివరకు 1.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.280 కోట్ల చెల్లింపులు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 13 వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోళ్లు జరుగుతున్నాయని, మే 20 నాటికి 80 శాతం కొనుగోళు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లాలో ఐదేళ్ల తర్వాత మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభించామని, ఇందుకోసం 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు తమ ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు మొక్కజొన్న తరలించినా రవాణా చార్జీలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి చెక్‌పోస్టును తనిఖీ చేసిన కలెక్టర్, బక్రీద్ పర్వదినం నేపథ్యంలో అక్రమంగా ఆవుల రవాణా జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# రైతులు అరిగోసపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- క్వింటాలుకు 7-8 కేజీల కటింగ్
- బస్తాకు ఒక్క రూపాయి లారీ డ్రైవర్‌కు
- ఎమ్మెల్యే ప్రగల్భాలు ఏమయ్యాయి?



**మల్యాల, మే 15 (జనంసాక్షి):** క్వింటాలుకు 7 నుంచి 8 కేజీలు కటింగ్ చేస్తున్నారని, క్వింటాలుకు ఒక్క కేజీకి మించి కటింగ్ చేస్తే పీడీ యాక్ట్ చేయాలన్న ఎమ్మెల్యే మాటలు ఏమయ్యాయని, ఆరుకాలం పండించిన పంటను కొనకుండా రైతులు అరిగోసపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న రోజుల్లో తప్పకుండా చెల్లించుకుంటుందని మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ అన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో శుక్రవారం మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. లారీ డ్రైవర్‌కు బస్తాకు ఒక్క రూపాయి ఇవ్వాలని కొత్త సాంప్రదాయం నాంది పలికిన ప్రభుత్వాన్ని ఏమనాలో అర్థం కావడం లేదని విమర్శించారు. అధికారులు నిర్లక్ష్యం వీడి త్వరితగతిన వరి, మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడం లేదని, ఎక్కడికక్కడ కుప్పలుగా ఉన్నాయని తెలిపారు. 40 రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు, హమాలీల సమస్య ఉందని, ధాన్యం తూకం లేక హమాలీలు పని లేకుండా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ హయాంలో మే 5 నాటికి ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యేదని, వారం పది రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామని రవిశంకర్ గుర్తు చేశారు. అనంతరం సుంకె రవిశంకర్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనగం శ్రీనివాస్, బద్దం తిరుపతి రెడ్డి, నగేష్, తిరుపతి గౌడ్, శేఖర్ రెడ్డి, అనిల్ రెడ్డి, త్రినాథ్, దశరథం రమేష్, చిన్న దుర్గయ్య, అరుణ్ కుమార్, చందు, రంజిత్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ 80 లక్షలతో వైకుంఠ ధామానికి రక్షణ గోడ

**మున్సిపల్ చైర్మన్ పుల్కమ్ రాజు**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే15(జనంసాక్షి) :** వేములవాడలోని ఎల్లమ్మ ఆలయ పరిసర ప్రాంతంలో గల స్వజాల దార బావి ప్రక్కన వైకుంఠ ధామానికి రూ 80 లక్షల వ్యయంతో చేపట్టనున్న వైకుంఠ ధామం (స్మశాన వాటిక) కాంపౌండ్ వాల్ నిర్మాణ స్థలాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు స్థానిక కౌన్సిలర్లు,అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థల లభ్యతన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక సహకారంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుంటామన్నారు.
పట్టణ ప్రగతిలో ప్రజలు,మున్సిపల్ యంత్రాంగం భాగస్వాములు కావాలని, అభివృద్ధి పనులకు అందరూ పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. వేములవాడ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులతో పాటు స్థానిక పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రస్తుత పాలకమండలి పనిచేస్తోందన్నారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణ, అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా మెరుగుపరచడం వంటి అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో వేములవాడ రూపురేఖలు మారబోతున్నాయన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని,ఆయన నాయకత్వంలో పట్టణానికి మరిన్ని నిధులు తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వార్డుల వారీగా ప్రజల నుంచి వస్తున్న వినతులను పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పర్యవేక్షించాలని, ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పనులు జరగాలని సూచించారు. ప్రజలు కూడా తమ వార్డుల్లో జరుగుతున్న పనులను గమనిస్తూ, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని, పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు తోట రాజు, కొండ రాజశేఖర్,మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ సంపత్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేదు..

# వేగవంతంగానే ప్రక్రియ

**మార్కెట్ యార్డ్ క్లీనింగ్‌కు ప్రత్యేక చర్యలు**

**రైతులు ఆందోళన చెందవద్దు : మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య**



**కరీంనగర్ బ్యూరో, మే 15 (జనంసాక్షి):** కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగానే కొనసాగుతున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం లేదని, వరి, మొక్కజొన్న కొనుగోళ్లు యథావిధిగా సాగుతున్నాయని తెలిపారు. గురువారం రోజు ఉదయం మార్కెట్ యార్డును స్వయంగా సందర్శించిన చైర్మన్ ఆకుల నరసన్న, యార్డులో పారిశుధ్య నిర్వహణపై అధికారు లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. రెండు నుంచి మూడు రోజుల్లో మార్కెట్ యార్డ్ మొత్తం క్లీనింగ్ పనులు పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన అన్నారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తు న్నామని తెలిపారు. చివరి గింజ వరకూ వరి, మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని, ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని గుర్తుంచుకోవాలని ఆకుల నరసన్న పేర్కొన్నారు.

# భూ సర్వేను అడ్డుకున్న రైతులు

**సర్వే పనులను తాత్కాలికంగా నిలిపివేసిన అధికారులు**



**ముత్తారం మే 15(జనంసాక్షి) :** ముత్తారం మండలం ధర్యాపూర్ పంచాయతీ శివారులో శుక్రవారం రెవెన్యూ అధికారులు భూ సర్వే చేపట్టారు. 144,245గల సర్వే నెంబరులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించేందుకు అధికారులు రావడంతో విషయం తెలుసుకున్న స్థానిక రైతులు అక్కడకు చేరుకుని సర్వేను అడ్డుకున్నారు . 40 ఏళ్లుగా ఈ భూముల్లో సాగు చేసుకుంటున్నామని 144,145 సర్వే నెంబరులో ప్రభుత్వ భూమి ఉందని,కొన్ని సంవత్సరాలనుండి ఈ భూములను సాగు చేసుకొని జీవిస్తున్నామని అన్నారు.. 40 ఏళ్లుగా సాగులో ఉన్న తమకు అన్యాయం చేస్తే సహించబోమన్నారు. ప్రభుత్వ భూమిపై సమగ్ర సర్వే చేసి ఇన్నేళ్లుగా కాస్తులో ఉన్న తమకు న్యాయం చేయాలని స్థానికులు అధికారులను కోరారు. సంఘటన స్థలం వద్ద ఉన్న రెవిన్యూ అధికారి మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ సర్వే చేయడం జరుగుతుందని రైతుల సమస్యలు ఉంటే నేరుగా మండల తహశీల్దార్ ను సంప్రదిస్తే వారు రైతులకు న్యాయం జరిగేలా చూస్తారని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి వివరణ కోరగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఎంత ఉందో గుర్తించేందుకే ప్రాథమికంగా సర్వే చేపట్టామని,ఎవరి పట్టా భూములను లాక్కోమని,సర్వేకు అందరు సహకరించాలని అన్నారు. జిల్లా ఉన్నత అధికారుల మేరకు ధర్యాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిని ప్రభుత్వ అవసరాల నిమిత్తం సర్వే చేయడం జరుగుతుందని వెల్లడించారు.

# సింగరేణి ఓబీ మట్టి అక్రమ విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

- హైకోర్టును ఆశ్రయించిన సామాజిక కార్యకర్త పుట్ట ముఖేష్



**మంథని, (జనంసాక్షి) :** సింగరేణి బొగ్గు గనుల నుంచి వెలికితీసిన ఓబీ (ఓవర్‌బర్డెన్) మట్టి అక్రమ విక్రయాల వ్యవహారంపై తక్షణ చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త పుట్ట ముఖేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పలు అంశాలను ప్రస్తావించారు. సింగరేణి బొగ్గు గనుల నుంచి వెలికితీసిన ఓబీ మట్టిని నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తూ సాగిస్తున్న అవినీతి వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించిందని పేర్కొన్నారు. పర్యావ రణానికి ముప్పు కలిగించే ఈ అంశంపై తాను దాఖలు చేసిన రిట్ పిటిషన్ నంబర్ 14035/2026ను విచారించిన ధర్మాసనం, సింగరేణి సంస్థతో పాటు సంబంధిత జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో బొగ్గు తవ్వకాల కోసం కేటాయించిన ఓబీ నిల్వల నుంచి మట్టిని మైనింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నేషనల్ హైవే, కారిడార్, పీడీఆర్ వంటి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు విక్రయిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో న్యాయపోరాటానికి దిగాల్సి వచ్చిందన్నారు. ఓబీ మట్టి అక్రమాలపై నాలుగు వారాల్లో సమగ్ర విచారణ చేపట్టాలి. సింగరేణి సంస్థ, జిల్లా కలెక్టర్లు పూర్తి నివేదిక సమర్పించాలి. పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా మట్టి తవ్విన ప్రాంతాల్లో తిరిగి మట్టిని నింపాలి.
ప్రైవేట్ సంస్థలకు మట్టి విక్రయాల వల్ల కలిగే పర్యావరణ నష్టాన్ని అరికట్టాలి. కోర్టు ఆదేశాలున్నప్పటికీ అధికారులు విచారణలో జాప్యం చేస్తున్నారని పుట్ట ముఖేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

# అఖిల భారత పోలీస్ క్రీడల్లో హుజూరాబాద్ ఏసీపీ మాధవి అద్భుత ప్రతిభ

- టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్‌లో నాలుగు పతకాల పంట
- జాతీయ స్థాయిలో కరీంనగర్ పోలీస్ కీర్తి చాటిన మాధవి
- పోలీస్ ఉన్నతాధికారుల అభినందనలు



**కరీంనగర్ బ్యూరో, మే 15 (జనంసాక్షి):** ఉత్తరప్రదేశ్ లక్నోలో ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన అఖిల భారత పోలీస్ క్రీడా పోటీల్లో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఏసీపీ వి. మాధవి అద్భుత ప్రదర్శనతో రాణించి ఘన విజయం సాధించారు. టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో ఏకంగా నాలుగు పతకాలు సాధించి రాష్ట్ర పోలీస్ శాఖకు, కరీంనగర్ కమిషనరేట్‌కు తీరని కీర్తి తెచ్చిపెట్టారు. ఏసీపీ మాధవి టేబుల్ టెన్నిస్‌లో జి.ఓ. 50o మిక్స్‌డ్ డబుల్స్‌లో రజత పతకం, జి.ఓ. 40o మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం, ఎన్.జి.ఓ. మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం సాధించారు. బ్యాడ్మింటన్‌లో జి.ఓ. 50o మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన గట్టి పోటీని తట్టుకొని ఈ విజయం సాధించడం గొప్ప విషయం. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, సహచర అధికారులు మాధవిని ఘనంగా అభినందించారు. విధి నిర్వహణలో బిజీగా ఉంటూనే క్రీడల పట్ల మక్కువతో కఠోర శ్రమతో జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి సాధించిన ఈ విజయం కరీంనగర్ పోలీస్ శాఖకు గర్వకారణమని అధికారులు వ్యాఖ్యానించారు.

# కరీంనగర్ మార్కెట్ యార్డులో గంగుల కమలాకర్ తనిఖీ



**కరీంనగర్ టౌన్ మే 15 ( జనం సాక్షి) :** కరీంనగర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత 15 రోజులుగా మార్కెట్‌కు తీసుకొచ్చిన మక్కలను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. మార్కెట్‌లో తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు దొంగల బెడద తీవ్రంగా ఉందని రైతులు వాపోయారు. దీనిపై స్పందించిన గంగుల కమలాకర్ మార్కెట్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాల ముప్పు ఉన్నందున యుద్ధ ప్రాతిపదికన మక్కలకు కాంటా వేసి, సరిపడా లారీలు ఏర్పాటు చేసి వెంటనే గోదాంలకు తరలించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, పొన్నం అనిల్, ఏనుగు రవీందర్ రెడ్డి, తిరుపతి నాయక్, సుంకిశాల సంపత్ రావు, గోనె నర్సయ్య, మంద రాజమల్లు, అరె శ్రీకాంత్, పబ్బతి రంగారెడ్డి, జువ్వాడి రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడ ఏరియా ఆస్పత్రి తనిఖీ చేసిన కలెక్టర్

**కామారెడ్డి ప్రతినిధి, మే 15 (జనంసాక్షి) :** బాన్సువాడలోని మాతా శిశు ఆసుపత్రి ని కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తనిఖీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులు, సిబ్బందితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, మెరుగైన సదుపాయాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోగులకు అవసరమైన చికిత్స, మందులు, వైద్య సేవలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆసుపత్రులలో పరిశుభ్రత, సమయపాలన, సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అనంతరం నూతన ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఏరియా ఆసుపత్రి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యత, పురోగతి స్థితిని సమీక్షించి, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య, ఏఈ టీఎస్ఎం ఎస్ఐడీసీ సాగర్ రెడ్డి, ఏరియా ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులు అరెస్ట్

గోదావరిఖని, జనంసాక్షి:స్థానిక రామ్‌నగర్‌లోని శ్రీ కోదండ రామాలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను గోదావరిఖని × టౌన్ పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై రమేష్ తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కళ్యాణ్‌నగర్‌కు చెందిన బండోజు సాయి సంతోష్ (23), హనుమాన్ నగర్‌కు చెందిన ఎస్.కె. అఖిల్ (25) అనే ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి చెరో 32 గ్రాముల చొప్పున మొత్తం 64 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.3,200గా అంచనా వేశారు. నిందితులు నేరాన్ని ఒప్పుకోవడంతో, పోలీసులు ఆస్తి రాబట్టి పంచనామా నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రమేష్ ఫిర్యాదు మేరకు గోదావరిఖని × టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

# పసివాడి ప్రాణంతీసిన బిల్డర్ నిర్లక్ష్యం

**సంపులో పడి ఐదేళ్ల బాలుడు మృతి.. మేడిపల్లిలో విషాదం**






**బోడుప్పల్ (జనంసాక్షి) :** బిల్డర్ అజాగ్రత్త కారణంగా ఓ బాలుడు సంపులో పడి మృతిచెందిన విషాద ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఒంగోలు జిల్లా కందుకూర్ మండలం రాల్లపాడు గ్రామానికి చెందిన జూపల్లి మహేందర్ కుమారుడు మహేష్ (5) కుటుంబంతో కలిసి మేడిపల్లి సత్యనారాయణపురం కాలనీలో నివాసం ఉంటున్నారు. బాలుడి తల్లిదండ్రులు ధరణి కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్ద కూలి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఆటలాడుకుంటూ అక్కడే ఉన్న నీటితో నిండిన సంపునకు మూత లేకపోవడంతో అందులో పడి మృతి చెందాడు. కొంతసేపటి తర్వాత బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. అనంతరం సంపులో బాలుడు ఉండటాన్ని గమనించి బయటకు తీశారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. నిర్మాణ ప్రదేశంలో భద్రతా చర్యలు చేపట్టకుండా సంపును తెరిచి ఉంచడమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నేటి నుండి పిజెఆర్ స్టేడియంలో వాలీబాల్ టోర్నమెంట్

శేరిలింగంపల్లి, మే 15 (జనంసాక్షి) : నేటి నుండి చందానగర్ పరిధి పిజెఆర్ స్టేడియంలో బాల బాలికలకు వాలీబాల్ టోర్నమెంట్ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కట్ల శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన తండ్రిగారైన కట్ల మల్లారెడ్డి జ్ఞాపకార్థం శనివారం నుండి చందానగర్ పరిధి పిజెఆర్ స్టేడియంలో మూడు రోజులపాటు బాలబాలికలకు త్రీ ఏ సైడ్ వాలిబాల్ టోర్నమెంటును నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

# ట్రామా కేసుల్లో గోల్డెన్ అవర్ కీలకం

**మెడికవర్ వైద్యులు రాజీవ్‌రెడ్డి, వేణుగోపాల్**




**హుజురాబాద్, మే 15 (జనం సాక్షి ) :** ట్రామా కేసుల్లో 'గోల్డెన్ అవర్' అత్యంత కీలకమని, రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని మెడికవర్ ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం హుజురాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ముఖ్యంగా యువత అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధితులను సమీప ఆసుపత్రికి తరలించడం అత్యంత అవసరమని చెప్పారు. ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంటను వైద్య రంగంలో 'గోల్డెన్ అవర్'గా పరిగణిస్తారని, ఈ సమయంలో సరైన చికిత్స అందితే మెదడు, వెన్నెముక, అంతర్గత అవయవాలకు జరిగిన నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలు, వెన్నెముక దెబ్బతినడం, ఎముకలు విరగడం, అంతర్గత రక్తస్రావం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయని తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో బాధితుడిని నిర్లక్ష్యంగా కదిలించడం ప్రమాదకరమని, సాధ్యమైనంత వరకు మెడ, వెన్నెముకకు మద్దతు ఇస్తూ అంబులెన్స్‌లో తరలించాలని సూచించారు. ప్రమాద స్థలంలో గుమిగూడే ప్రజలు వీడియోలు తీయడం కంటే బాధితుడిని రక్షించే దిశగా ముందుకు రావాలని కోరారు. ప్రమాదం తర్వాత కొంతమంది బాధితులు బయటకు బాగానే కనిపించినా లోపల మెదడు రక్తస్రావం వంటి తీవ్రమైన సమస్యలు ఉండే అవకాశం ఉందన్నారు. తలకు బలమైన దెబ్బ తగిలినప్పుడు తలనొప్పి, వాంతులు, మూర్ఛ, స్పృహలో మార్పులు కనిపిస్తే వెంటనే న్యూరో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రమాదాల సమయంలో ఎముకలు విరిగిన వారిని సరైన పద్ధతిలో తరలించకపోతే శాశ్వత వికలాంగత్వం వచ్చే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా వెన్నెముక గాయాలున్న వారిని జాగ్రత్తగా తరలించడం చాలా అవసరమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక చికిత్సపై ప్రజలకు అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాద బాధితులకు సహాయం చేసే వారిపై చట్టపరమైన ఇబ్బందులు ఉండవని, ప్రభుత్వం 'గుడ్ సమారిటన్' నిబంధనల ద్వారా రక్షణ కల్పిస్తోందని తెలిపారు. అందువల్ల ప్రజలు భయపడకుండా ముందుకు వచ్చి బాధితులను ఆసుపత్రికి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చని వైద్యులు పేర్కొన్నారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మార్కెటింగ హెడ్ కోట కర్ణాకర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.





# అభివృద్ధికి నోచుకోని పెద్దదిన్నె రైల్వే స్టేషన్

- 1978లో అప్పటి రైల్వే శాఖ మంత్రిచే ప్రారంభం
- ఐదు గ్రామాలకు సౌకర్యంగా ఉన్న పట్టించుకోవడం లేదు
- గ్రామం మధ్యలో ఉండటంతో సబ్ వే ఏర్పాటుకు రైల్వే అధికారుల వినతి

**ఇటిక్యాల, మే 15 (జనం సాక్షి):** గ్రామీణ ప్రజల సౌకర్యార్థం పెద్దదిన్నె రైల్వే స్టేషన్ ను ఏర్పాటు చేసి 48 సంవత్సరాలు అవుతున్న ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో రైల్వే అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని పెద్దదిన్నె రైల్వే స్టేషన్ ను 1978లో అప్పటి రైల్వే శాఖ మంత్రి మధు దండావతే ప్రారంభించారు. పెద్దదిన్నెతోపాటు శివనంపల్లి, మొగల్ రావులచెరువు, పెద్దదిన్నె, గోపలదిన్నె, ఊదండాపురం, రేపల్లె గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని కర్నూలు మహబూబ్ నగర్, హైదరాబాద్ పట్టణాలకు వెళ్లేందుకు ఇక్కడ ప్యాసింజర్ రైలు మాత్రమే ఆపే ఏర్పాటు చేశారు. ప్రతినిత్యం 100 మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్యాసింజర్ రైలు వీరికి ఆధారం.
ఉదయం వేళల్లో కర్నూల్- కాచిగూడ డెమో, గుంతకల్ -కాచిగూడ ప్యాసింజర్, కాచిగూడ- గుంటూరు రైళ్లు ఇక్కడ ఆగుతాయి. ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం లేకపోగా ఫ్లాట్ ఫాం స్టేషన్ ఇరువైపులా పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరిగి రాత్రి సమయంలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

**గ్రామ మధ్యలో రైల్వే ట్రాక్ ఉండడంతో ప్రమాదాలు**

పెద్దదిన్నె గ్రామం మధ్యలో రైల్వే ట్రాక్ ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చిన్న పనికి సైతం ఆయా కాలనీవాసులు ట్రాక్ దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్తులు తెలుపుతున్నారు. గతంలో ఉన్న లెవెల్ క్రాసింగ్ దగ్గర సబ్ వే ఏర్పాటు చేయాలని, స్మశాన వాటిక ట్రాక్ అవతల ఉండడంతో ఎవరైనా చనిపోతే ఇబ్బందికరంగా ఉంటుందని రైల్వే అధికారులకు విన్నవించినట్లు గ్రామస్తులు తెలిపారు.

**రైల్వే స్టేషన్ అభివృద్ధికి అధికారులకు విన్నవించాం: జయసింహ, పెద్దదిన్నె**

గ్రామానికి చెందిన బద్రి నారాయణరావుకు అప్పటి రైల్వే శాఖ మంత్రి సన్నిహితుడు కావడంతో ప్రజల సౌకర్యార్థం రైల్వే స్టేషన్ ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు కనీసం తాగునీటి సౌకర్యం లేదు. దివ్యాంగుల ప్రత్యేక అవసరాలకు గది నిర్మించిన సరైన సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారి ముళ్ళపొదలు, కంపచెట్లతో ఇబ్బందికరంగా ఉంది.

**ఆధునీకరణకు నిధులు మంజూరు: ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ.**

రైల్వే అధికారులు పట్టణ ప్రాంతాలలో కోట్ల రుపాయలు ఆధునీకరణ పేరుతో ఖర్చు చేస్తుండగా చిన్న రైల్వే స్టేషన్ అభివృద్ధి మరిచారు. కనీస సౌకర్యాలకు ఏటా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తే ప్రయాణికుల సంఖ్య పెరుగుతుంది. రైల్వే స్టేషన్ గ్రామం మధ్యలో ఉండటంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

# ముఖ్యమంత్రితో నోరి దత్తాత్రేయ భేటీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు నోరి దత్తాత్రేయ కలిసి క్యాన్సర్ అట్లాస్ ఆఫ్ తెలంగాణను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చోంగ్థూ పాల్గొన్నారు. తెలంగాణలో క్యాన్సర్ వ్యాధిపై సమగ్ర నివేదికను అందజేసిన నోరి దత్తాత్రేయుడిని ముఖ్యమంత్రి అభినందించారు. క్యాన్సర్‌పై పోరాటంలో నోరి దత్తాత్రేయుడు రూపొందించిన అట్లాస్ ఎంతో ఉపయోగకరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి కారణాలను అన్వేషించే అవకాశం ఈ నివేదిక ద్వారా లభిస్తుందన్నారు. నివేదికలో అందించిన డేటా ఆధారంగా క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, క్యాన్సర్ బాధితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో క్యాన్సర్ చికిత్సను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు.

# ప్రధాని పొదుపు సూత్రంలో సుప్రీం

- వారానికి రెండ్రోజులు వర్చువల్ విచారణ



**న్యూఢిల్లీ, మే15 (జనంసాక్షి) :** పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఇంధనం వాడకాన్ని తగ్గించుకోవాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టు కూడా పొదుపు చర్యలు చేపట్టింది. వారానికి రెండు రోజులు సోమ, శుక్రవారం పూర్తి స్థాయిలో వర్చువల్ విధానంలో విచారణ జరపాలని నిర్ణయించింది. అంతేకాదు, మంగళవారం నుంచి గురువారం వరకు హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడతామని, కక్షిదారులు వీలును బట్టి ఎలాగైనా పాల్గొనవచ్చని పేర్కొంది. ఈ మేరకు సుప్రీం కోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేసింది. కొత్త ఏర్పాట్ల ప్రకారం.. ఇంధనం పొదుపులో భాగంగా న్యాయమూర్తులు కూడా కార్ పూలింగ్ ను ప్రోత్సహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సుప్రీం కోర్టు వెల్లడించింది. రోజువారీ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోవడంతో పాటు ప్రతి రిజిస్ట్రీ లేదా సెక్షన్‌లోని 50 శాతం సిబ్బందికి వారానికి గరిష్ఠంగా రెండు రోజులు వర్క్–ఫ్రం–హోమ్‌కు అనుమతించాలని సూచించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకోవాలని, అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఇప్పటికే పలువురు ముఖ్యమంత్రులు, ప్రముఖులు భద్రతా శ్రేణిలో వాహనాలను తగ్గించుకుంటున్నారు.

# సోషల్ మీడియాలో బాధిత బాలిక వివరాల ప్రచారం

- గోప్యతకు భంగం కలిగించడంపై పోలీసుల కేసులు


**హైదరాబాద్, మే15 (జనంసాక్షి) :** బండి భగీరథ్ పోక్సో కేసు మరో కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రుల ఫోటోలు, వీడియోలు వైరల్ చేసిన సోషల్ మీడియా నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లోని కొన్ని ఛానళ్లు బాధిత కుటుంబం వివరాలు బహిర్గతమయ్యేలా ఫోటోలు, వీడియోలు ప్రసారం చేశాయి. ఇవి వైరల్‌గా మారడంతో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలిక, ఆమె కుటుంబ వివరాలు బయటపెట్టిన వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ అకౌంట్లను గుర్తించి సంబంధిత యూఆర్ఎల్‌లను ఉన్నతాధికారులకు పంపించారు. ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకునేందుకు రంగంలోకి దిగారు. బాధితురాలి గోప్యతకు భంగం కలిగిస్తే శిక్ష తప్పదంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులను షేర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ అత్యాచార కేసులో ముగ్గురు పోలీసు అధికారుల సస్పెన్షన్

**కోల్‌కతా, మే15 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో విద్యార్థిని అత్యాచారం, హత్య కేసులో విధినిర్వహణల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు అధికారులపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వేటు వేశారు. ఆ ముగ్గురినీ సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వీరిలో అప్పటి కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయెల్, అభిషేక్ గుప్తా, మనోజ్ మఖోపాధ్యాయ్ ఉన్నారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పటల్‌లోని 31 ఏళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ 2024 ఆగస్టులో అత్యాచారం, హత్యకు గురైంది. ఈ ఘటన సంచలనమైంది. వైద్యులు, విద్యార్థులు, పౌర సమాజం నిరనసలకు దిగారు. ఈ ఘటనలో నిందితులను శిక్షించి న్యాయం చేయాలని, పనిప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఆసుపత్రి అధికారులు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఈ ఘటనకు బాధ్యత వహించాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. సాక్ష్యాలను తారుమారు చేయడం, పోలీసు చర్యలో జరుగుతున్న జ్యాపం, సంస్థాగతమైన నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలతో ఈ కేసును సీబీఐ చేపట్టింది. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఈ ఘటనను బీజేపీ ప్రధానంగా ప్రస్తావించింది. ఆర్జీ కర్ బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. బాధితురాలి తల్లికి రత్న దేబ్‌నాథ్‌కు పానిహతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టిక్కెట్ కూడా ఇచ్చింది. ఆ నియోజకవర్గం నుంచి టీఎంసీ అభ్యర్థి తీర్థంకర్ ఘోష్‌పై రత్న దేబ్‌నాథ్ 28,836 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. ఈ క్రమంలో ఆ ముగ్గరు అధజకారులపై సిఎం తక్షణ చర్యలకు ఉపక్రమించారు.

# జవహర్ నగర్ దోపిడీ కేసులో పురోగతి

- ప్రధాన నిందితులను పట్టుకున్న పోలీసులు



**హైదరాబాద్, మే 15 (జనంసాక్షి) :** జవహర్‌నగర్ నేపాలీ ముఠా దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మమత అలియాస్ మీనా కడాయత్, ఆమె భర్త రమేశ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేపాల్ సరిహద్దుల్లో ఈ దంపతులు అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో నలుగురి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చోరీ జరిగిన రోజు యజమాని ద్విచక్ర వాహనాన్ని తీసుకుని దుండగులు పరారయ్యారు. ఆ బైక్‌ను యాప్రాల్లోని పెట్రోల్ బంకు వద్ద వదిలి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఏజెంట్ భీమ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. ప్రధాన నిందితులను రేపటిలోగా హైదరాబాద్‌కు తరలించనున్నట్లు సమాచారం. అలాగే ఈ కేసులో మిగిలిన నిందితులు నేపాల్‌లో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కౌకూరు గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ దంపతులను బంధించి.. నేపాలీ ముఠా దోపిడీకి పాల్పడిన విషయం తెలిసిందే. దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండితో దుండగులు పరారయ్యారు. ఈ దోపిడీపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ప్రభుత్వాలు మారుతుంటాయి.. ప్రజలు, పార్టీలు శాశ్వతం

- దీర్ఘకాలిక లక్ష్యంతోనే అభివృద్ధి కార్యక్రమాలు
- వే2 న్యూస్ కాంక్లేవ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజలు, పార్టీలు శాశ్వతమని, ప్రభుత్వాలు మారుతుంటాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన వే2 న్యూస్ కాంక్లేవ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఆయన మాటల్లోనే 'నా ఆలోచనపైన కొందరికి భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు.. అందరిని మెప్పించలేం. వందశాతం ప్రజలను మెప్పించాలని కోరుకుంటే మనకు అసంతృప్తి వస్తుంది. 60 నుంచి 75 శాతం మంది మన ఆలోచనలను ఆమోదిస్తే అది అతి పెద్ద విజయంగా చెప్పుకోవచ్చు. మనకు అడ్డు వచ్చిన వారిని తొలగించాలని చూస్తే పాజిటివ్ ఎనర్జీ అంతా అటే పోతుంది. ప్రభుత్వాలు ఏర్పాటు చేశాక తాత్కాలిక సంక్షేమం, అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తుంటాయి.. కాంగ్రెస్ అధికారం ఉన్నప్పుడు ఐటీఐఆర్ కారిడార్ హైదరాబాద్ కు ఇస్తే.. తర్వాత ప్రభుత్వం రద్దు చేసింది.. ఇలాంటివి చాలా ఉదాహరణలున్నాయి. ఆర్టీసీలో దివాళ తీసి ప్రైవేటు పరం చేస్తారనే అభిప్రాయం గత ప్రభుత్వంలో ఉండేది. ఈ రోజు ఆర్టీసీని లాభాల బాట పట్టించాం. ప్రతి నెల ఆర్టీసీకి 350 కోట్ల రూపాయలు ప్రభుత్వం నుంచి చెల్లిస్తున్నాం. రాష్ట్రానికి ఒక ప్రణాళిక ఉండాలి.. భవిష్యత్తు పట్ల స్పష్టత ఉండాలి.. దేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రానికి పూర్తి స్థాయి ప్రణాళిక లేదు. ముఖ్యమంత్రి అయ్యేంత వరకు 17 ఏళ్ల పాటు ప్రతిపక్షంలోనే ఉన్నాను.. ప్రజా సమస్యలపైన అవగహన ఉంది.. ప్రపంచ స్థాయి మేధావులు, కార్పొరేట్ దిగ్గజాలను తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగస్వాములను చేశాం. పాలసీ డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రజాభిప్రాయాన్ని కూడా తీసుకున్నాం. ప్రపంచంలోని అన్ని పెద్ద సంస్థలను ఆహ్వానించి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాం. చెరువులు, కుంటలు, నాలాలు, పబ్లిక్ పార్కులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నారు. చెరువులు, కుంటలు, నాలాలను ఆక్రమించుకుంటే ప్రకృతి క్షమించదు. ఆక్రమణలదారులకు ముందే నోటీసులు ఇస్తున్నాం.. తుమ్మిడికుంటను ఆక్రమించుకుని పంక్షన్ హాల్ కట్టుకుంటే నీళు ఎకకి పోతాయి?" చెరువులు ఆక్రమించుకున్న వారికి డబల్ బెడ్రూం ఇళ్లు ఇస్తున్నాం.. మూసీ లో అక్రమంగా ఉంటున్న వారిని ప్రభుత్వం ఉదారంగా ఆదుకుం టుంది.. డబల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తాం..విద్య, వైద్యం అందిస్తామని హామీ ఇచ్చాం.. వారిని పరోక్షంగా కొందరు ప్రోత్సహిస్తున్నారు.. ఎవరూ మూసీ మురికిలో ఉండాలని కోరుకోరు.. మూసీ నది పేరు ను ఎవరూ తమ బిడ్డలకు పెట్టుకోలేదు. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు మధ్యలో రేడియల్ రోడ్లు నిర్మిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం 7 బుల్లెట్ ట్రైన్లు ఇస్తే అందులో మూడు తెలంగాణకు తెచ్చాం. శంషాబాద్ కేంద్రంగా బల్లెట్ హబ్ ను ఏర్పాటు చేస్తున్నాం. రోడ్డు, ఎయిర్ , పోర్టు కనెక్టివిటి ఏర్పాటు చేస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా రకరకాల కారణంగా రియల్ ఎస్టేట్ గ్రోత్ తగ్గింది..2021 నుంచి 7 యేళ్లు తీసుకుంటే గతం కంటే ఆదాయం పెరిగింది.. ఎక్కడా తగ్గలేదు. కొంత మంది సోషల్ మీడియాలో పెట్టుబడి పెట్టి వాళ్లే రాసి వాళ్లే చూసి వాళ్లే సంతోషిస్తున్నారు. వాళ్లు భ్రమల్లో ఉన్నారు.. నేను వాస్తవంలో ఉంటా.. ఉహాజనీతమైన ప్రపంచంలో ఉండను. వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి వస్తదని కొందరు కలలు కన్నారు. డ్రగ్స్ ను కంట్రోల్ చేయడానికి ఈగల్ ఫోర్స్ ను తీసుకువచ్చాం. ఫామ్ హౌస్ లో పార్టీలు చేసుకుని దొరికిపోయి నన్ను విమర్శిస్తున్నారు. నా కోసం ఏదీ చేయను.. నా జీవితంలో నేను చాలా సౌకర్యంగా ఉన్నా.. 100 శాతం సంతృప్తితో ఉన్న .. భవిష్యత్తు తరాల కోసం ఏదైనా చేయాలన్నదే ఆ ఆలోచన.. మేడిగడ్డ నిర్మిస్తే మేడిపండులా కుప్పకూలిపోయింది.. సామాజిక న్యాయం, సంక్షేమం లాంటి సంస్కరణను ఇందిరాగాంధీ తీసుకున్నారు. మూడో స్టేజ్ సంస్కరణలు పీవీ నరసింహరావు, మన్మోహన్ సింగ్ తీసుకువచ్చారు. రవాణా సౌకర్యం సరిగా లేనప్పుడు ప్రతి గ్రామం లో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేశారు.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ లో అన్ని కులాలు, మతాల విద్యార్థులంటారు.. ఇరవై వేల కోట్లతో 100 స్కూల్స్ ను నిర్మిస్తున్నాం.. 2500 మంది విద్యార్థులు చదువుకోతున్నారు. ప్రభుత్వ స్కూల్స్ లో బ్రేక్ ఫాస్ట్ , మిడ్ డే మిల్ ,స్నాక్స్ ఇస్తాం. టెండర్లు ఇచ్చి కమిషన్లు తీసుకునే వారి ఆలోచన వేరే ఉంటుంది.. నా దగ్గరకి వచ్చి నీకు ఇంత ఇస్తాం పని చేయి అని చెప్పే ధైర్యం ఎవరూ చేయలేదు.. రోజూ 18 గంటలు అధికారులతో సమీక్షలు చేస్తున్న.. అంతకు ముందు ఉన్న వాడు మూడు నెలలకకో సారి రివ్యూ చేసేవాళ్లు..' అని చెప్పుకొచ్చారు.

# హరిత నిధి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలి

- మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హరిత నిధి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. హరిత నిధి 7వ రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గతంలో మంజూరైన ప్రాజెక్టుల అమలు పురోగతిని మంత్రి సమీక్షించగా, పలు కొత్త ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. నర్సరీల ఏర్పాటు, అర్బన్ పార్కుల అభివృద్ధి, అటవీ సంరక్షణ, అటవీ పరిశోధనలు, శిక్షణా కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు, ఎకోటూరిజం అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం లభించింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు హరిత నిధి కీలక వేదికగా పనిచేస్తోందన్నారు. అడవుల సంరక్షణతో పాటు పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ప్రాజెక్టు సమర్థవంతంగా అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులతో పాటు కొత్తగా మంజూరైన ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే విధంగా ప్రాజెక్టులను రూపకల్పన చేసి, పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. అటవీ సంపదను కాపాడడం, జీవ వైవిధ్య పరిరక్షణ, ఎకోటూరిజం అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి హరిత నిధి లక్ష్యాలను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.



# సర్ అర్థర్ కాటన్‌కు జగన్ నివాళి

**అమరావతి, మే15 (జనంసాక్షి) :** సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్.. సర్ ఆర్థర్ కాటన్‌కు నివాళి అర్పించారు. ఈ క్రమంలో వ్యవసాయ, నీటిపారుదల రంగానికి ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా.. 'గోదావరి జిల్లాలు నేడు పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయంటే అందుకు కారణం సర్ ఆర్థర్ కాటన్. సముద్రంలో కలిసిపోతున్న వరద నీటికి అడ్డుకట్ట వేసి రాజమహేంద్రవరం సమీపంలో ధవళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి.. లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించిన మహనీయుడు. వ్యవసాయ, నీటిపారుదల రంగానికి ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేం అని' పోస్టు చేశారు. గోదావరి జిల్లాలు నేడు పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయంటే అందుకు కారణం సర్ ఆర్థర్ కాటన్ గారు. సముద్రంలో కలిసిపోతున్న వరద నీటికి అడ్డుకట్ట వేసి రాజమహేంద్రవరం సమీపంలో ధవళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించిన మహనీయుడు ఆయన అని కోనియాడారు.

# రాహుల్ విదేశీ పర్యటనలపై కిరణ్ రిజిజు అభ్యంతరం

- పార్లమెంట్‌కు సమాచారం ఇవ్వడం లేదన్న కేంద్రమంత్రి



**న్యూఢిల్లీ, మే15 (జనంసాక్షి) :** లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారనాడు ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటరీ నిబంధనలను రాహుల్ పాటించాలని, నిబంధనల ప్రకారం విదేశీ పర్యటనలకు ముందు లోక్‌సభ లేదా రాజ్యసభ సెక్రటేరియట్‌కు ఆ వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. రాహుల్ విదేశీ పర్యటనలు చేసే హక్కును తాము నిరోధించడం లేదని, అయితే సమాచారం మాత్రం ఇవ్వాలని కోరుతున్నామని కిరణ్ రిజిజు చెప్పారు. 'ప్రతి ఎంపీ విదేశీ పర్యటనలకు వెళ్లొచ్చు. కానీ మూడు వారాల ముందు సమాచారం ఇవ్వాలి. రాహుల్ గాంధీని ఆహ్వానించే ఏజెన్సీలు, సంస్థలు ఆ ఖర్చులు పెట్టుకోవచ్చు. అది విదేశీ కంట్రిబ్యూషన్ (నియంత్రణ) చట్టం కిందకు వస్తుంది. అందువల్ల ఆ సమాచారాన్ని హోం శాఖకు షేర్ చేయాల్సి ఉంటుంది' అని అన్నారు. రాహుల్ గాంధీ 2004లో తొలిసారి ఎంపీ అయినప్పటి నుంచి 54 సార్లు విదేశీ పర్యటనలు చేసినట్టు రిజిజు చెప్పారు. '54 పర్యటనలకే అది పరిమితం కాదు. ఎన్నిరోజులు ఆయన విదేశాల్లో ఉన్నారు, ఖర్చుల సంగతేమిటి? ఇవన్నీ లెక్కల్లోకి వస్తాయి. ఆ దృష్ట్యా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నిబంధనలు పాటించి తగిన సమాచారాన్ని అధికారులకు ఇవ్వాలి. మూడు వారాలకు ముందే ప్రతిపాదిత పర్యటనను లోక్‌సభ స్పీకర్‌కు చెప్పాలి. విదేశీ అతిథ్యాన్ని ఆయన అంగీకరించి ఉంటే ఆ విషయాన్ని ఎఫ్‌సీఆర్ఏ కింద హోం శాఖకు తెలియజేయాల్సి ఉటుంది' అని వివరించారు. చట్టం అనేది అందరికీ సమానమేనని, కేవలం లోక్‌సభ విపక్షనేతను ఉద్దేశించి తాను ఈ విజ్ఞప్తి చేయడం లేదని చెప్పారు. దేశంలో అమల్లో ఉన్న చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు.

# యువతి మోసం చేయడంతో వ్యక్తి ఆత్మహత్య

**రంగారెడ్డి, మే15 (జనంసాక్షి) :** సహజీవనం చేసిన మహిళ మోసగించిందని ఆరోపిస్తూ ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొహెడలో ఈ ఘటన చోటుచేసుకుంది. యువతి మోసం చేసిందంటూ వీడియో రికార్డు చేసి గోవర్ధన్ అనే వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నాలుగేళ్లుగా గోవర్ధన్, ఆ యువతి సహజీవనం చేస్తున్నారు. పుట్టిన కుమారుడిని ఆమె విక్రయించి మరో వివాహం చేసుకుందని వీడియోలో గోవర్ధన్ ఆరోపించాడు. అతడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గొలుసుకట్టు చెరువులతో వరదలకు కట్టడి

- భూగర్భ జలాల పెరుగుదలకూ దోహదం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



**హైదరాబాద్, మే 15 (జనంసాక్షి) :** "గొలుసుకట్టు చెరువులకు పెట్టింది పేరు మన హైదరాబాద్. లేక్‌సిటీగా పేరున్న ఈ మహానగరంలో మొత్తం 1384 చెరువులుంటే ఇందులో 625 చెరువుల జాడ కనిపించడంలేదు. ఉన్న 759 చెరువులుకూడా ఆక్రమణలకు గురై కనుమరుగయ్యే ప్రమాదంలో ఉన్నాయి. ఉన్న చెరువులను పరిరక్షించడమే కాకుండా.. కనుమరుగైన చెరువుల జాడ తెలుసుకుని అన్నిటినీ పునరుద్ధరించడమే హైడ్రా లక్ష్యం. గొలుసుకట్టు చెరువుల లింకును తిరిగి అనుసంధానించి వరదల కట్టడికి హైడ్రా కృషి చేస్తోంది. చెరువుల చెంత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యం... ఆ దిశగా హైడ్రా పని చేస్తోంది" అని హైడ్రా కమిషనం ఏవీ రంగనాథ్ అన్నారు. శుక్రవారం "వే2 న్యూస్" కాన్ క్లేవ్‌లో పాల్గొన్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లా డారు. నగర భవిష్యత్తు, చెరువుల పరిరక్షణ, అర్బన్ ఫ్లడింగ్ వంటి కీలక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఉత్తర ప్రదేశ్‌లోని గాలి వానతో అనేకమంది మృతి చెందారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతిన్నప్పుడే ఇలాంటి ఉపద్రవాలు సంభవిస్తాయి. అందుకే ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. పర్యవరణ హితమైన నగర నిర్మాణం ప్రభుత్వ లక్ష్యం... ఆ దిశగా హైడ్రా ముందుకు సాగుతోంది. వరదల సమస్యకు చెరువులు, నాలాల ఆక్రమణలే ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో మొదటివిడతగా 6 చెరువులను అభివృద్ధి చేశాం. మరో 14 చెరువుల అభివృద్ధిని ప్రారంభించాం. నగరం నలుమూలలా ట్యాంక్ బండ్‌లుండాలనేది ప్రభుత్వ లక్ష్యం ఆ దిశగా.. 4 పెద్ద చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ఇలా చెరువులన్నీ అభివృద్ధి చెంది.. వాటి చెంత పార్కులు, గ్రీనరీ పెరిగితే పర్యావరణహితమైన నగర నిర్మాణం జరుగుతుంది. చెరువుల చెంత పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఓపెన్ జిమ్‌లు పెడుతున్నాం. చెరువు చుట్టూ బండ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని వయసుల వారూ చెరువుల చెంత సేదదీరేలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మురికి కూపాలుగా ఉన్న చెరువులు పర్యాటక ప్రాంతాలుగా మారుతున్నాయి. ఇప్పటికే ప్రారంభమైన అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, పాతబస్తీలోని బమ్రుకున్ ఉద్ దౌలా చెరువులను పరిశీలిస్తే ప్రయోజనాలు అందరికీ అర్థమౌతాయన్నారు. న్ణ=ూూ 10 సంవత్సరాల రోడ్‌మ్యాప్‌లో కనీసం 1300 చెరువులను పునరుద్ధరించి అభివృద్ధి చేయగలిగితే భూగర్భ జలాల స్థాయి పెరిగి, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని హైడ్రా కమిషనర్ తెలిపారు. వరద కాలువల పునరుద్ధరణను కూడా పెద్దయెత్తున చేపట్టామన్నారు. ప్యాట్నీ నాలా ఆక్రమణలు తొలగించడంతో వరద సాఫీగా సాగుతోంది. పైన ఉన్న 20కి పైగా కాలనీలకు వరద ముప్పు తప్పించామని చెప్పారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు.. పర్యావరణ పరిరక్షణకు హైడ్రా కృషి చేస్తోందని చెప్పారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370